# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 225 | హైదరాబాద్ | శనివారం 28-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00





అనూహ్యంగా భారత్‌కు అమెరికా మంత్రి.. ట్రేడ్ డీల్‌లో మార్పుల కోసమేనా..?

## సత్యమే గెలిచింది

- మీ అహంకారమే బీఆర్ఎస్ ఓటమికి కారణం:
- ఢిల్లీ మద్యం పాలసీ కేసులో క్లీన్ చిట్ పై కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, భారత శక్తి : సత్యమేవ జయతే.... అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం ట్వీట్ చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న ఆమెపై మోపిన అభియోగాలను నిరాధారమైనవిగా పేర్కొంటూ న్యూఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కేసును కొట్టివేసిన

తరువాయి 11లో



## ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి భేటీ

- కుమారుడి వివాహ వేడుకకు రావాలని ప్రత్యేక ఆహ్వానం
- క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వక సమావేశం
- మార్చి 5న హైదరాబాద్‌లో జరగనున్న వివాహ వేడుక

11లో

## లిక్కర్ స్కాం కేసులో కవితకు క్లీన్ చిట్... కేటీఆర్ స్పందన

ఈరోజు కోర్టులో కవితకు న్యాయం జరిగిందన్న కేటీఆర్
తమ నేతలపై పెట్టిన కేసులన్నీ అబద్ధమని తేలుతుందని ధీమా
కాంగ్రెస్, బీజేపీలు మీడియా ట్రయల్స్‌తో దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శలు

12లో

## హింసతో... ఏం సాధించలేం

- ప్రజాస్వామ్య మార్గంలోనే సేవలందించగలం
- లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలతో సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రితో భేటీ అయిన మావోయిస్టు నేతలు

హైదరాబాద్, భారతశక్తి : హింసాయుత మార్గంలో ఏమీ సాధించలేమనీ, ప్రజాస్వామ్య మార్గంలోనే శాంతియుతంగా ప్రజలకు సేవలందించడానికి వీలవుతుందనీ, ఆ మార్గాన్ని మావోయిస్టులు ఎంచుకున్నందుకు అభినందనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సచివాలయంలో ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు పిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మరో కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్,

తరువాయి 11లో



## ఇరాన్‌తో ఉద్రిక్తతలు..

### ఇజ్రాయెల్ ఎంబసీ అధికారులకు అమెరికా రాయబారి కీలక ఆదేశాలు

- వెంటనే ఇజ్రాయెల్‌ను వీడాలని రాయబారి ఆదేశాలు
- ఇప్పటికిప్పుడు భయపడాల్సిందేమీ లేనప్పటికీ, దేశం వీడితే మంచిదని సూచన
- అమెరికా వెళ్లడానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని స్పష్టీకరణ

11లో






## పవన్ కల్యాణ్ నాకు జీవితాంతం పెద్దన్నే!

- ముంబైలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో 'ఐడియాస్ ఆఫ్ ఇండియా 2026' సదస్సు
- పాల్గొన్న ఏపీ మంత్రి నారా లోకేశ్
- ఏబీపీ జర్నలిస్ట్ మేఘా ప్రసాద్‌తో జరిగిన ఫైర్ సైడ్ చాట్
- ఆసక్తికర సమాధానాలు చెప్పిన నారా లోకేశ్

11లో

## పాకిస్థాన్‌పై దాడులకు ఆత్మాహుతి దళాన్ని రంగంలోకి దించిన తాలిబన్లు!

ఇరు దేశాల మధ్య తీవ్ర స్థాయికి చేరిన పోరు




## 'జీఐ ఆన్ వీల్స్' పేరుతో తెలంగాణ ఆర్టీసీ సరికొత్త కార్యక్రమం..

### దేశంలోనే తొలి ప్రయోగం

- బస్సులపై తెలంగాణకు చెందిన ఆరు జీఐ ట్యాగ్ కళారూపాల ప్రదర్శన
- తొలిదశలో ఆరు ఎక్స్‌ప్రెస్ బస్సులపై ప్రత్యేక స్టిక్కర్లు
- సంస్కృతిని చాటుతూ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యం

11లో

## ఈ ఏడాది చివరికి 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు జరిపిస్తాం

### అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రకటన

- ఈ ఏడాది డిసెంబర్ నాటికి 10 లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అందజేత
- నిరుపేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఉచితం
- రైతు సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయాభివృద్ధికి ఐదు సూత్రాల అమలు
- లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద కోకో సిటీ ఏర్పాటు

11లో



భారత శక్తి

# అమెరికాను మించి ఇజ్రాయెల్...

భారత ప్రధాని నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటన కోసం ఇజ్రాయెల్ వెళ్లారు. ఈ పర్యటన భారత్‌కు అతి కీలకమైనదిగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత్?ఇజ్రాయెల్ సంబంధాలు కేవలం ఆధునిక ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాదు.. దశాబ్దాలుగా రహస్య సహకారంతో ముడిపడి ఉన్నాయి. ఈ దౌత్య బంధం రక్షణ, సాంకేతికతల్లో కీలక పాత్ర పోషిస్తోంది.దౌత్య సంబంధాలు లేనప్పటికీ ఇజ్రాయెల్ 1971లో భారత్‌కు ఆయుధాలు, శిక్షణ అందించి అమెరికా ఒత్తిళ్లను ఎదిరించింది. ఈ రహస్య చర్య భారత విజయానికి ముఖ్య కారణమైంది. ఇది రెండు దేశాల మధ్య విశ్వాసానికి మొదటి గుర్తింపు.ఇక 1980లో పాకిస్తాన్ అణు కార్యక్రమాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్ ధ్వంసా అధికారం సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదన భారత భద్రతా ఆందోళనలను పరిష్కరించే స్ఫూర్తిని చూపింది. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు రెండు దేశాలను వ్యూహాత్మకంగా దగ్గర చేశాయి. ఇరు దేశాల బందాన్ని బలోపేతం చేశాయి.ఇక ఇటీవల ఆపరేషన్ సిందూర్‌కు ఇజ్రాయెల్ పూర్తి మద్దతు ఇచ్చింది. పాకిస్తాన్‌కు టర్కీ డ్రోన్లు అందించింది. వాటితో భారత్‌పై పాకిస్తాన దాడికి యత్నించింది. అదే సమయంలో ఇజ్రాయెల్ భారత్ యాంటీ డ్రోన్ టెక్నాలజీ అందించింది. దీంతో భారత సైన్య పాకిస్తాన్ డ్రోన్లను సమర్థవంతంగా తిప్పికొట్టింది. నెతన్యాహు గతంలో ఐక్యరాజ్యసమితిలో వాషింగ్టన్ కంటే ఢిల్లీనే ఎక్కువగా నమ్ముతామని చెప్పారు. రక్షణ, వ్యవసాయం, ఐటి రంగాల్లో సహకారం ఇప్పుడు అభివృద్ధి చెందుతోంది.ఈ చరిత్రాత్మక సంఘటనలు రెండు దేశాల సంబంధాన్ని విశ్వాసంతో బలపరుస్తున్నాయి. భవిష్యత్తులో సైబర్ భద్రత, డ్రోన్ సాంకేతికతల్లో మరిన్ని భాగస్వామ్యాలు ఆశిస్తున్నాయి. ఇది భారత్ మధ్యప్రాచ్య వ్యూహంలో కీలకమవుతుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించి కలిశారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇక ఎయిర్‌పోర్టులో నెతన్యాహు భార్య కాషాయ రంగు దుస్తులు ధరించి వచ్చింది. ఇలాంటి నేపథ్యంలో మోదీ పర్యటనపై ఒకవైపు సానుకూల విశ్లేషణలు వస్తుండగా కొందరు ఈ పర్యటనతో భారత్‌కన్నా ఎక్కువగా నెతన్యాహుకే లబ్ధి కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు. మోదీ పర్యటన వెనుక రాజకీయ లక్ష్యాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు.గతంలో భారత్ ? ఇజ్రాయెల్ మధ్య సంత్సంబంధాలు ఉండేవి కావు. పాలస్తీనాపై వ్యతిరేకత కారణంగా భారత్ ఇజ్రాయెల్‌ను దూరంగా ఉంచింది. అయితే పీవీ నర్సింహారావు పాలనలో దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. బీజేపీ, సంఘ్ పరివార్ మొదటి నుంచి ఇజ్రాయెల్ అనుకూలంగా ఉనానయి. ఇజ్రాయెల్ ముస్లిం దేశాలకు వ్యతిరేకంగా యుద్ధాలు చేస్తుంది. అందుకే బీజేపీ, సంఘ్ ఇష్టపడతాయి.మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రక్షణ, సాంకేతికతల్లో భారత్?ఇజ్రాయెల్ బంధం బలపడింది. తాజా పర్యటనలో ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో ప్రసంగం చారిత్రకం. అయితే, విపక్షం ప్రభుత్వ వ్యతిరేకతతో బహిష్కరణ ప్రకటించింది.నెతన్యాహు బలహీన స్థితిలో ఉన్నారు. ఎన్నికలు జరిగితే ఓటమి అవకాశం ఎక్కువ. అవినీతి ఆరోపణలు, జుడీషియల్ సంస్కరణలపై ప్రతిపక్షుల వ్యతిరేకత, హమాస్ దాడి ముందు పదవి కోల్పోయే పరిస్థితి. ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు వ్యతిరేకులు, సౌత్ ఆఫ్రికా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి అరెస్ట్ వారెంట్ కోరిందినెతన్యాహు మోదీ ఆహ్వానంతో తన ఇమేజ్‌ను మెరుగుపరచుకోవాలని భావించారు. భారత్ ప్రధాని సందర్శన ఆయనకు దేశీయ, అంతర్జాతీయ గౌరవాన్ని పెంచుతుంది. ఈ ప్రాంతంలో చర్చలు ? శాంతియుత పరిష్కారాలకు భారతదేశం నిరంతర మద్దతు తెలుపుతుందని, ఉద్రిక్తతలను తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రధాన మంత్రి మోదీ వెల్లడించారు. శాంతికి మార్గంగా గాజా శాంతి ప్రణాళికను ఆయన ప్రత్యేకంగా స్వాగతించారు. స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తిగా మద్దతు ఇస్తుందని, మానవాళి ఎప్పుడూ సంఘర్షణ బాధితురాలిగా మారకూడదని పేర్కొన్నారు. ఉమ్మడి మీడియా సమావేశంలో, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రధాన మంత్రి మోదీ పర్యటనను అద్భుతమైనదిగా, అసాధారణంగా అభివర్ణించారు. తక్కువ వ్యవధి ఉన్నప్పటికీ, ఇది చాలా హృదయాన్ని కదిలించేదన్నారు.అంతకుముందు రోజు పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం భావోద్వేగ ప్రభావాన్ని ఆయన ప్రశంసించారు. అది ఇజ్రాయెల్‌లోని ప్రతి ఒక్కరి కళ్ళలో కన్నీళ్లు తెప్పించలేదని అన్నారు. కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ, నెతన్యాహు ఇజ్రాయెల్ భారతదేశం అచంచలమైన స్నేహానికి ఎంతో రుణపడి ఉందని అన్నారు. రెండు దేశాల మధ్య వ్యక్తిగత సంబంధాలను ప్రతిబింబిస్తూ, వారి వివాహానికి ముందు టెల్ అవీవ్‌లోని ఒక భారతీయ రెస్టారెంట్‌లో తన భార్య సారాతో అద్భుతమైన భోజనాన్ని ఆస్వాదించడం గురించి వ్యక్తిగత కథను పంచుకున్నారు.రెండు దేశాల మధ్య ప్రతిభావంతులు, ఆలోచనలు, భావాలు సమావేశమయ్యే అవకాశాలను ఇజ్రాయెల్ నాయకుడు నెతన్యాహు ప్రస్తావించారు. ఈ సంబంధం కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశంలో త్వరలో ప్రభుత్వానికి మధ్య ప్రభుత్వానికి సమావేశం నిర్వహించే ప్రణాళికలను ఆయన ప్రకటించారు. మరిన్ని చర్చలకు ప్రముఖ మంత్రులను ఆహ్వానించే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.అయితే, ఇరాన్‌పై అమెరికా దాడి సందర్భంలో ఇజ్రాయెల్ మద్దతు, గల్ఫ్ దేశాల ఒత్తిళ్లు భారత్‌ను కష్ట పరిస్థితిలో ఉంచవచ్చు.మోదీ పర్యటన భారత్ మధ్యప్రాచ్య వ్యూహాన్ని ప్రభావితం చేస్తుంది. ఇరాన్ వ్యతిరేక చర్యలకు మద్దతుగా కనిపించడం దీర్ఘకాలంలో దక్షిణ ఆసియా సంబంధాలను దెబ్బతీస్తుంది. రెండు దేశాల సహకారం లాభదాయకమైనా, భౌగోళిక రాజకీయాలు జాగ్రత్తలు పాటించాలి.

# ఏపీలో ఫ్రీహోల్డ్ భూములపై కీలక నిర్ణయం


రాజమండ్రి, ఫిబ్రవరి 27,

ఏపీలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించింది. ఈ మేరకు నేడే, రేపో ఉత్తర్వులు కూడా వచ్చే అవకాశం ఉ:ది. మిగిలిన భూములకు సంబంధించి త్వరలోనే సమావేశమై చర్చించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. త్వరలోనే ఈ ఫ్రీహోల్డ్ భూముల అంశంపై క్లారిటీ వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. భూముల సమస్యలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ అమరావతిలోన సచివాలయంలో సమావేశమైంది.. ప్రధానంగా ఫ్రీహోల్డ్ భూములు, 22ఏ, ఈనాం భూముల సమస్యపై చర్చించింది. ఫ్రీహోల్డ్ భూముల అంశంపై సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13.59 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయగా.. వీటిలో 7.85 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించాలనే నిర్ణయానికి వచ్చారు. మిగిలిన 5.74 లక్షల ఎకరాలపై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానం చేశారు. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో కేబినెట్ సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయంతో.. లక్షలమంది రైతులకు ఊరట దక్కింది. ఈ భూముల రిజిస్ట్రేషన్లకు నిబంధనలకు అనుగుణంగా అనుమతించాలని నిర్ణయించారు. ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు ఇచ్చింది.. పేదలకు ఇచ్చిన వ్యవసాయ భూముల్ని 20 ఏళ్లు దాటిన తర్వాత విక్రయించొచ్చని ఫ్రీహోల్డ్ ఆదేశాలు ఇచ్చింది. అయితే గత ప్రభుత్వ హయాంలో భారీగా అక్రమాలు జరిగాయని.. కొంతమంది తక్కువ ధరకు పేదల నుంచి భూముల్ని కొనుగోలు చేసి.. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత ఫ్రీహోల్డ్‌గా మార్చుకునే ఆరోపణలు వచ్చాయి.నిబంధనలకు విరుద్ధంగా లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్‌గా మార్చినట్లు ప్రభుత్వానికి నివేదికలు చేరాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఈ భూముల అంశంపై విచారణ చేయించి.. భారీగా భూముల్ని ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించింది.ఏపీ ప్రభుత్వం 2025 ఆగస్టు 10న ఈ భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆదేశాలను పొడిగించింది. తాజాగా కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం మేరకు 7.85 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్‌కు అనుమతించారు. ఏపీ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత కలెక్టర్లు, రిజిస్ట్రార్లకు ఆదేశాలు రానున్నాయి. మొత్తానికి ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రైతులకు ఊరట దక్కింది. మిగిలిన ఫ్రీహోల్డ్ భూములపై కూడా త్వరలోనే చర్చించి ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు.

# 7న పెద్ద స్టీల్ ప్లాంట్ ప్రారంభం

విశాఖపట్టణం, ఫిబ్రవరి 27,

ఏపీలో దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి కీలక ముందడుగు పడింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి దగ్గర మార్చి 7న ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు మిట్టల్ సంస్థ ట్వీట్ చేసింది. రూ.1.35 లక్షల కోట్లతో.. రూ.2,200 ఎకరాల్లో ఈ స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌కు ఐటీ కంపెనీలు, పరిశ్రమలు క్యూకట్టాయి.. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఇప్పుడు ఒక్కొక్క పరిశ్రమకు సంబంధించి నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయి. తాజాగా మరో ప్రతిష్టాత్మక సంస్థ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన కోసం ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఏఎంఎన్ఎస్ (ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా) సంస్థ అనకాపల్లి జిల్లాలో దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మార్చి 7న శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు ఏఎంఎన్ఎస్ యాజమాన్యం శంకుస్థాపనకు సంబంధించిన వివరాలను 'ఎక్స్' ద్వారా ప్రకటించింది.చాలా కాలంగా ఆసక్తిగా ఎదురు చూస్తున్నామంటూ ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా పేర్కొంది. ట్వీట్‌లో శంకుస్థాపనకు సంబంధించి కంపెనీ ఫోటోతో పాటుగా, గూగుల్ మ్యాప్, ఇతర వివరాలను కూడా ప్రస్తావించింది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు హాజరవుతారనే చర్చ జరుగుతోంది.. అయితే దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. స్టీల్




ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న నక్కపల్లి మండలంలో ప్రాంతాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో పాటుగా అధికారులు పరిశీలించారు. ఈ మేరకు అక్కడ భద్రతా ఏర్పాట్లను కూడా పరిశీలించారు.ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్‌ను దాదాపు రూ.1.35 లక్షల కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. ఈ భారీ పరిశ్రమను రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన భూమిని ఏపీ ప్రభుత్వం కేటాయించింది. ఎకరా రూ.51,39,690 ధరకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు కోసం తొలిదశలో 2,200 ఎకరాలు కేటాయించారు. అంతేకాదు ఏపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు రాయితీలు, ప్రోత్సాహకాలతో ప్యాకేజీ కూడా ప్రకటించింది. అయితే ఈ స్టీల్ ప్లాంట్ తొలిదశ ప్రాజెక్టు పురోగతిని బట్టి రెండోదశ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ఉంటుంది. మొత్తం మీద ఆర్సెలాల్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు మరో ముందడుగు పడబోతోంది.

# అమరావతి రైల్వే లైన్ కు నిధులు
# 2047 కోట్లు.. 57కిమీ దూరం..!

విజయవాడ, ఫిబ్రవరి 27,

రైల్వే డిపార్ట్మెంట్, ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న అమరావతి రైల్వే లైన్ కోసం తెలంగాణ రైతుల నుంచి భూసమీకరణ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ –తెలంగాణ బోర్డర్‌లోని ఎర్రుపాలెం గ్రామం పరిధిలోని రైతులు అమరావతి రైల్వే లైన్ కోసం భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఇప్పటికే దీనికోసం రైల్వే అధికారులు ఎర్రుపాలెం గ్రామస్తులతో పలు దఫాలు చర్చలు జరుపగా దాదాపు అందరూ ఒప్పుకొన్నట్టు అక్కడి స్థానికుడు, అడ్వకేట్ శ్రీనివాస్ తెలిపారు. నిజానికి ఈ ప్రాజెక్ట్‌లో సంక్లిష్టమైన భాగం ఈ భూ సేకరణ అని రైల్వే




భావించింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతుల నుంచి ఏపీ ప్రభుత్వం ఆల్రెడీ సేకరికంచిన భూమి ఉంది. కానీ తెలంగాణలోని ఎర్రుపాలెంలో భూములు అమరావతి రైల్వే లైన్ కోసం ఇస్తారా అని అందరూ అనుమానించారు కానీ తెలంగాణ రైతులు మాత్రం దానికి దాదాపు అంగీకరించడంతో ఈ కొత్త రైల్వే లైన్‌కి అడుగు ముందుకు పడినట్టు అయింది.ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం గ్రామానికి శాతాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడికి సమీపంలో ఉన్న జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయం చాలా పురాతనమైంది. ఇక్కడికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అయినప్పటికీ ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌లో పెద్దగా రైళ్లు ఆగవు. విజయవాడ –భద్రాచలం రోడ్డు మెము, విజయవాడ –డోర్నకల్ ప్యాసింజర్, గోల్కొండ ఎక్స్ ప్రెస్, కృష్ణా ఎక్స్ ప్రెస్ మాత్రమే ఇక్కడ రోజూ ఆగుతాయి. ఈ నాలుగు కాకుండా వారానికి రెండుసార్లు ప్రయాణించే చెన్నై –లక్నో ఎక్స్ ప్రెస్‌కి ఈ స్టేషన్‌లో హాల్ట్ ఉంది. చాలా రోజులుగా ఎర్రుపాలెం సహా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పద్మావతి, శాతవాహన, విజయవాడ –సికింద్రాబాద్ ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్‌లను ఎర్రుపాలెం స్టేషన్‌లో ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ అది ఒక డిమాండ్ గానే ఉండిపోతూ వచ్చింది. అమరావతి బైపాస్ రైల్వే లైన్ ఈ స్టేషన్ నుంచే ప్రారంభం అవుతుందని రైల్వే ప్రకటించడంతో ఎర్రుపాలెం వాసుల మైండ్‌లో కొత్త ఆశలు చిగురించాయి. ఈ లైన్ వల్ల ఎర్రుపాలెం స్టేషన్ హోదా మారి జంక్షన్ అవుతుంది. దానివల్ల అమరావతి వైపు వెళ్లే కొత్త రైళ్ళతోపాటు ఆల్రెడీ ఉన్న కొన్ని అదనపు రైళ్ళకు కూడా ఈ స్టేషన్‌లో హాల్టింగ్ ఇచ్చి తీరాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఊరు కూడా డెవలప్ అవుతోందని ఇక్కడి రైతులు భావిస్తున్నట్టు రెడ్డి అనే మరో గ్రామస్తుడు తెలిపారు. మొదట కాస్త ఇబ్బందిగా ఫీల్ అయినా మూడు నాలుగు దఫాల మీటింగ్స్ తర్వాత తమ భూములు కొత్త రైల్వే లైన్ కోసం ఇవ్వడానికి ఇక్కడి రైతులు ఒప్పుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న భూములు మార్కెట్ ధరలకు మూడు రెట్లు పరిహారం లభించనున్నట్టు కొందరు గ్రామస్తులు తెలిపారు. భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తమ భూములను ఇవ్వడానికి వీరు ఒప్పుకొన్నారు.

ఈ ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్‌లో కూడా భూసేకరణ జరగాల్సి ఉన్నా అది పెద్దగా సంక్లిష్టం కాదు. ఆల్రెడీ అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన భూమి ఉంది. ఇది కాక మరికొన్ని గ్రామాల్లో భూసేకరణ జరగాల్సి ఉన్నా ఏపీ ప్రభుత్వం ఆల్రెడీ ఆ పనిలో ఉంది. రైల్వే పరంగా కృష్ణా నదిపై నిర్మించాల్సి ఉన్న కొత్త బ్రిడ్జి ఒక్కటే పెద్ద పని. ఈ ప్రాజెక్ట్ కోసం 2047 కోట్ల బడ్జెట్ కేటాయించింది రైల్వే. దీనికి 2024లోనే అప్రూవల్ వచ్చేసింది. తెలంగాణాలోని ఖమ్మం జిల్లాకు చెందిన ఎర్రుపాలెం నుంచి ఏపీ లోని గుంటూరు జిల్లాకు చెందిన నంబూరు వరకూ అమరావతి రైల్వే లైన్ నిర్మిస్తారు. ఈ రెండు స్టేషన్‌ల మధ్య కొత్తగా 10 స్టేషన్‌లు రానుండగా వాటిలో ఏపీ రాజధాని అమరావతి ఒకటి. 2029 జనవరి నాటికి ఈ రైల్వే లైన్ పూర్తి అయ్యేలా ప్రణాళికలు జరుగుతున్నాయి. త్వరలోనే భూసేకరణ పూర్తి చేసి ఈ రైల్వే లైన్ నిర్మాణానికి శంఖు స్థాపన చెయ్యాలని రైల్వే శాఖ భావిస్తోంది.

# వైసీపీ ఓటు బ్యాంక్ పరీక్ష

విజయవాడ, ఫిబ్రవరి 27,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు గతంలో ఎన్నడూ లేని విధంగా మతపరమైన అంశాల చుట్టూ తిరుగుతున్నాయి. ముఖ్యంగా తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుకు హిందూ ఓటు బ్యాంక్ ఒక పెద్ద పరీక్షగా మారింది. గతంలో కుల సమీకరణాలు, సంక్షేమ పథకాలే ప్రాతిపదికగా సాగిన రాజకీయం, ఇప్పుడు ఆచారాలు ? సెంటిమెంట్ల వైపు మళ్లింది.కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా తిరుమల నెయ్యి వివాదాన్ని తెరపైకి తెచ్చింది. ఇది కేవలం ఒక నాణ్యత లోపం సమస్యగా కాకుండా, కోట్లాది మంది హిందువుల విశ్వాసాలకు సంబంధించిన అంశంగా మారింది. జగన్ స్వతహాగా క్రిస్టియన్ కావడం వల్ల హిందూ దేవాలయాల పట్ల, ఆచారాల పట్ల ఆయనకు గౌరవం లేదని కూటమి బలంగా ప్రచారం చేస్తోంది. గతంలో తాడేపల్లి ఇంట్లో శ్రీవారి ఆలయ సెట్ వేయడం లాంటివి ఇందుకు దోహదం చేస్తున్నాయి. వైఎస్సార్ హయాంలో తిరుమల రెండు కొండల వివాదం, జగన్ హయాంలో రథాల దగ్ధం వంటి పాత సంఘటనలను ఇప్పుడు నెయ్యి వివాదంతో ముడిపెట్టి ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.తిరుమల పర్యటన సందర్భంగా అన్యమతస్థులు ఇచ్చే డిక్లరేషన్ అంశం జగన్‌ను ఇరకాటంలో పెట్టింది. నిబంధనల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వాలని కూటమి డిమాండ్ చేయగా, జగన్ తన పర్యటనను రద్దు చేసుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇది హిందూ ఓటర్లలో ఒక రకమైన ప్రతికూల సంకేతాన్ని పంపిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీనిని కౌంటర్ చేయడానికే జగన్ ఇప్పుడు హిందూ సానుకూల ముద్ర కోసం ప్రయత్నిస్తున్నారు.తాజాగా పులివెందులలో నాగమల్లేశ్వర ఆలయ ప్రారంభోత్సవంలో జగన్ పాల్గొనడం వెనుక స్పష్టమైన రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. తాను హిందూ వ్యతిరేకిని కాదని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తానని చాటిచెప్పడం జగన్ ఉద్దేశంగా కనిపిస్తోంది. అయితే, కూటమి నేతలు దీనిని కూడా వదలడం లేదు. ఓట్ల కోసమే ఈ భక్తి నాటకాలు అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.జగన్ ఈ రాజకీయ గండం నుంచి బయటపడాలంటే కేవలం ఆలయాల సందర్శన సరిపోదు. క్రిస్టియన్ నేపథ్యం ఉన్నప్పటికీ, హిందూ ఆచారాలను పాటిస్తున్నారనే నమ్మకాన్ని సామాన్య భక్తులలో కలిగించాలి. కేంద్రంలో అధికారం ఉన్న బిజెపి, రాష్ట్రంలో కూటమితో కలిసి హిందూత్వ అజెండాను బలంగా పుష్ చేస్తోంది. దీనిని తట్టుకోవడం జగన్ కు కత్తిమీద సామే. వైఎస్సార్ కాంగ్రెస్ కు అండగా ఉండే దళిత, మైనారిటీ ఓటు బ్యాంకుకు తోడుగా ఉన్న హిందూ ఓట్లు చీలిపోతే, అది పార్టీ మనుగడకే ప్రమాదకరం.జగన్ మోహన్ రెడ్డికి ఇప్పుడు 'హిందూత్వ భయం' పట్టుకుందన్న వాదనలో కొంత నిజం ఉండొచ్చు. ఎందుకంటే, అభివృద్ధి లేదా సంక్షేమం గురించి మాట్లాడటం వేరు, సెంటిమెంట్ తో కూడిన మతపరమైన అంశాలను డీల్ చేయడం వేరు. జగన్ ఈ ఆరోపణల నుంచి బయటపడాలంటే, ఆయన తన సెక్యులర్ ఇమేజ్‌ను మరింత పకడ్బందీగా ప్రదర్శించాల్సి ఉంటుంది

## ప్రేమ పెళ్లి చేసుకున్నాడని హత్య

మండపేట

ద్వారపూడి గ్రామంలో నిన్న రాత్రి అత్యా సంఘటన చోటుచేసుకుంది. మృతుడు పోలిపల్లి సూర్యప్రకాశ్ (41). మృతుడు రాయవరం డిప్యూటీ తహసీల్దార్గా పనిచేస్తున్న సంధ్య తో స్నేహంగా వున్నాడు. వీరిద్దరూ గత రెండు సంవత్సరాలుగా పరస్పరం ప్రేమించుకొని గురువారమే అన్నవరం దేవస్థానంలో వివాహం చేసుకున్నట్లు సమాచారం.

ఈ వివాహంపై యువతి కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేసారు. సుమారు రాత్రి 11:30 గంటల సమయంలో పెళ్లికొడుకు ఇంటికి వెళ్లి అతి కిరాతకంగా రాళ్లతో దాడి చేయడంతో పోలిపల్లి సూర్యప్రకాశ్ తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

సమాచారం తెలిసిన వెంటనే మండపేట రూరల్ ఎస్సై వి. కిషోర్, సీఐ పి.దొర రాజు సిబ్బంది తో ఘటనా స్థలంని చేరుకుని ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు మీడియాకు తెలిపారుఈ దర్యాప్తులో ఈస్ట్ జోన్ డీఎస్పీ విద్యా కూడా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# రాజీనామానే బ్రహ్మాస్త్రం

అమరావతి, ఫిబ్రవరి 27, (న్యూస్ పల్స్)

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలా మంది ఎమ్మెల్సీలు గుడ్ బై చెప్పారు. పార్టీకి రాజీనామా చేయడంతో పాటు పదవులను వదులుకునేందుకు సిద్ధపడ్డారు. కానీ వారి రాజీనామాలు ఆమోదానికి నోచుకోలేదు. దీంతో వారు న్యాయ పోరాటం చేయడం ప్రారంభించారు. దీంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి మండలి చైర్మన్ కు ఏర్పడింది. అందుకే రాజీనామా చేసిన వారిని పిలిపించి వివరణ తీసుకుంటున్నారు మండలి చైర్మన్ మోసేన్ రాజు. నిన్ననే చైర్మన్ ను కలిసి వివరణ ఇచ్చారు జయ మంగళం వెంకటరమణ. ఈరోజు మిగతా ఎమ్మెల్సీలు సైతం చైర్మన్ ను కలిసి తమ వివరణ ఇచ్చారు. తప్పకుండా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం మండలి చైర్మన్ కు ఏర్పడింది. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. ఓ నలుగురు రాజ్యసభ సభ్యులతో పాటు ఏడుగురు వరకు ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. రాజ్యసభ సభ్యుల రాజీనామాకు ఆమోదం లభించడం.. వారి స్థానంలో కొత్త వారి ఎన్నిక కూడా పూర్తయింది. కానీ ఎమ్మెల్సీల విషయంలో మాత్రం రాజీనామాలు ఆమోదానికి నోచుకోలేదు. ఎందుకంటే శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉంది. ఈ ఐదుగురి రాజీనామాను ఆమోదిస్తే ఈ పదవులన్నీ కూటమి ఖాతాలో చేరుతాయి. మండలిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ బలం కూడా పడిపోతుంది. దాదాపు ఏడాదిన్నరకు పైగా తొక్కి పెట్టారు రాజీనామాలను మండల చైర్మన్. కానీ ఇప్పుడు కోర్టు ఆదేశాలతో వారి వివరణ తీసుకుని ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి మండలి చైర్మన్ ది. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 30 మంది వరకు ఎమ్మెల్సీల బలం ఉంది. కూటమికి శాసనమండలిలో పదిమంది మాత్రమే సభ్యులు ఉన్నారు. ఈ ఆరుగురు రాజీనామాను ఆమోదిస్తే కూటమి ఖాతాల్లో చేరనున్నాయి. 20 పైగా బలం పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ రాజీనామాలు ఆమోదించిన మరుక్షణం మరికొంతమంది వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీతో పాటు పదవులకు రాజీనామా చేసే ఛాన్స్ ఉంది. ఇప్పటివరకు అనర్హత వేటు పడుతుందన్న భయంతోనే ఎక్కువమంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వచ్చారు. అయితే ఆ ఆరుగురు రాజీనామాల విషయంలో ఆమోదం లభించిన మరుక్షణం.. చాలామంది వైసీపీ ఎమ్మెల్సీలు పార్టీకి గుడ్ బై చెప్పే ఆలోచనతో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. 2028 వరకు మోసేన్ రాజు పదవీకాలం ఉంది. అందుకే వీలైనంత త్వరగా శాసనమండలిని హస్త గతం చేసుకోవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. కూటమి చైర్మన్ వారి రాజీనామాలను ఆమోదించిన మరుక్షణం.. మరి కొంతమంది ఎమ్మెల్సీలు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ఫిలిం కార్పొరేషన్ పదవీ భర్తీ ఎప్పుడు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 27,

రాజకీయ,సినీ రంగాలకు చాలా దగ్గర సంబంధాలు ఉంటాయి. ప్రస్తుతం ఏపీ డిప్యూటీ స్పీకర్ పవన్ కళ్యాణ్ సినిమా రంగానికి చెందిన వారే. కూటమి గెలిస్తే ఏపీలో సినీ రంగం అభివృద్ధి చెందుతుందని అంతా భావించారు. దీనికి తోడు మొన్న ఎన్నికల్లో చిత్ర పరిశ్రమ అంతా కూటమి గెలవాలని కూడా భావించింది. అయితే గెలిచిన తర్వాత ఏపీ ప్రభుత్వం సినీరంగం విషయంలో సైలెంట్ గా ఉంది. అటు తెలుగు చిత్ర పరిశ్రమ సైతం ఏపీ కంటే తెలంగాణ ప్రభుత్వం విషయంలోనే ఆసక్తిగా ఉంది. ఏపీలో సైతం సినీ రంగానికి సంబంధించిన నియామకాలు కానీ.. ఎటువంటి చర్యలు కానీ లేవు. ముఖ్యంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇంతవరకు భర్తీ చేయలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంటనే ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని భర్తీ చేసింది. పోసాని కృష్ణమురళిని నియమించింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న ఆ పదవి భర్తీ చేయలేదు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ పదవిలో స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజును నియమించింది. ఏపీలో మాత్రం అదిగో ఇదిగో అంటూ రెండేళ్లు దాటిపోయింది. అయితే ఈ పదవి కోసం కూటమిలో చాలామంది ఆశావహులుగా ఉన్నారు. పైగా సినీ రంగానికి చెందిన పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం గా ఉండగా.. నందమూరి బాలకృష్ణ హిందూపురం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఇంకోవైపు మెగా బ్రదర్ నాగబాబు ఎమ్మెల్సీగా ఉన్నారు. వీరంతా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి తమవారికి కట్ట పెట్టాలన్న ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. తెలుగుదేశం పార్టీకి ఆది నుంచి సినీ గ్లామర్ ఎక్కువ. ఆ పార్టీలో చాలామంది పనిచేశారు కూడా. ఒకప్పటి స్టార్ హీరోయిన్స్ జయప్రద, శారద లాంటివారు పనిచేశారు. ప్రస్తుతం రాఘవేంద్రరావు, అశ్విని దత్, మురళీమోహన్ లాంటి వారు ఉన్నారు. జనసేనలో సైతం సినీ గ్లామర్ ఉంది. బిజెపిలో దివంగత కృష్ణంరాజు కుటుంబ సభ్యులు ఉన్నారు. అయితే ప్రస్తుతం ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి విపరీతమైన పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో పవన్ కళ్యాణ్ ఏఎం రత్నం కు పదవి ఇవ్వాలన్న కోరికను బయటపెట్టారు. అది కూడా సీఎం చంద్రబాబు నిర్ణయించాల్సి ఉంటుందని షరతు పెట్టారు. వీలైనంత త్వరగా ఈ పదవిని భర్తీ చేయాలని సినీ పరిశ్రమ నుంచి వస్తోంది. మరి సీఎం చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# ఫ్యామిలీని రాజకీయాల్లోకి తీసుకురావొద్దు

విజయవాడ, ఫిబ్రవరి 27,

సాధారణంగా రాజకీయ పార్టీల అధినేతలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత, వారి కుటుంబ సభ్యుల హడావుడి ఎక్కువగా ఉంటుందనే మాట వాస్తవం. పార్టీలో, ప్రభుత్వంలో వారి పెత్తనం నడుస్తూ ఉంటుంది. గతంలో ఎందరో రాజకీయ నాయకులు.. ఈ తరహాలో విమర్శలు ఎదుర్కొన్న వారే. తెలంగాణలో 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. కుటుంబ సభ్యుల జోక్యం విషయంలో విమర్శలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులకు పదవులు ఇచ్చిన విషయంలో, ప్రతిపక్షాలు అప్పట్లో తీవ్ర స్థాయిలో విమర్శలు చేశాయి. ఇక 2023లో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి విషయంలో కూడా ఇదే తరహాలో విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా కుటుంబ సభ్యుల్లో.. ఆయన సోదరుల పెత్తనం ప్రభుత్వంపై ఎక్కువగా ఉందంటూ ఆరోపణలు వచ్చాయి. ఇక పార్టీ నేతలు కూడా ఏదైనా కావాలంటే వారి వద్దకు వెళుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఏపీలో జగన్ అధికారంలో ఉన్న సమయంలో కూడా.. ఇదే తరహాలో ఆరోపణలు వచ్చాయి. వైఎస్ కుటుంబం ప్రభుత్వం పై పెత్తనం చేలాయిస్తుందని, కొంతమంది ఆరోపణలు చేశారు. దీనితో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. ప్రభుత్వంలో కుటుంబ సభ్యుల జోక్యం విషయంలో కాస్త జాగ్రత్త పడుతున్నారు. కుటుంబ సభ్యులు ఎవరూ.. అమరావతి రాకుండా పవన్ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన నాగబాబుకు కూడా పవన్ కళ్యాణ్.. ఈ అంశానికి సంబంధించి ఓ క్లారిటీ ఇచ్చినట్లు సమాచారం. అనవసరంగా కుటుంబ సభ్యులను అమరావతి తీసుకురావద్దని, సచివాలయానికి గాని, జనసేన పార్టీ కార్యాలయానికి గాని, వారిని దూరంగా ఉంచాలని సూచించారట. అలాగే జనసేన మంత్రులకు కూడా పవన్ కళ్యాణ్ ఇదే తరహాలో స్పష్టమైన సూచనలు చేసినట్లు సమాచారం. అలాగే ఎమ్మెల్యే కార్యాలయాల్లో కూడా.. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు హడావుడి లేకుండా చూసుకోవాలని పవన్ స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది.

# వేగం పెంచుతున్న అధికార పార్టీ

హైదరాబాద్ ఫిబ్రవరి 27,

తెలంగాణలో త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాలనలో వేగం పెంచింది. గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించడమే లక్ష్యంగా అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కార్ నలుగురు కీలక మంత్రులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తం కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. రాబోయే ఎన్నికల నాటికి ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకు ఈ సబ్ కమిటీ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయనుంది. గ్రామీణ మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ఈ ప్లాన్ ప్రధానంగా దృష్టి సారించనుంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ ప్రణాళికను క్షేత్రస్థాయిలో అమలు చేసేలా ప్రభుత్వం యంత్రాంగాన్ని సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ వ్యూహం ప్రకారం.. రాబోయే మూడు నెలల పాటు మంత్రులు, ఉన్నతాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలోనే పర్యటించనున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు, కొత్తగా చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే ప్రభుత్వ పనితీరును ప్రజలకు చేరువ చేయడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనుల సందడి నెలకొనేలా చూడాలని సబ్ కమిటీ నిర్ణయించింది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, వంద రోజుల లోపు స్పష్టమైన మార్పు చూపడం ద్వారా ఎన్నికల బరిలోకి దిగాలని ప్రభుత్వం యోచిస్తోంది. అధికారులకు సైతం స్పష్టమైన గడువులను నిర్దేశించి, పనుల్లో జాప్యం లేకుండా పర్యవేక్షించే బాధ్యతను ఈ నలుగురు మంత్రుల కమిటీకి అప్పగించారు.

==================================

# భూదాన్ ఆశయం..
# రియల్ ఎస్టేట్ మాఫియా మాయాజాలం!

ఖమ్మం, ఫిబ్రవరి 27

ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాలకు కంచుకోట.. ఇప్పుడు అదే జిల్లా ఆక్రమణల కూల్చివేతలతో అట్టుడుకుతోంది. నగర శివారులోని వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో ఉన్న 'వినోబా నవోదయ కాలనీ'లో గురువారం రెవెన్యూ అధికారులు చేపట్టిన భారీ కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీశాయి. సుమారు 650 ఇళ్లను జేసీబీలతో నేలమట్టం చేయడంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మూడు జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 1,000 మంది పోలీసుల పహారాలో, ఎస్డీఆర్ఎఫ్ బృందాల సమక్షంలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కనీసం ఇంట్లోని సామాన్లు సర్దుకోవడానికి కూడా సమయం ఇవ్వలేదని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇళు కూల్చవద్దని మహిళలు, వృద్ధులు జేసీబీల ముందు అడ్డంగా పడుకున్నా అధికారులు వెనక్కి తగ్గలేదు. కొందరు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడటంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. దశాబ్దాల క్రితం ఆచార్య వినోబాభావే భూదాన్ ఉద్యమ స్ఫూర్తితో దాతలు ఇచ్చిన ఈ భూమి ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువైంది. విలువ: కొత్త కలెక్టరేట్ సమీపంలో ఉండటంతో ఇక్కడి భూమి విలువ ఎకరాకు ?10 కోట్లు పలుకుతోంది. మొత్తం 30 ఎకరాలకు పైగా ఉన్న ఈ భూమి విలువ సుమారు ?300 కోట్లు ఉంటుందని అంచనా. ఇది భూదాన్ బోర్డుకు చెందిన ప్రభుత్వ భూమి అని, హైకోర్టు ఆదేశాల మేరకే ఆక్రమణలు తొలగిస్తున్నామని రెవెన్యూ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. దళారులు నకిలీ పత్రాలతో పేదలను నమ్మించి ఇక్కడ చేర్పించారని వారు చెబుతున్నారు. ఈ ఘటనపై విపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో వీరికి నల్లా కనెక్షన్లు, విద్యుత్ మీటర్లు ఇచ్చారని, ఇప్పుడు రేవంత్ సర్కార్ ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు కూల్చడం అమానుషమని కేటీఆర్ విమర్శించారు. నేడు ఆయన బాధితులను పరామర్శించనున్నారు.

భూమాఫియా నుంచి ప్రభుత్వ ఆస్తులను రక్షించడమే తమ ఉద్దేశమని అధికార పార్టీ నేతలు అంటున్నారు. అయితే, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా న్యాయం చేస్తామని భరోసా ఇస్తున్నారు. "ఓట్ల సమయంలో మా దగ్గరకు వచ్చి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిన నాయకులు, ఇప్పుడు మంత్రులుగా ఉండి మమ్మల్ని ఎందుకు రోడ్డున పడేశారు?" అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. భారీ వర్షంలో శిథిలాల మధ్యే తమ సామాన్లతో తలదాచుకుంటున్న బాధితుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. ప్రభుత్వం కేవలం భూమి విలువను మాత్రమే కాకుండా, అక్కడ దశాబ్దాలుగా బతుకుతున్న పేదల జీవితాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పౌర సమాజం కోరుతోంది. రాజకీయ చదరంగంలో పేదవాడి సొంతింటి కల బలికావొద్దని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# ఆశక్తిగా మారుతున్న చెన్నై రాజకీయాలు

చెన్నై, ఫిబ్రవరి 27

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళనాడు రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది.. మొన్నటి వరకు అక్కడ ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నది డీఎంకే, అన్నాడీఎంకే రెండు కూటములు మాత్రమే.. తాజాగా ఈ ఎన్నికల్లో నటుడు విజయ్ స్థాపించిన టివికే కూడా బరిలో ఉంది. ఇవి చాలదు అన్నట్లు ఇప్పుడు కొత్త పార్టీతో జయలలిత నెచ్చెలి శశికళ కూడా వస్తున్నారు. అంటే ఈ సారి తమిళనాడు ఎన్నికల పోరులో చతుర్ముఖ పోరు తప్పేలా లేదన్న టాక్ వినిపిస్తోంది. అయితే ఉన్నట్టుండి చిన్నమ్మ రాజకీయ పార్టీ ఏర్పాటు ఎవరి కోసం..? అదే ఇపుడు ఆ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలిత ఉన్నప్పుడు అన్ని తానే నడిపిన నాయకురాలు శశికళ అన్నది అందరికీ తెలిసిన విషయం. జయలలిత మరణం తర్వాత అక్రమాస్తుల కేసులో జైలుకెళ్లి విడుదలైన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటున్న శశికళ ఇప్పుడు సొంతంగా రాజకీయ పార్టీ ప్రకటన చేశారు. ఇప్పటికే శశికళ మేనల్లుడు టీటీవీ దినకరన్ ఆధ్వర్యంలో ఓ పార్టీ ఉంది. మళ్లీ ఎప్పుడు శశికళ మరో పార్టీ పెట్టాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అన్నదే ఇప్పుడు తమిళనాడులో చర్చనీయాంశంగా మారగా ఎందుకు అన్నది కూడా అందరికీ తెలిసిన విషయమే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తమిళనాడులో గతంలో రెండు కూటముల్లో ఉన్న పార్టీలు ఇప్పుడు అదే చోట లేదు. ఏ పార్టీ ఎప్పుడు ఏ కూటమిలో ఉంటుందో చెప్పలేని పరిస్థితి.. ఒకప్పుడు డీఎంకే తో ఉన్న పార్టీలు అన్నా డీఎంకే తో కలిస్తే తాజాగా అటు నుంచి ఇటు..ఇటు నుంచి అటు మారాయి.. ఇక అన్నా డీఎంకే లో చక్రం తిప్పిన నేతలు మాజీ ముఖ్యమంత్రి సైతం డీఎంకే గెలుపు కోరుతుండడం మరింత ఆసక్తిని రేపుతున్నాయి. ఆసక్తికరమైన రాజకీయాలకు కేరాఫ్ గా నిలిచే తమిళనాడులో ఇపుడు చిత్ర విచిత్రాలు జరుగుతున్నాయి.. తాజా పరిణామాలు అక్కడి రాజకీయాల్లో సంచలనంగా మారాయి. మొదటి నుంచీ డీఎంకే , అన్నాడీఎంకే అంటే ఉప్పు.. నిప్పు.. రెండు పార్టీల నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అయితే తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కీలక నేతల ఆలోచనా తీరులో మార్పు వస్తోంది. జయలలిత ఉన్నపుడు అన్నీ తానై నడిపిన శశికళకు కూడా ఇప్పుడు డీఎంకే గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నట్లు తాజా పరిణామాలు చెబుతున్నాయి. ఒకప్పుడు డీఎంకేతో సుదీర్ఘ కాలం కలిసి నడిచిన పీఎంకే పార్టీ ఇప్పుడు అన్నాడీఎంకే బీజేపీ కూటమితో జతకట్టింది. పీఎంకే అంటే తమిళనాడులో బలమైన వన్నియర్ సామాజికవర్గ ఓటు బ్యాంకు కలిగిన పార్టీ.. ఇక నటుడు దివంగత విజయ్ కాంత్ కు చెందిన డీఎండీకే పార్టీ డీఎంకే తో చేతులు కలిపింది. గతంలో 2011 ఎన్నికల్లో జయలలితతో కలిసి పోటీ చేసి విజయం సాధించి అధికారం దక్కించుకున్న చరిత్ర విజయ్ కాంత్ పార్టీకి ఉంది. అలాంటిది ఇపుడు అనూహ్యంగా డీఎంకేతో జత కట్టింది డీఎండీకే. పీఎంకే, డీఎండీకే అటు ఇటు మారాయి. ఇక కీలకమైన మరో రెండు పరిణామాలు కూడా ఉన్నాయి.. అందులో ఒకటి మాజీ సీఎం జయలలిత నమ్మిన బంటు ఓ పన్నీర్ సెల్వం డీఎంకే కు మద్దతుగా నిలవడం. సీఎం స్టాలిన్‌తో మాజీ సీఎం ఓపీఎస్ భేటీ అయిన స్టాలిన్‌కు మద్దతు తెలిపారు. డీఎంకే ఐదేళ్ల పాలనను పొగిడిన ఓపీఎస్.. వచ్చే ఎన్నికల్లో డీఎంకే మళ్లీ గెలుస్తుందని జోస్యం చెప్పారు. డీఎంకే పాలనపై ప్రజల్లో నమ్మకం ఉందని ఓపీఎస్ అన్నారు. తమిళనాడులో గంటగంటకు మారుతున్న రాజకీయ పరిణామాలతో ఎవరు ఎప్పుడు ఎవరితో కలుస్తారో గ్యారెంటీ లేని పరిస్థితి నెలకొంటోంది. కాగా అన్నాడీఎంకే టార్గెట్ గా పలు రాజకీయ పార్టీలు రాజకీయ చదరంగంలో పావులు కదుపుతున్నాయి. ఒకప్పుడు తాను సారథ్యం ఆశించిన అన్నాడీఎంకే టార్గెట్ గా పార్టీ పెట్టేందుకు శశికళ ఏర్పాట్లు చేయడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అన్నాడీఎంకే పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకులో ప్రధానంగా దేవర్ సామాజిక వర్గం ఉంది. ఈ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత మాజీమంత్రి సెంగోట్టియన్ ఆ పార్టీని వీడి విజయ్ స్థాపించిన టీవీకే పార్టీలో చేరారు. ఇదే సామాజిక వర్గానికి చెందిన మాజీ సీఎం పన్నీర్ సెల్వం డీఎంకే కు మద్దతుగా నిలుస్తున్నారు. మరో వైపు అదే సమాజిక వర్గానికి చెందిన శశికళ కూడా కొత్తగా పార్టీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇవన్నీ అన్నాడీఎంకే ఓటు బ్యాంకు కు గండి కొట్టే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అన్నాడీఎంకేను మ్యాగ్జిమ్ డ్యామేజ్ చేసి విజయ్ పార్టీకి సహకరించడమే శశికళ ఎత్తుగడ అన్న ప్రచారం కూడా జరుగుతోంది. జయలలిత జయంతి సభలో శశికళ పార్టీ ప్రకటన చేశారు. తమ పార్టీ జెండా అజెండా ఏంటన్నది వివరించారు.. పార్టీ పేరు మాత్రం త్వరలోనే ప్రకటిస్తానని చెప్పారు.. మొత్తానికి ఎన్నికల తేదీని ఈసీ ప్రకటించకముందే తమిళ రాజకీయాలు రంజుగా మారుతున్నాయి

# జనసేన మెంబర్ షిప్ డ్రైవ్...

కాకినాడ, ఫిబ్రవరి 27,

జనసేన .. జనం కోసమే పార్టీ అన్నది పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నినాదం. పార్టీ పెట్టి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు పవన్. ఎంత కూటమిలో ఉన్నప్పటికీ పార్టీని బలోపేతం చేసుకోవాల్సి ఉందన్న సత్యాన్ని గుర్తించిన పవన్.. ఆదిశగా శరవేగంగా అడుగులేస్తున్నారు. సంస్థాగతంగా పార్టీని పటిష్ఠం చేయడమే లక్ష్యంగా, 'మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్' అనే శక్తిమంతమైన నినాదంతో మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదుకు జనసేనాని శ్రీకారం చుట్టారు. కేవలం ఆంధ్రప్రదేశ్ కే పరిమితం కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో పాటు మహారాష్ట్రలోనూ తన ఉనికిని చాటుకోవాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాటికి భారీ స్థాయిలో సభ్యులను చేర్చుకోవడం ద్వారా కేడర్ బలాన్ని ప్రదర్శించాలని అధినేత పవన్ కల్యాణ్ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈసారి క్రియాశీలక సభ్యత్వ రుసుమును రూ. 500 నుండి రూ. 400కు తగ్గించి సామాన్యులకు మరింత చేరువయ్యే ప్రయత్నాన్ని జనసేన చేస్తోంది. కేవలం సభ్యత్వాలు తీసుకోవడమే కాకుండా, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ భారీ ఇన్సూరెన్స్ ప్యాకేజీని ప్రకటించింది. సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5 లక్షల రూపాయల ప్రమాద బీమాతో పాటు, ప్రమాదవశాత్తు శాశ్వత వైకల్యం సంభవిస్తే రూ. 2 లక్షల రూపాయలు, గాయపడితే రూ. 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందించేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. వసూలైన సభ్యత్వ రుసుమును పూర్తిగా పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసమే వినియోగించడం ద్వారా కేడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేస్తోంది. పార్టీ నిర్మాణంలో క్రమశిక్షణను పెంచేందుకు సభ్యత్వాన్ని ఈసారి మూడు విభిన్న వర్గాలుగా విభజించారు. ఉద్యమి, సాధక్, ప్రదాత అనే పేర్లతో కార్యకర్తల పనితీరు, నిబద్ధత ఆధారంగా ఈ వర్గీకరణ సాగనుంది. ఇప్పటికే గత రెండు విడతల్లో విజయవంతంగా 13 లక్షల మందికి పైగా సభ్యులను నమోదు చేసుకున్న జనసేన, ఈ మూడో విడత ద్వారా రికార్డు స్థాయి సంఖ్యను చేరుకోవాలని భావిస్తోంది. సిద్ధాంతాల ప్రచారం, గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతమే ధ్యేయంగా సాగుతున్న ఈ సభ్యత్వ డ్రైవ్‌ను పవన్ కల్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# గాంధీ సరోవర్ ప్రాజెక్ట్..

## అభివృద్ధి మంత్రామా? పర్యావరణ విధ్వంసమా?



హైదరాబాద్, ఫిబ్రవరి 27, (న్యూస్ పల్స్)

హైదరాబాద్ లైఫ్ లైన్ అయిన మూసీ నదికి పూర్వ వైభవం తీసుకురావాలనే పట్టుదలతో తెలంగాణ ప్రభుత్వం 'గాంధీ సరోవర్' అనే ప్రతిష్టాత్మక రిజర్వాయర్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. బండ్లగూడ ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా అటు వరదల ఉధృతిని అరికట్టడంతో పాటు, ఇటు నగరం నడిబొడ్డున పర్యావరణ సమతుల్యతను కాపాడాలని అధికారులు భావిస్తున్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా రాబోయే ఈ మార్పు నగర ముఖచిత్రాన్నే మారుస్తుందని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. అయితే, మ్యాప్‌లో గీసిన ఈ ప్లాన్ క్షేత్రస్థాయిలో ఉన్న వేలాది కుటుంబాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ముఖ్యంగా మధుపార్క్ వంటి కాలనీలు ఈ ప్రాజెక్టు వల్ల పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు.అభివృద్ధి అనే పదానికి అర్థం తమ ఇళ్లను కూల్చడమేనా అని మధుపార్క్ నివాసితులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. దశాబ్దాల కాలంగా రూపాయి రూపాయి పోగేసి, ఎన్నో కలలతో కట్టుకున్న తమ గూడు ఒక్క రాత్రిలో అక్రమ కట్టడంగా మారిపోవడం వారిని కలిచివేస్తోంది. మార్కింగ్‌ల పేరుతో అధికారులు తిరుగుతుంటే, రేపు తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళనతో ఆ ప్రాంత వాసులకు కంటిమీద కునుకు కరువైంది. కేవలం ఒక ప్రాజెక్టు కోసం తరతరాలుగా ఉంటున్న మనుషులను రోడ్డున పడేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నుండి ఎలాంటి స్పష్టమైన భరోసా లభించకపోవడం ఈ కాలనీల్లో నిరసన జ్వాలలు ఎగిసిపడటానికి ప్రధాన కారణమైంది.ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం చట్టపరమైన పత్రాలు. స్థానికుల వద్ద అన్ని అనుమతులతో కూడిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉండగా, ఇప్పుడు ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని బఫర్ జోన్ లేదా ఎఫ్.టి.ఎల్ పరిధిలోకి వస్తుందని ప్రకటించడం గందరగోళానికి దారితీసింది. ఇన్నాళ్లూ మున్సిపల్ పన్నులు వసూలు చేసి, కరెంటు కనెక్షన్లు ఇచ్చి, రిజిస్ట్రేషన్లు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు అకస్మాత్తుగా అవన్నీ నిబంధనలకు విరుద్ధమని చెప్పడం విడ్డూరంగా ఉందని బాధితులు వాపోతున్నారు. చట్టబద్ధంగా కొనుక్కున్న ఆస్తులకు రక్షణ లేకపోతే సామాన్య మధ్యతరగతి మనిషి ఎవరిని నమ్మాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ డాక్యుమెంట్ల పంచాయితీ ఇప్పుడు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పెద్ద యుద్ధంగా మారింది.మరో కోణంలో చూస్తే, ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నగర భవిష్యత్తు కోసం అనివార్యమైనదిగా చూస్తోంది. మూసీ నదికి వచ్చే భారీ వరదలను నియంత్రించకపోతే భవిష్యత్తులో హైదరాబాద్‌కు ముప్పు తప్పదని, అందుకే గాంధీ సరోవర్ వంటి రిజర్వాయర్లు అవసరమని అధికారులు వాదిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం ద్వారా నగరానికి కొత్త కళ వస్తుందని, పర్యావరణ పరంగా కూడా ఇది ఎంతో మేలు చేస్తుందని వారి వాదన. బాధితులకు తగిన పరిహారం అందిస్తామని లేదా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇస్తున్నప్పటికీ, తమ సొంత ఇళ్లను వదిలి ఇరుకు గదుల్లోకి వెళ్లడానికి ప్రజలు ఏమాత్రం సిద్ధంగా లేరు.ప్రస్తుతం బండ్లగూడలో పరిస్థితి నిప్పుకణికలా ఉంది. ఒకవైపు సర్వేలు నిర్వహిస్తున్న అధికారులు, మరోవైపు తమ ఇళ్లను కాపాడుకోవడానికి ప్రాణాలకు తెగించి పోరాడుతున్న ప్రజలతో ఆ ప్రాంతం నిరంతరం యుద్ధభూమిని తలపిస్తోంది. అభివృద్ధి పేరుతో సామాన్యుల హక్కులను కాలరాయవద్దని పౌర సమాజం నుండి కూడా మద్దతు లభిస్తోంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మొండిగా ముందుకు తీసుకెళ్తుందా లేక ప్రజల విజ్ఞప్తులను మన్నించి తన ప్రణాళికను సవరిస్తుందా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా, అభివృద్ధి కింద నలిగిపోతున్న సామాన్యుడి ఆవేదన మాత్రం హైదరాబాద్‌లో పెద్ద చర్చకు దారితీసింది.

### అప్పుడు 12... ఇప్పుడు 50

హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా భావిస్తున్న మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మూసీ తీర ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇక్కడ ప్రతిపాదించిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం కిస్మత్‌పురా, దర్గా డివిజన్ల పరిధిలో భూసేకరణ చేపట్టనున్నట్లు రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి అధికారికంగా వెల్లడించారు. ఈ మేరకు ప్రాథమిక నోటిఫికేషన్ కూడా జారీ కావడంతో స్థానికంగా ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీర్, ఉప్పర్‌పల్లి పరిధిలోని పలు కీలక నిర్మాణాలను అధికారులు స్వాధీనం చేసుకోనున్నారు. ముఖ్యంగా మధు పార్క్ రిడ్జ్ వంటి ప్రముఖ అపార్ట్‌మెంట్లు కూడా 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిలోకి వస్తుండటంతో వాటి భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. గతంలో ఈ ప్రాంతంలో బఫర్ జోన్ నిబంధనలు వేరుగా ఉన్నప్పటికీ, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. దీనివల్ల గతంలో అనుమతులు పొంది నిర్మించిన భవనాలు కూడా ఇప్పుడు ప్రభుత్వ సేకరణ పరిధిలోకి రాక తప్పని పరిస్థితి ఏర్పడింది.చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, 2004 సంవత్సరంలో మూసీ బఫర్ జోన్ కేవలం 12 మీటర్లుగా మాత్రమే ఉండేది. అయితే నది పరిరక్షణ, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 2012లో ఈ పరిమితిని 50 మీటర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మధు పార్క్ రిడ్జ్ వంటి భారీ నివాస సముదాయాలు ఇప్పుడు బఫర్ జోన్ పరిధిలోకి వచ్చాయి. అప్పట్లో నిబంధనల ప్రకారమే అనుమతులు పొందినప్పటికీ, ప్రస్తుత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్మాణాలను సేకరించడం అనివార్యమని రెవెన్యూ అధికారులు స్పష్టం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు భరోసా ఇస్తూ, ప్రభుత్వం ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తుందని ఆర్డీవో హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరల ప్రకారం అపార్ట్‌మెంట్ వాసులకు పరిహారం చెల్లించి, ఆ తర్వాతే ఆయా నిర్మాణాలను స్వాధీనం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కేవలం బలవంతంగా ఖాళీ చేయించడం కాకుండా, చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరిస్తామని స్పష్టం చేశారు. భూసేకరణలో పారదర్శకత పాటిస్తూ, బాధితుల నుంచి వచ్చే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు ప్రభుత్వం తరపున అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం మొత్తం 83 ఎకరాల 13 గుంటల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ భారీ విస్తీర్ణంలో ఉన్న ప్రైవేటు భూములు, నివాస ప్రాంతాలను గుర్తించి, వాటి యజమానులతో సంప్రదింపులు జరిపేందుకు యంత్రాంగం సిద్ధమైంది. కేవలం అపార్ట్‌మెంట్లు మాత్రమే కాకుండా, నది పరివాహక ప్రాంతంలోని అన్ని రకాల ఆక్రమణలు, బఫర్ జోన్ ఉల్లంఘనలపై అధికారులు నిశితంగా దృష్టి సారించారు.భూసేకరణ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం దశల వారీగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతోంది. ఉన్నఫళంగా ఇళ్లను ఖాళీ చేయించబోమని, ప్రతి అడుగులోనూ బాధితుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి 60 రోజుల పాటు స్థానికుల నుంచి అభ్యంతరాలు, సలహాలను స్వీకరిస్తారు. ఈ సమయంలో వచ్చే ప్రతిపాదనలను బట్టి తదుపరి చర్యలు ఉంటాయని ఆర్డీవో వెంకట్ రెడ్డి విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం మూసీ నదికి పాత వైభవాన్ని తీసుకురావడమే కాకుండా, నగరవాసులకు ఒక చక్కని పర్యాటక ప్రాంతాన్ని అందుబాటులోకి తీసుకురావడం. గాంధీ సరోవర్ పేరుతో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇన్నాళ్లూ అక్కడ నివాసం ఉంటున్న సామాన్యులకు పరిహారం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు

# హైదరాబాద్ నగరంలో పాడ్ ట్యాక్సీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 7

హైదరాబాద్ నగరవాసులకు తీపి కబురు. నగరంలో మరో హైటెక్ రవాణా వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు, మెట్రోలు, ఆటోలు, ర్యాపిడో వంటి బైక్‌ల ద్వారా ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. త్వరలోనే విదేశాల్లో మాదిరిగా పాడ్ ట్యాక్సీలు అందుబాటులోకి రానున్నాయి. మెట్రో స్టేషన్లను కనెక్ట్ చేస్తూ ఈ ట్యాక్సీలు నడపనున్నారు.హైదరాబాద్ నగరవాసులకు గుడ్‌న్యూస్. త్వరలో పాడ్ ట్యాక్సీలు అందుబాటులోకి రానున్నాయి. మెట్రో ట్రైన్లను కనెక్ట్ చేస్తూ.. పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) పేరిట ప్రభుత్వం ఈ ట్యాక్సీలు తీసుకురానుంది. మెట్రోరైలు స్టేషన్ల నుంచి ప్రయాణికులు తొందరగా తమ గమ్యస్థానం చేరేందుకు ఈ పాడ్ ట్యాక్సీలను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలోనే చేపట్టాలనేది ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్‌వోటీ) విధానంలో సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల అధ్యయనానికి కన్సల్టెంట్ ఎంపిక చేయనున్నారు. అందు కోసం హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ) నోటిఫికేషన్ జారీ చేసింది.ప్రస్తుతం నగరంలో దాదాపు 5 లక్షల మంది ప్రయాణికులు మెట్రోలను ఆశ్రయిస్తున్నారు. నగరం ఓ మూల నుంచి మరో మూలకు త్వరగా చేరుకునేందుకు మెట్రో బెస్ట్ ఆప్షన్ అయింది. అయితే మెట్రో దిగిన తర్వాత తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు బస్సులు, ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఇవి అన్ని చోట్ల అందుబాటులో ఉండటం లేదు. ఉన్నా డబ్బులు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. దానికి తోడు ట్రాఫిక్‌లో నరకం. ఈ ఇబ్బందులను తొలగించేందుకు.. మెట్రో స్టేషన్ల నుంచి రోడ్ల మీదకు రావాల్సిన అవసరం లేకుండా నేరుగా పాడ్‌ట్యాక్సీల ద్వారా గమ్యస్థానాలను చేరుకునేలా వినూత్న రవాణా వ్యవస్థ ప్రవేశపెట్టేందుకు సర్కార్ రెడీ అయింది.ముందుగా.. రాయదుర్గం-కూకట్‌పల్లి, రాయదుర్గం-హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మెట్రో స్టేషన్లు, నాలెడ్జి సిటీ, సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. పాడ్ ట్యాక్సీలు పూర్తిగా ఆటోమేటెడ్, డ్రైవర్ లేకుండా నడుస్తాయి. ఎలివేటెడ్ ట్రాక్‌లపై నడిచే ఈ ట్యాక్సీలు..గంటకు గరిష్ఠంగా 40 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి. ప్రతి పాడ్ ట్యాక్సీలో 6 నుంచి 8 మంది ప్రయాణించవచ్చు. గంటకు 10వేల మందిని చేరవేసే సామర్థ్యం ఉంటుంది. బ్యాటరీ లేదా విద్యుత్తు వినియోగంతో ఎలాంటి కాలుష్యం సమస్య తలెత్తదు. మెట్రో స్టేషన్‌లో దిగడానికి కంటే ముందు పాడ్‌ట్యాక్సీని బుక్ చేసుకోవడం ద్వారా సమయా ఆదా అవుతుంది. ఇలాంటి రవాణా వ్యవస్థ ప్రస్తుతం ముంబైలో పట్టాలెక్కుతుండగా.. త్వరలోనే హైదరాబాద్ నగరంలోనూ అందుబాటులోకి రానుంది.

# కొత్త వాహనాలపై రోడ్ సెస్

వరంగల్, ఫిబ్రవరి 27,

తెలంగాణలో కొత్తగా వాహనాల కొనుగోలు చేసేవారిపై అదనపు భారం పడనుంది. ప్రభుత్వం కొత్తగా 'రోడ్ సేఫ్టీ సెస్' పేరుతో అదనపు పన్నును విధిస్తూ నిర్ణయం తీసుకుంది. మార్చి 1 నుంచి ఈ కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. పన్ను మె?త్తం వాహన రకాలను బట్టి రూ.2 వేల నుంచి రూ. 10 వేలు వసూలు చేయనున్నారు.కొత్తగా వాహనాలు కొంటున్నారా..? అయితే మీ జేబుకు చిల్లు పడినట్లే. ఎందుకంటే రిజిస్ట్రేషన్ సమయంలోనే కొత్త అదనపు బాదుడుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. కొత్త వాహనాల కొనుగోలుపై రోడ్ సేఫ్టీ సెస్ వసూలు చేయనున్నారు. ఈ మేరకు సెస్ చెల్లించే నిబంధన మార్చి 1 నుంచి అమల్లోకి రానుంది. మోటారు వెహికల్ యాక్ట్ చట్టంలో పన్నుల విధింపుపై రాష్ట్రానికి ఉన్న అధికారాల్ని వినియోగిస్తూ తెలంగాణ రవాణాశాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా ఉత్తర్వుల ప్రకారం.. నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు అదనంగా రోడ్డు భద్రత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు, కార్లతోపాటుగా ఇతర వ్యక్తిగత వాహనాలు, గూడ్స్ వెహికల్స్, ప్రయాణికుల్ని తీసుకెళ్లే ఆటోలు ఈ విభాగం పరిధిలోకి వస్తాయి.కొత్త వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించే సమయంలో ఈ అదనపు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. మూడు చక్రాల గూడ్స్ వాహనాలపై గతంలో క్వార్టర్లీ ట్యాక్స్ ఉండేది. రవాణాశాఖ తాజాగా దాన్ని లైఫ్‌ట్యాక్స్ పరిధిలోకి తీసుకు వచ్చింది. రోడ్డు భద్రత చర్యలకు అవసరమయ్యే నిధుల సమీకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ అదనపు ట్యాక్స్ ద్వారా ప్రతి ఏడాది సుమారు రూ.270 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. వ్యవసాయ ప్రయోజనాలకు ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రైలర్లకు మాత్రం పన్ను మినహాయింపు ఉంటుంది.ఈ ట్యాక్స్ పరిధిలోకి బైకులు, కార్లు, తేలికపాటి వాహనాలు వస్తాయి. ఇతర వాహనాల పరిధిలోకి 4 నుంచి 7 సీట్ల సామర్థ్యం ఉన్న ప్రయాణికుల ఆటోలు వస్తాయి. రోడ్డు భద్రత పన్ను బైకులు, స్కూటీలు వంటి ద్విచక్రవాహనాలకు రూ. 2 వేలు ఉంటుంది. కార్లు వంటి వాటికి రూ.5 వేలు వసూలు చేయనున్నారు. ఇతర వాహనాలు అంటే గూడ్స్ వెహికల్స్, ఆటోల్లో రూ.10 వరకు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఇప్పటికే పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యుడికి.. కొత్త వాహనం కొనేటప్పుడు ఈ అదనపు పన్ను ఖచ్చితంగా భారమే అవుతుంది. ఈ నిర్ణయంపై పునరాలోచించాలని వాహనదారులు కోరుతున్నారు. అయితే సర్కార్ మాత్రం పన్ను విధింపుపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అంటోంది.

# భార్య ఆరోగ్యం కోసం బిచ్చగాడు సినిమా తరహాలో...

కరీంనగర్, ఫిబ్రవరి 27,

బిచ్చగాడు సినిమాలో హీరో విజయ్ ఆంటోని తల్లి అనారోగ్యం తగ్గాలంటూ 48 రోజులు బిచ్చగాడి దీక్ష తీసుకుంటాడు.ఇది సినిమా కథ.. ఇది కూడా ఆధ్యాత్మిక సంప్రదాయాల నుంచి ప్రేరణ పొందినదే. అయితే ఇలాంటి దీక్షలు చేస్తే ఉద్దేశం నెరవేరుతుందా? నిజంగా అనుకున్నది జరుగుతుందా? కర్మ సిద్ధాంతం ప్రకారం..మునుపటి కర్మల నుంచి విముక్తి పొందేందుకు ఇలాంటి దీక్షలు చేపడితే పాప కర్మలు తగ్గిస్తాయని నమ్మకం. భగవద్గీత అధ్యాయం 18, శ్లోకం 5 ప్రకారం యజ్ఞం, దానం, తపస్సు వంటివి పాపాలను నాశనం చేస్తాయని ఉంది. ఆలయాలను శుభ్రం చేయడం నిష్కామ కర్మ ఇది మనసుని శుద్ధి చేస్తుంది. ఇలాంటి దీక్షలు భక్తిని పెంచి మనుసుని శాంతపరుస్తాయి. ఆయుర్వేదం, యోగ శాస్త్రాల్లో కూడా మనసు-అశరీరం సంబంధం గురించి ఉంటుంది. బిచ్చగాడిలా దీక్ష అంటే సన్యాస దీక్షలు సమానం...ఇది అహంకారాన్ని తగ్గించి దైవిక శక్తిని ఆకర్షిస్తుంది. తద్వారా అనుకున్నది నెరవేరుతుందని ఆధ్యాత్మివేత్తల మాట. ఇప్పుడు సిరిసిల్ల జిల్లాలో ఓ అడ్వకేట్ తన భార్య ఆరోగ్యం కోసం బిచ్చగాడిగా మారారు. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన ఆయన పేరు కాసర్ల జలంధర్ రెడ్డి ,అడ్వకేట్ ..సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం విలాస్ నగర్ కు చెందిన ఆమె పేరు శిరీష, బీకాం కంప్యూటర్స్..ఆయన కరీంనగర్లో ప్రాక్టీస్ చేస్తే, ఆమె ప్రైవేట్ ఉద్యోగం చేసేది. 2006లో పెళ్లి జరిగింది, పిల్లలు లేరు. అనారోగ్యం పాలైన ఆమె వైద్యం కోసం ఎంతో ఖర్చు చేశారు, ఎన్నో హాస్పిటల్స్ తిరిగారు..అయితే వేములవాడ రాజన్న సన్నిధిలో భిచ్చమెత్తుకుంటే ఆరోగ్యం కుదుటపడుతుందని చెప్పడంతో మూడు నెలలుగా భిక్షాటన చేస్తున్నారు ఆ దంపతులు. పెళ్లితో ముడిపడిన బంధాన్ని వీడలేక, భార్య ఆరోగ్యంగా ఉంటే చాలు అని భావించి, ఆ భగవంతుడిపైనే భారం వేసి దైవసన్నిధిలో బిచ్చమెత్తుకుంటున్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశాల మేరకు వేములవాడలో బిచ్చగాళ్లకు కౌన్సిలింగ్ సెషన్స్ నిర్వహించారు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఏఎస్పీ చంద్రయ్య. ఈ సమయంలో అనర్గళంగా ఇంగ్లీష్ లో మాట్లాడుతున్న ఆ జంటను చూసి వివరాలు అడిగితెలుసుకున్నారు అధికారులు. తనకు పెద్దగా ఆస్తులు లేవని, అద్దె ఇంట్లో ఉంటూ అడ్వకేట్ గా ప్రాక్టీస్ చేసేవాడిని అని, తన భార్య ఆరోగ్యం కుదటపడాలని ఆస్పత్రుల చుట్టూ తిరిగి విసిగిపోయాను..అందుకే దేవుడే దిక్కని భావించి ఇలా భిక్షాటన చేస్తున్నాం అని చెప్పారు జలంధర్ రెడ్డి. తనకు పోలియో ఉన్నా పెన్షన్ ఇవ్వడం లేదని చెప్పారు జలంధర్ రెడ్డి భార్య శిరీష. ప్రభుత్వం పెన్షన్ ఇస్తే కొంతైనా సాయం చేసినట్టు అవుతుందని చెబుతోంది ఆమె.కారణాలు ఏమైనా కానీ.. జలంధర్ రెడ్డి, శిరీష తీసుకున్న నిర్ణయంపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. తిరుమల లాంటి క్షేత్రంలో భగవంతుడి సేవ చేస్తే ఆరోగ్యం, మనశ్శాంతి లభిస్తుందని చాలామంది నమ్మకం. దీక్షలు తీసుకుంటే అనారోగ్య సమస్యల నుంచి విముక్తి లభిస్తుందని మరికొందరి నమ్మకం. అయితే ఎలాంటి వైద్య సేవలు తీసుకోకుండా ఇదొక్కటే నయం చేస్తుందని కూడా స్పష్టంగా చెప్పలేం. ఎందుకంటే ఆధ్యాత్మిక దీక్షలు మనసుని బలపరుస్తాయి కానీ వైద్య చికిత్సను భర్తీ చేయలేవు. ఎందుకంటే శ్రీరామకృష్ణుడు..తన గొంతు క్యాన్సర్ ను దైవిక లీలగా భావించారు కానీ ఆధ్యాత్మికత రోగాన్ని నయం చేయలేదు.. అది మరణానికి దారితీసింది. ఫలితం కేవలం భక్తి, ఉద్దేశం, కర్మలపై ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు ఆధ్యాత్మికవేత్తలు.

# మావోయిస్టుల కండిషన్స్...

హైదరాబాద్, ఫిబ్రవరి 27

దేశంలో మావోయిస్టు పార్టీ తుది దశకు చేరుకుంది. అగ్ర నాయకులు ఒకరి తర్వాత ఒకరు.. లొంగిపోవడంతో మావోయిస్టు పార్టీ పరిస్థితి దారుణంగా మారింది. 1967లో పశ్చిమ బెంగాల్ లోని, నక్సల్ బరీలో పుట్టిన మావోయిస్టు ఉద్యమం.. ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ దెబ్బకు మావోయిస్టులు లొంగిపోవడం లేదా చచ్చిపోవడమో అన్నట్లుగానే, గత రెండు.. మూడు ఏళ్ల నుంచి కాలం గడుపుతూ వస్తున్నారు.ఇక తెలంగాణ ప్రభుత్వం మావోయిస్టులకు అండగా నిలబడటంతో.. పెద్ద ఎత్తున కీలక మావోయిస్టు నాయకులందరూ తెలంగాణ వచ్చి లొంగిపోయే ప్రయత్నం చేస్తున్నారు. నిన్న దేవ్ జి బడే చొక్కారావు, నూనె నరసింహారెడ్డి, మల్లా రాజిరెడ్డి వంటి వారు తెలంగాణ డిజిపి ఎదట లొంగిపోయారు. దీనితో ఇప్పుడు మావోయిస్టు పార్టీ కీలక నేత గణపతి ఎక్కడున్నారు అనే దానిపైనే చర్చ జరుగుతోంది. గణపతి ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో నేపాల్ లో ఉన్నట్లుగా భావిస్తున్నారు.2018 లో పార్టీ బాధ్యతలను నంబాలకు అప్పగించిన తర్వాత ఆయన.. ఒడిస్సా మీదుగా బీహార్ చేరుకుని అక్కడి నుంచి నేపాల్ వెళ్లినట్లు భావిస్తున్నారు. ఇప్పటికే ఆయన తెలంగాణ పోలీసులతో చర్చలు కూడా జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తనను కేంద్ర బలగాలకు అప్పగించొద్దని.. ఆయన షరతు విధించినట్లు సమాచారం. దశాబ్దాల పాటు మావోయిస్టు ఉద్యమాన్ని ముందుండి నడిపించారు గణపతి. ప్రస్తుతం అనారోగ్యంతో కదలలేని స్థితిలో ఉన్న ఆయన, బీహార్ మీదగా నేపాల్ వెళ్లిపోయినట్లు సమాచారఆయన కూడా లొంగిపోతే దేశంలో మావోయిస్టు పార్టీ పూర్తిగా అంతిమ దశకు చేరుకున్నట్లే. తెలంగాణకు చెందిన మరి కొంతమంది నేతలు ప్రస్తుతం.. ఝార్ఖండ్ ప్రాంతంలో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. గణపతి కోసం అటు కేంద్ర బలగాలు కూడా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక మావోయిస్ట్ లలో మరో కీలక నేత నరహరి ఎక్కడ ఉన్నారు అనే దానిపై బలగాలు పెద్ద ఎత్తున గాలిస్తున్నాయి

# ఆర్టీసీ బస్సుల్లో తగ్గిన చార్జీలు




హైదరాబాద్, ఫిబ్రవరి 27,

వేసవికాలంలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏసీ బస్సుల్లో టికెట్ల ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. మార్చి 1వ తేదీ నుంచి తగ్గించిన ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే సమ్మర్ మొదలుకావడంతో పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉక్కబోత కూడా మొదలుకాబోతుంది. దీని వీటి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఏసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రయాణికులకు ప్రయోజనం చేకూర్చేందుకు హైదరాబాద్‌లో తిరిగే ఏసీ బస్సుల్లో టికెట్ల రేట్లను తగ్గించారు. దీంతో ప్రజలపై భారం తగ్గడంతో పాటు ఎండాకాలంలో హాయిగా ఏసీ బస్సు ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చు. ఏయే బస్సుల్లో ఎంత తగ్గించారు.. తగ్గించిన తర్వాత ఛార్జీలు ఎలా ఉన్నాయి అనే విషయాలు తెలుసుకుందాం.గతంలో మెట్రో డీలక్స్ ఏసీ బస్సుల్లో ప్రతీ నాలుగు కిలోమీటర్లకు టికెట్ ఛార్జీ రూ.30గా ఉండేది. కానీ ఇప్పుడు రూ.25కి తగ్గింది. దీంతో ప్రతీ నాలుగు కిలోమీటర్ల ప్రయాణంపై రూ.5 మేర తగ్గింపు మార్చి 1వ తేదీ నుంచి అమల్లోకి రానుందని టీజీఎస్ఆర్టీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ఈ-మెట్రో ఏసీ బస్సుల్లో గతంలో నాలుగు కిలోమీటర్లకు రూ.35 చొప్పున ఉండగా.. ఇప్పుడు రూ.25కి తగ్గనుంది. ఏకంగా రూ.10 మేర తగ్గనుండటం ప్రయాణికులకు ఊరటగా చెప్పవచ్చు. ఎండాకాలంతో పాటు ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ నిండుగా ఉండటం లేదు. ప్రస్తుతం 60 శాతం మాత్రమే ఆక్యుపెన్సీ ఉంటుంది. ధరలు ఎక్కువగా ఉంటాయనే కారణంతో కొంతమంది వెనకడుగు వేస్తున్నారు. ఛార్జీలను తగ్గిండచడం వల్ల ఆక్యుపెన్సీ పెరగడంతో పాటు సమ్మర్‌లో ప్రయాణికులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో టీజీఎస్ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది.1 నుంచి 3 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలర్స్ బస్సుల్లో 0 నుంచి రూ.10 వరకు ఆదా కానుండగా.. ఈ-మెట్రో బస్సుల్లో 5 నుంచి రూ.10 తగ్గుతుంది. ఇక 4-15 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలక్స్‌లలో రూ.5 నుంచి రూ.10, ఈ-మెట్రో బస్సుల్లో రూ.10 నుంచి రూ.15 ఆదా అవుతుంది. ఇక 16 నుంచి 21 కిలోమీటర్ల దూరానికి మెట్రో డీలక్స్‌లలో రూ.10 నుంచి రూ.15, ఈ-మెట్రో బస్సులలో రూ.10 నుంచి రూ.15, 22-30 కిలోమీటర్ల ప్రయాణానికి మెట్రో డీలక్స్,ఈ మెట్రో ఏసీ బస్సుల్లో రూ.5 నుంచి రూ.10 వరకు ఆదా అవుతుంది. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 275 మెట్రో డీలక్స్, 90 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు తిరుగుతున్నాయి. వీటిల్లో ఛార్జీల తగ్గింపుతో నగర ప్రజలకు లబ్ది చేకూరనుంది.

# అవినీతి అరాచకమే కాంగ్రెస్ పాలన జోడెడ్లు – బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ప్రజల విశ్వాసం గులాబీ జెండాపైనే ? నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రానికి కావాలి.**

**మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగురుతుంది.**

**తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కౌన్సిలర్లకు సన్మానం ? ఆలంపూర్ విజేతలకు కేటీఆర్ అభినందనలు.**

**తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన కౌన్సిలర్లకు ఘన సన్మానం..**

హైదరాబాద్, ఫిబ్రవరి 27, ఆలంపూర్ నియోజకవర్గంలో విజయం సాధించిన కౌన్సిలర్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు తదితర ముఖ్య నేతలు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్‌పైనే ఉందని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన దారుణ చర్యలని ఆక్షేపించారు.

కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెడ్లలా ముందుకు సాగాయని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెడ్లుగా మారాయని ఆయన విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, పల్లె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు వంటి చర్యలు రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రైతు బంధు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం అర్థమైందన్నారు.

నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు.

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందని ముందుగానే హెచ్చరించిన కేటీఆర్, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రావులపాలెంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు కొత్తపేట నియోజకవర్గం..

రాజమండ్రిలో కల్తీ పాలు ఘటన నేపథ్యంలో అప్రమత్తమైన ఉన్నతాధికారులుఇటీవల రాజమండ్రిలో కల్తీ పాలు సేవించి కొందరు మృతిచెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోనసీమ జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టారు.కోనసీమ జిల్లా ఆహార భద్రత అధికారి (ఫుడ్ ఇన్స్పెక్టర్) యేపూరి రామయ్య ఆధ్వర్యంలో రావులపాలెం పట్టణంలోని పలు పాల కేంద్రాలు, మిల్క్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాలు నిల్వ విధానం, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు.పలు కేంద్రాల నుంచి పాలు శాంపిళ్లు సేకరించి ప్రయోగశాలకు పంపించినట్లు అధికారులు తెలిపారు. ల్యాబ్ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నమూనాల్లో విషపదార్థాలు లేదా కల్తీ పదార్థాలు ఉన్నట్లు తేలితే సంబంధిత అమ్మందారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు నాణ్యమైన పాలను మాత్రమే వినియోగించాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆహార భద్రతాధికారులు సూచించారు.ఇటీవలి ఘటనల నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో తనిఖీలు కొనసాగనున్నట్లు తెలిపారు.

# చారిత్రాత్మక వెంకటగిరిలో పరిశ్రమలు స్థాపించాలి

## మినీ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రత్యేక హ్యాండ్‌లూమ్ పార్క్ ఏర్పాటు చేయాలి – అసెంబ్లీలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజ్ఞప్తి

వెంకటగిరి, ఫిబ్రవరి 27,

తిరుపతి జిల్లాలో అత్యంత ప్రఖ్యాతి గాంచిన, చారిత్రాత్మక వారసత్వం కలిగిన వెంకటగిరి నేడు పలు సవాళ్లను ఎదుర్కొంటోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంత సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడానికి అవకాశం కల్పించిన సభాపతికి కృతజ్ఞతలు తెలిపారు.నియోజకవర్గంలో యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వారు పొరుగు రాష్ట్రాలైన చెన్నై, కర్నాటక తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ వలసలను అరికట్టాలంటే వెంకటగిరిలో చిన్నతరహా పరిశ్రమలను స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో మినీ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.వెంకటగిరి పట్టు చీరలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ, నేత కార్మికులు దళారుల చేతిలో మోసపోతున్న పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. డిజైనింగ్ నుంచి ఫినిషింగ్ వరకు ఒకే చోట ఉత్పత్తి ప్రక్రియ పూర్తయ్యేలా ప్రత్యేక హ్యాండ్‌లూమ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల కార్మికులకు మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపడి, మధ్యవర్తుల ఆధిపత్యం తగ్గుతుందని వివరించారు.పట్టు, జరీ వంటి ముడి సరుకులపై సబ్సిడీ పెంచి కార్మికులను ఆదుకోవాలని కోరారు.

# కోనసీమ తిరుమల వాడపల్లిలో రూ.2.17కోట్ల రికార్డు స్థాయి హుండీ ఆదాయం

## రికార్డు స్థాయిలో ఆదాయం రావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు

కొత్తపేట్,ఫ్రబవరి 27,

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం జరిగిన హుండీల లెక్కింపు కార్యక్రమంలో రికార్డు స్థాయిలో రూ.2.17 కోట్ల ఆదాయం లభించింది. గత 35 రోజుల కాలానికి గాను ఈ మొత్తం లభించింది. ఇందులో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రధాన ఆలయం మరియు శ్రీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ హుండీల ద్వారా రూ.1,58,00,536/- నగదు, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.59,82,822ల నగదు లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అదేవిధంగా భక్తులు సమర్పించిన కానుకలుగా 42 గ్రాముల 400మిల్లీ గ్రాముల బంగారం, 1 కిలో 280 గ్రాముల వెండి, అలాగే 13 దేశాలకు చెందిన 73 విదేశీ కరెన్సీ నోట్లు హుండీలలో లభించాయని ఆలయ అధికారులు తెలిపారు.కార్యక్రమానికి ఆలయ ధర్మకర్తలు సి హెచ్ రాంబాబు,నలాది నాగేశ్వరరావు, పి. భవాని, సి హెచ్.సత్యనారాయణ,ఎస్ సూర్య కుటుంబరావు, ఎమ్ త్రిమూర్తులు హాజరయ్యారు. పర్యవేక్షణాధికారులుగా మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం అసిస్టెంటు కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి (ఎఫ్ ఏ7 సీ) డి సురేశ్ బాబు, పలివెల గ్రూపు 2 దేవాలయాల ఈవో పి వి వి ఎస్ కామేశ్వరరావు, ఆత్రేయపురం గ్రూపు 3 దేవాలయాల ఈవో బి నరేంద్ర కుమార్ వ్యవహరించారు.హుండీ ఆదాయం లెక్కింపుకు కరూర్ వైశ్య బ్యాంక్, రావులపాలెం, కెనరా బ్యాంక్, రావులపాలెం వారు సహకారం అందించారు. అలాగే అర్చకస్వాములు, వేదపండితులు, గ్రామస్థులు, శ్రీవారి సేవకులు, పత్రికా ప్రతినిధులు, పోలీసులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి ఽ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు మాట్లాడుతూ ఈ సారి రికార్డు స్థాయిలో రూ2.17 కోట్ల ఆదాయం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు మాట్లాడుతూ భక్తుల సహాయ, సహకారాలతో ఆలయంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# మద్యం మత్తులో కన్న కూతుర్నే కడతేర్చిన ఘటన

# భార్యాభర్తల గొడవలే కారణమా?

## స్థానికుల సహాయంతో హాస్పిటల్ తీసుకెళ్లిన దక్కని ఫలితం

మద్యం మత్తులో కన్న తండ్రే కూతుర్ని కడతేర్చిన ఘటన కాకినాడ జిల్లా జగ్గంపేటలో చోటుచేసుకుంది. వాయిస్ ఓవర్: జగ్గంపేట శెట్టిబలిజి పేటకు చెందిన ఒడిబోయిన మణికంఠ భార్య ఇద్దరు కుమార్తెలతో టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గురువారం తన భార్య సాయితో ఘర్షణ పడి 11 నెలల కుమార్తెను తీసుకుని బయటకు వచ్చాడు. అలా వెళ్ళిన మణికంఠ బాలికతో సహ పోలవరం కాలువలోకి దూకాడు. శబ్దాన్ని విన్న స్థానికులు వారిని రక్షించగా వైసిపి నేత ఒమ్మి రఘురామ్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నన్ను గాయపరిచి నా కూతుర్ని తీసుకువెళ్లి ఇలా శవంగా మార్చాడని తల్లి సాయమ్మ ఆవేదనతో ఆరోపించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారుఈ సందర్భంగా సిఐ సూర్య అప్పారావు మాట్లాడుతూజగ్గంపేట గ్రామానికి చెందిన సాయమ్మ అనే ఆమెకు సుమారు ఒక సంవత్సరంన్నర క్రితం జగ్గంపేట గ్రామము టవర్ కాలనీ ఏరియా కు చెందిన మణికంఠతో ప్రేమ వివాహం జరిగిందనీ, వారి దాంపత్య జీవితములో వారికి 11 నెలల పాప ఉందనీ,వారు ఇరువురు తరుచూ గొడవలు పడుతున్నట్లు, గురువారం మధ్యాహ్నం సుమారు 2.00 గంటల ప్రాంతంలో సాయమ్మ ,మణికంఠ జరిగిన గొడవల కారణంగా ఆవేశంతో, చనిపోవాలనే ఉద్దేశం తో తన 11 నెలల పాపను తన యొక్క మోటార్ సైకిల్ పై ఎక్కించుకుని జగ్గంపేట శివారు గుర్రం పాలెం రూట్ లో గల పోలవరం కాలువలోకి మోటర్ సైకిల్ తో పాపతో సహా ఆత్మ హత్య చేసుకోవాలని కాలువ లోనికి వెళ్ళి పోగా అది చూసిన వారు రక్షించడానికి ప్రయత్నించగా పాప చనిపోగా అతను బ్రతికినాడనీ అన్నారు. తన భార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అతనినీ అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నామని తెలిపారు.

# ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

విజయవాడ, ఫిబ్రవరి 27:

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ఉదయం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి కి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అసిస్టెంట్ కమిషనర్ పర్యవేక్షణలో మంత్రి కి ప్రత్యేక ప్రోటోకాల్ దర్శన ఏర్పాట్లు చేశారు. గర్భాలయంలోని అమ్మవారిని దర్శించుకుని మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు మంత్రి కి వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ రంగారావు మంత్రి కి అమ్మవారి ప్రసాదం, శేష వస్త్రం మరియు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిడుగు రుద్రరాజు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. దర్శనం అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

=

# తిరుపతిలో కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం ప్రభుత్వం దగ్గర ప్రతిపాదన లేదు

అమరావతి ఫిబ్రవరి 27,

తిరుపతిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణంపై మంత్రి నారాయణ అసెంబ్లీ లో సమాధానం ఇచక్చారు.

నారాయణ మాట్లాడుతూ తిరుపతిలో కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపట్టే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదు. తిరుపతి లో 4.5 లక్షల జనాభా ఉన్నారు. ప్రతిరోజూ 75,000 నుంచి లక్ష మంది తిరుపతికి వస్తుంటారు. ప్రతిరోజూ 54.5 ఎంఎల్డీ ల ద్రవ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటాయి. మొత్తం 408.4 కిమీ ల పరిధిలో యూజీడీ అవసరం ఉందని అన్నారు.

ప్రస్తుతం 284.3 కిమీ పరిధిలో నెట్వర్క్ ఉండగా...మరో 125 కిమీ చేయాల్సి ఉంది.

పాత నెట్వర్క్ లో 60 కి.మీ పరిధిలో మార్చాల్సిన అవసరం ఉంది. పాత వాటిని మార్చడం తో పాటు కొత్తగా లైన్ వేయాలంటే 152.45 కోట్లు అవసరం అని అంచనా వేశారు. పాత వాటిలో 7.5 కి.మీ లైన్ మార్చేందుకు మార్చిలో టెండర్లు పిలుస్తున్నాం. మిగతా ప్రాంతంలో యూజీడీ కోసం నిధులపై కేంద్రం తో సంప్రదించి ముందుకెళ్తామని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా21,170 కి.మీ మేర అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మించాల్సి ఉంది. దీని కోసం 24,000 కోట్లు అవసరం అవుతుంది. ప్రస్తుతం 3,334 కి.మీ మేర యూజీడీ వ్యవస్థ ఉంది.

మరో 2,860 కి.మీ మేర పనులు జరుగుతున్నాయి. స్వచ్ఛ ఆంధ్ర సాధించాలంటే అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పూర్తి చేయాల్సి ఉంది. ఆర్థిక పరిస్థితి బట్టి యూజీడీ నిర్మాణంపై ముందుకెళ్తామని అన్నారు.

# ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్తున్న డాక్టర్ నిశాంత్ రావు ఘనంగా సన్మానించిన వైద్య సిబ్బంది



మణుగూరు ఫిబ్రవరి 27 (భారతశక్తి): మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలందించిన ఆయన, ఉన్నత విద్యాభ్యాసం కోసం కాకతీయ మెడికల్ కళాశాలలో జనరల్ సర్జరీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యను అభ్యసించాడనికి వెళ్లనున్నారు. గత మూడు సంవత్సరాలుగా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ విశేష సేవలందించిన డా. నిశాంత్ రావు, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ముఖ్యంగా బుడుగుల, ఖమ్మం తోగు, బుగ్గ, పెద్దపల్లి, రేగులగండి వంటి మారుమూల ప్రాంతాల్లో మలేరియా, డెంగీ వ్యాధులపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పలు హెల్త్ క్యాంపులు నిర్వహించి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పి.హెచ్.సిలోని సమావేశపు హాల్లో డాక్టర్ నిశాంత్ రావుని వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. సహచర వైద్యులు, సిబ్బంది ఆయన భవిష్యత్ విద్యాభ్యాసం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# ప్రకృతి సేద్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

## శిక్షణ పూర్తి చేసుకున్న 'కృషి సఖి'లకు ధృవీకరణ పత్రాల పంపిణీ

నిర్మల్, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 27:



ప్రకృతి వ్యవసాయం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బైల్ బజార్ రైతు వేదికలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (ఔ-ఔఓఈ) కింద ఎంపిక చేసిన ఐకేపీ మహిళలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రసాయనాలతో కూడిన సాగు కంటే, శాశ్వత ప్రాతిపదికన సేంద్రియ పద్ధతులు పాటించడం వల్ల రైతులకు అధిక లాభాలు వస్తాయని తెలిపారు. ఆర్గానిక్ పంటల సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా అండగా నిలుస్తున్నాయని చెప్పారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేసేందుకు 15 క్లస్టర్లను ఎంపిక చేశామని, ప్రతి క్లస్టర్ నుండి ఇద్దరు ఐకేపీ మహిళలను 'కృషి సఖి'లుగా ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వివరించారు.

శిక్షణ పొందిన మహిళలు గ్రామాల్లోని రైతులకు సేంద్రియ సాగు విధానాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లేలా వారిని ప్రోత్సహించాలని కోరారు. అలాగే, జిల్లా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునేందుకు వీలుగా ఒక ప్రత్యేక షాపును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను సంస్థ ప్రతినిధులు కలెక్టర్ కు అందజేశారు. అనంతరం శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 'కృషి సఖి' మహిళలకు కలెక్టర్ ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, అరణ్య సంస్థ ప్రతినిధులు పద్మ, నర్సయ్య, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, అధికారులు, సిబ్బంది, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

# "అరైవ్ అలైవ్ 2026" కార్యక్రమంలో భాగంగా ముధోల్ లో మెగా ఉచిత కంటి వైద్య పరీక్షశిబిరం

## -డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు
## -కళ్ళజోళ్లను పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (భారత శక్తి ) రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా కొనసాగుతున్న "అరైవ్ అలైవ్ ? 2026" రెండవ దశ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతుంది. ఇందులో భాగంగా ముధోల్‌లో ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరం ఏర్పాటు చేసి, స్థానిక ఆసుపత్రి వైద్యుల సహకారంతో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షా శిబిరంలో (ఈతీవవ ఇవవ అప్త్రవఇ౯ఎ-బీజూ అజీఎజూ), చూపు సమస్యలు ఉన్న డ్రైవర్లను గుర్తించి వారికి ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. డ్రైవర్లు సురక్షితంగా ప్రయాణించేలా వారికి, రోడ్డు భద్రత నియమాల గురించి, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ దూరదృష్టి లోపం, చూపు మందగించడం వంటి సమస్యలు రోడ్డు ప్రమాదాలకు ఒక ముఖ్య కారణమవుతున్నందున, డ్రైవర్లు తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచించారు. సరైన చూపు ఉండటం సురక్షిత డ్రైవింగ్‌కు అత్యంత అవసరమని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా , ముధోల్ ఇన్స్పెక్టర్ రవీందర్, సమ్మయ్య, ఎస్ఐ లు, సిబ్బంది, పెద్ద ఎత్తున డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (భారత శక్తి) పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకాంక్షించారు. శుక్రవారం లక్ష్మణచందా మండలంలోని వడ్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు.

కలెక్టర్ నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. గణితం, ఇంగ్లీషు తదితర ముఖ్య విషయాలకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి, వారి సమాధానాలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా, ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శ్రేణి మార్కులు సాధించాలని సూచించారు.

అనంతరం పాఠశాలలో ఉన్న వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో రాధ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కర ఘాట్ లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27 (భారత శక్తి): గోదావరి నది పుష్కర ఘాట్లను పరిశీలించి సంబంధిత ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏటూరు నాగారం, మంగపేట మండలాలలోని చుంచుపల్లి , మల్లూరు, పోదుమూరు, రామన్నగూడెం, ముళ్ళ కట్ట పుష్కర ఘాట్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 2027 లో నిర్వహించనున్న గోదావరి నది పుష్కరాల సందర్భంగా ములుగు జిల్లాలోని ఏర్పాటు చేస్తున్న పుష్కర ఘాట్ల నిర్మాణాలు, మరమ్మత్తు పనులు, భక్తుల కోసం ఏర్పాటు చేయవలసిన సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్ర ప్రతిపాదనలను సిద్ధం చేసి వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నదీ తీర ప్రాంతంలో పుష్కరాల సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పించేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, ముఖ్యంగా ప్రతి ఘాట్ వద్ద భక్తులకు త్రాగునీరు, లైటింగ్, మరుగుదొడ్లు, రవాణా మార్గం, పార్కింగ్ స్థలాలు, ప్రత్యేక వైద్య శిబిరాలు ఇతర సౌకర్యాలు కల్పించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, తహసిల్దార్ రవీందర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దర్జీలకు.. దర్జా ఏదీ.?

## -దయనీయ స్థితిలో దర్జీలు
## -రెడీమేడ్ రాకతో తగ్గిపోయిన దర్జీల దుకాణాలు
## -చిన్నస్థాయి పట్టణాల్లోనూ షాపింగ్ మాల్స్
## -ఎంబ్రాయిడరీ, మోడల్ జాకెట్లతో మహిళా దర్జీలకు ఆదాయం
## -నేడు టైలర్స్ డే

(జర్మనీ దేశానికి చెందిన విలియమ్స్ హౌవే తన భార్య దుస్తులు కుట్టుకునేందుకు పడుతున్న అవస్థలు గమనించాడు. ఎలాగైన కుట్టు కోసం ఒకమిషన్ ఉంటే బాగుంటుందని దాదాపు 11 నెలలపాటు శ్రమించాడు. 1846లో ఫిబ్రవరి 28న కుట్టుమిషన్ను కనిపెట్టాడు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా కుట్టుమిషన్లు వినియోగంలోకి వచ్చాయి. ఫిబ్రవరి 28న ప్రపంచ వ్యాప్తంగా దర్జీల దినోత్సవేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. నేడు అంతర్జాతీయ టైలర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.)

భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (భారతశక్తి): దర్జీ వృత్తినే ఆధారం చేసుకుని ఎన్నో కుటుంబాలు దర్జాగా ఉండేవి. పూర్వకాలంలో పద్మశాలీలు మాత్రమే వస్త్రాలు కుట్టేవారు. ప్రస్తుతం అన్నివర్గాల వారు టైలరింగ్ లో ప్రావీణ్యం సంపాదించుకున్నారు. పండగ వస్తుందంటే చాలు అందరికంటే ముందు పండగ వాతావరణాన్ని అనుభవించేది దర్జీలే. పండుగకు చాలా రోజులు ముందుగానే కొత్త బట్టలు తీసుకుని వచ్చి కుట్టించుకునే పనిలో అందరూ ఉంటారు. పండగ సమయానికి చేతినిండా డబ్బులు ఉండేవి. చక్కగా కుటుంబాన్ని పోషించుకుంటూ సంతోషంగా గడిచిన దినాలు ప్రస్తుతం లేవని దర్జీలు వాపోతున్నారు.



### రెడీమేడ్ మాల్స్ రాకతో

రెడీమేడ్ రంగం రాకతో దర్జీల దుకాణాలు చాలా వరకు మూసుకుపోయాయి. రెడీమేడ్ బట్టలమీద ప్రజలు ఎక్కువ ఆసక్తి చూపడం వలన కుటుంబం గడవడమే కష్టంగా మారాయి. టైలర్ దగ్గర ప్రజలు బారులు తీరిన రోజులకు చరమగీతం పాడింది రెడీమేడ్ రంగం. కావలసిన రంగులలో, ఎన్నో కొత్త మోడల్స్ తో, రకరకాల ఆకర్షణీయమైన స్టైల్స్ లలో బట్టలు తక్కువ ధరకే లభిస్తున్నాయి. ఎక్కడ చూసినా వస్త్ర దుకాణాలు విపరీతంగా పెరిగిపోయాయి. తోపుడు బండ్లమీద కూడా రూ.150 లకే టీ షర్టు అమ్ముతూ ప్రజలను విరివిగా ఆకర్షిస్తున్నారు. దీంతో దర్జీల జీవనం దయనీయంగా మారిపోయింది.

### ఆరోగ్య సమస్యలు

గంటల తరబడి కుట్టుమిషన్ మీద కూర్చొని కుట్టాల్సిరావడంతో టైలర్లను అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా కంటిచూపు దెబ్బతింటుంది. వెన్నునొప్పి, మోకాళ్లు, ఆర్థో సమస్యలు పెరుగుతున్నాయి. కూర్చొని ఉండటం వల్ల కొందరికి స్థూలకాయ సమస్య సైతం వేధిస్తున్నది. ఎంబ్రాయిడరీల కళ గురించి చెప్పనవసరం లేదు. మహిళా దర్జీల పని వర్ధిల్లుతుండగా.. ఈ వృత్తి ఎంచుకున్న పురుషుల పరిస్థితి మాత్రం అగమ్య గోచరంగా మారింది.

### మహిళల ఆదాయ వనరుగా టైలరింగ్ వృత్తి

సామాన్య కుటుంబాలకు చెందిన మహిళలు ఎందరో ఆర్థిక ఇబ్బందులు తీర్చుకునేందుకు స్వయం ఉపాధిగా టైలరింగ్ ను ఎంచుకుంటున్నారు. ఇంటిపనులు చక్కదిద్దుకొని ఆదాయ వనరులు పెంపొందించుకునేందుకు గృహిణులకు టైలరింగ్ దోహదపడుతుంది. టైలరింగ్ ను చాలామంది మహిళలు స్వయం ఉపాధిగా మలుచు కుంటున్నారు.

### ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. దేవరకొండ వీరభద్రచారి, మణుగూరు

గత ఐదు దశబ్దాలుగా టైలరింగ్ మీద ఆధారపడి జీవిస్తున్నాము. నేను పాఠశాలకు వెళ్లే రోజుల్లో మా బంధువులు టైలరింగ్ చేసేవారు. వారు ఎప్పుడూ నూతన వస్త్రాలు కుట్టడంలో బిజీగా ఉండే వారు. పండుగ 20 రోజుల ముందు నుండే టైలరింగ్ దుకాణం బిజీగా, సందడిగా ఉండేది. ఆదాయం కూడా బాగుండేది. దీనితో నాకు కూడా ఆసక్తి కలిగి స్కూల్ మానేసి టైలరింగ్ నేర్చుకున్నాను. టైలరింగ్ వృత్తిపైనే ఆధారపడి పిల్లలను చదువులు చదివించడంతో పాటు పెండ్లిళ్ల చేశాను. ప్రస్తుతం ఆరోగ్యం సహకరించక పోవడంతో అరకొరగా వచ్చే కొత్త దుస్తులు కుట్టి జీవనం సాగిస్తున్నా.. బట్టలు కుట్టించుకునేవాళ్ళ సంఖ్య తగ్గిపోయింది. వాళ్లకి దొరికే మోడల్స్, తక్కువ ధర వారిని మాకు దూరంచేసింది. రెడీమేడ్ రంగంతో మేము పోటీ పడలేము. ఏదిఏమైనా టైలర్ కుట్టిన బట్టలకు, రెడీమేడ్ బట్టలకు చాలా తేడా ఉంటుంది. ప్రభుత్వం టైలర్స్ కు తగిన సహకారం అందించాలి.

### అన్ని రకాల టైలరింగ్ చేస్తున్నాను. ఎమ్. వెంకట్రావు, మణుగూరు

పండుగలు వస్తే తప్ప గిరాకీలు ఉండడం లేదు. చాలామంది రెడీమెడ్ దుస్తులకు అలవాటు పడ్డారు. అవసరమైన వారికి కుడుతు న్నాము. రానున్న తరంలో వారసత్వంగా టైలరింగ్ చేసే పరిస్థితి లేదు. బ్యాంకుల్లో రుణ సదుపాయం కల్పిస్తే బాగుంటుంది. నాకు 20వ ఏటా వచ్చిన నాటి నుండి టైలరింగ్ చేస్తున్నాను. ఇప్పుడు నా వయస్సు 60 సంవత్సరాలు, అయిన ఎవరి మీద ఆధారపడకుండా దర్జీ పని చేస్తున్నాను. ప్రస్తుతం పెరిగిన రెడిమెడ్ దుస్తుల వలన మావృత్తికి ఇబ్బందులు ఎదురౌతున్నాయి. దీంతో మాకు ఆదాయం తగ్గటంతో పాటు, షాపుల అద్దెలు, మెటీరియల్ ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గిపోయింది. ప్రభుత్వం తగిన ప్రోత్సహకాలు అందించి ఆదుకోవాలి.

# బాసర ఆర్జీయూకేటీ సరికొత్త రికార్డు: ప్రతిరోజు 3,238 మంది విద్యార్థులతో స్టడీ అవర్స్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (భారత శక్తి) బాసర రాజీవ్ గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్న 'నైట్ స్టడీ అవర్స్' ప్రోగ్రామ్ ఏకంగా మూడు రికార్డు బుక్కుల్లో చోటు



సంపాదించింది.

–రికార్డుల వివరాలు:

–పీయూసీ1, పీయూసీ2 తరగతులకు చెందిన 3,238 మంది విద్యార్థులు ఒకే సమయంలో క్రమశిక్షణతో స్టడీ అవర్స్‌లో పాల్గొనడం ఈ రికార్డుకు దారితీసింది. ఈ అద్భుతమైన ఫీట్‌ను గుర్తిస్తూ..

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్

వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్

నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ×సంస్థలు ధృవీకరణ పత్రాలను అందజేశాయి.

ప్రోగ్రామ్ ఎలా సాగింది

ప్రతిరోజు రాత్రి 8 గంటల నుండి 10 గంటల వరకు అకాడమిక్ బ్లాక్‌ల1 లోని 46 క్లాస్ రూమ్‌లలో ఈ కార్యక్రమం జరుగుతోంది. చదువుకోవడంతో పాటు సబ్జెక్టుల్లో సందేహాలను నివృత్తి చేసుకునేందుకు (డౌట్స్ క్లారిఫికేషన్) ఈ సమయాన్ని కేటాయించారు. గత రెండేళ్లుగా ఈ కార్యక్రమం నిరాఘాటంగా, ఎంతో విజయవంతంగా కొనసాగుతోంది.

అధికారుల హర్షం:

ఈ విజయానికి కృషి చేసిన స్టడీ అవర్స్ ఇన్–ఛార్జ్ డాక్టర్ గుజ్జరి శంకర్ ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ. మురళీ దర్శన్ ప్రత్యేకంగా అభినందించారు. శంకర్ పర్యవేక్షణలో విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతూ, సందేహాలను నివృత్తి చేసుకుంటూ అకడమిక్ పరంగా రాణిస్తున్నారు. డాక్టర్ శంకర్ నాయకత్వంలో అధ్యాపకులు, సిబ్బంది సమన్వయంతో ఈ రికార్డు సాధ్యమైందని వారు కొనియాడారు. విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదలే ఈ స్థాయి గుర్తింపునకు కారణమని వారు పేర్కొన్నారు. ఈ విజయంతో రాజీవ్ గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయం, బాసర విద్యా రంగంలో మరో మైలురాయిని నెలకొల్పి, భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్టాత్మక విజయాలను సాధించే దిశగా ముందుకు సాగుతోంది.

ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించిన డీన్ అకాడమిక్స్ శీలం శేఖర్, డీన్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ డాక్టర్ విఠల్, డా.జి.నాగరాజు వివిధ విభాగాల అధిపతులు, బోధన మరియు బోధనేతర సిబ్బందికి శంకర్ ధన్యవాదాలు తెలిపారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల నిబద్ధత విద్యాలోకానికి ఆదర్శంగా నిలిచిందని యూనివర్సిటీ వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి.

# తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల యువతకు భారత వైమానిక దళంలో చేరేందుకు సువర్ణావకాశం : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఫిబ్రవరి 27: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల యువతకు భారత వైమానిక దళంలో చేరేందుకు సువర్ణావకాశం లభించిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలో 12 ఎయిర్ మెన్ సెలెక్షన్ సెంటర్ ద్వారా అగ్నివీర్వాయు నియామకానికి ఓపెన్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించబడుతుందని,

ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీ 08 మార్చి 2026 నుండి 18 మార్చి 2026 వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అర్హత కలిగిన యువకులు, యువతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ,

అభ్యర్థులు అర్హత ప్రమాణాలు, అవసరమైన పత్రాలు, ఇతర వివరాల కోసం భారత వైమానిక దళ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ఈ విషయాన్ని జిల్లా ప్రజలకు విస్తృతంగా



తెలియజేయాలని, ముఖ్యంగా అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# హాజరైన ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నేరస్తులకు శిక్షలు ఖరారు అయ్యేలా నాణ్యమైన దర్యాప్తు చేయాలి: జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 27 (భారత శక్తి) నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్‌అధ్యక్షతన పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో కలిసి డిస్ట్రిక్ట్ ప్రాసిక్యూటర్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశంలో ముఖ్యంగా గ్రేవ్ కేసుల్లో కోర్టులలో వచ్చిన అక్విటల్ (విముక్తి) తీర్పులపై సమగ్రంగా



సమీక్ష చేపట్టారు. కేసులు అక్విటల్ కావడానికి గల కారణాలు, దర్యాప్తు లోపాలు, సాక్ష్యాధారాల సమర్పణలో ఉన్న సమస్యలు, సాక్షుల హాజరు, ప్రాసిక్యూషన్ నిర్వహణ తదితర అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. అలాగే, సంబంధిత కేసుల్లో అప్పీల్‌కు వెళ్లే అవకాశాలపై న్యాయపరమైన అంశాలను పరిశీలించి, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. భవిష్యత్తులో ఇలాంటి కేసుల్లో బలమైన సాక్ష్యాధారాలు సమర్పించేందుకు దర్యాప్తు అధికారులు మరియు ప్రాసిక్యూషన్ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

నేరస్తులకు శిక్షలు ఖరారు అయ్యేలా దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచడం, కోర్టు విచారణలో సాంకేతిక ఆధారాలను సమర్థంగా వినియోగించడం పై అధికారులు దృష్టి సారించాలని సమావేశంలో స్పష్టం చేశారు. జిల్లాలో న్యాయవ్యవస్థతో సమన్వయం పెంపొందించి, బాధితులకు న్యాయం అందేలా కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్లు చేసిన సేవలను గుర్తించి, వారిని సత్కరించారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సుదర్శన్ రెడ్డి, సతీష్, అరుణ, దేవేందర్,డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ సమ్మయ్య, ఎస్ఐ ఉన్నారు.

# సిండి'కేట్'గాళ్ళ మాయాజాలం.!

## –గొలుసు, నిషేధిత దందా.. పట్టని పంథా.!
## –గ్రామాల్లో విచ్చలవిడిగా దుకాణాలు.!
## –తాజాగా డోర్ డెలివరీ సౌకర్యాలు
## –బెల్ట్ షాపుల్లో నిషేధిత గంజాయి, గుట్కా, ఖైనీ ప్యాకెట్లు విక్రయాలు
## –చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
## –మామూళ్ళు ధిక్కరించిన వారిపై దాడులు
## –ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ శాఖ

(కనుకు రమేష్..)

అశ్వాపురం/పినపాక/కరకగూడెం (భారతశక్తి): ఏజెన్సీ ప్రాంతంలో సిండి'కేట్' గాళ్ల మాయాజాలంతో పచ్చని పల్లెల్లోకి లిక్కర్ తో పాటు నిషేధిత మత్తు పదార్థాలు కూడా గుట్టుచప్పుడు కాకుండా గుప్పు మంటున్నాయి. ఇదంతా భద్రాద్రి కొత్తగూడెం



జిల్లా, పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల్లోని వైన్స్ షాపు సిండికేట్ గాళ్ళు నయా దందాకు ఆజ్యం పోస్తున్నారు. బెల్టుషాపులను కట్టడి చేస్తే వ్యాపారం చేయలేమని మొన్నటివరకు సన్నాయినొక్కులు నొక్కిన బినామీ సిండికేట్ గాళ్ళు ఇప్పుడు.. ఆ బెల్టు షాపులకు సరఫరా చేసే మద్యం సీసాలపై అదనపు ధర వడ్డించి మద్యం ప్రియుల నడ్డి విరుస్తున్నారు. మద్యంషాపుల యజమానులు, బెల్ట్‌షాపుల నిర్వాహకులు ఒక్కటై నిషేధిత పదార్థాలను కూడా పల్లెల్లో విక్రయాలు చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడి, అదనపు రాబడికి, అనుకున్న లక్ష్యాలకు చేరువ కావాలంటే మద్యంతో పాటు నిషేధిత గంజాయి, గుట్కా, తంబాకు, ఖైనీ ప్యాకెట్లు గుట్టుచప్పుడు కాకుండా విక్రయించేందుకు సిండికేట్ మార్గం సుగమం చేసుకున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా మామూళ్లు అందుకుని తెలియనట్టు నటిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

నిబంధనలు భేఖాతార్

బెల్టుషాపులు నిర్వహించినా.. మద్యం ధరలు ఎంఆర్‌పీ కన్నా పెంచినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ప్రభుత్వం పదేపదే ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు యంత్రాంగాన్ని ఆదేశిస్తోంది. ప్రతి షాప్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిత్యం పర్యవేక్షించాలని, మద్యం ఉల్లంఘనలకు పాల్పడే షాపులకు జరిమానా విధించాలని, రెండోసారి పట్టుబడితే లైసెన్సు రద్దుచేయాలని స్పష్ట ఉత్తర్వులు ఉన్నాయి. మద్యం నూతన పాలసీలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొంది. కానీ ఎక్కడ ఏ మాత్రం ఏ ఒక్కటీ అమలు కావడం లేదు. అక్రమంగా వైన్స్ షాపు పక్కనే సిండికేట్ కార్యాలయం ఏర్పాటు చేసి బెల్ట్ దుకాణాలకు సీసాపై అధిక రేటుకు సరఫరా చేస్తున్నారు. దీనితో ఎక్కడికక్కడే గొలుసు దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. బెల్టుషాపుల నిర్వహణ ఉపాధిలా మారిపోయింది. పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ చేసినప్పుడుల్లా మామూళ్ల ఇవ్వని వారి సరుకును పట్టుకొని నామమాత్రపు కేసులు నమోదు చేస్తున్నారు.

మద్యంతో పాటు నిషేధిత మత్తు పదార్థాలు

అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల్లో లైసెన్సులు పొందిన వైన్స్ బినామీ కేటుగాళ్ళు గ్రామాల్లో ఇంటింటికి వెలసిన బెల్టుషాపులకు మద్యంతో పాటు నిషేధిత గంజాయి, గుట్కా, ఖైనీ, తంబాకు వంటివి కూడా సరఫరాకు ఊతమిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆదివాసీ గుడాల్లో మత్తుకు బానిసలుగా మారిన ప్రియులు ఏది దొరికితే అది సేవిస్తున్నారు. బెల్ట్ షాపుల్లో ఏదైనా 24 గంటలు మద్యంతో పాటు మత్తు పదార్థాలకు అందుబాటులో ఉండేందుకు నిలయాలుగా మారాయి. ఇదేంటని అడిగితే, రిస్కుతో కూడుకున్న అధిక సంపాదన కోసం తప్పడం లేదని చెప్పుకొస్తున్నారు. ఇదంతా సంబంధించిన అధికారుల కనుసన్నల్లోనే సాగుతోందని బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా స్టఫ్ టెండర్లు

మద్యం దుకాణాలల్లో ప్లాస్టిక్ గ్లాసులు, స్టఫ్ కు సంబంధించిన పల్లీ, బఠానీ, వాటర్ ప్యాకెట్లు విక్రయించేందుకు అనుమతులు లేకపోయినా అక్రమంగా వాటిని విక్రయాలు చేస్తున్నారు. వైన్స్ పక్కనే అక్రమంగా రూమ్ ఏర్పాటు చేసి స్టఫ్ అమ్ముకునేందుకు లక్షల్లో అద్దెకు ఇస్తున్నారు. చికెన్, మటన్, చేప ఫ్రై సెంటర్లు ఏర్పాటు చేసి అందులోనే సిట్టింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. నిబంధనల ప్రకారం మద్యం దుకాణాల సమీపంలో ఎలాంటి రూమ్స్ లు ఉండకూడదు. కానీ అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల్లోని ప్రతిమద్యం దుకాణానికి విశాలవంతమైన రూంను ఏర్పాటు చేసి, సిట్టింగ్ సెటప్ చేసి నిలువునా దోచుకుంటున్నారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి: జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా

కడప, ఫిబ్రవరి 27(భారత శక్తి) : పారిశ్రామిక వనరులు పుష్కలంగా ఉన్న కడప జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా సంబంధిత అధికారులను ఆదేశించారు.

శుక్రవారం సాయంత్రం కడప కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా జేసీ డా. నిధి మీనా

మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి పరిశ్రమల ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు.

సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా మొత్తం 18 శాఖలకు సంబంధించి 11,033 దరఖాస్తులు అందగా, వాటిలో ఇప్పటి వరకు 10,886 దరఖాస్తులకు అనుమతి ఇవ్వడం జరిగిందని, 10,836 దరఖాస్తులు పరిశీలనలో, 50 పరిశీలనకు సిద్ధంగా ఉన్నాయని, 88 దరఖాస్తులను వివిధ కారణాల వల్ల తిరస్కరించడం జరిగిందన్నారు. 59 దరఖాస్తులు పలు కారణాల వల్ల పెండింగ్ లో ఉంచడం జరిగిందన్నారు.

పారిశ్రామిక అభివృద్ధి పాలసీ ప్రకారం జిల్లాలో మొత్తం రూ. 3,53,98,514 ల వేర నిధుల విడుదలకు అనుమతినివ్వడం జరిగిందన్నారు. ఇందులో ఐడిపి 2023-27 పాలసీ ప్రకారం ఎస్సి కేటగిరి పలు యూనిట్లకు రూ. 1,17,12,829 లు. ఐడిపి 2024-29 పాలసీ ప్రకారం ఎస్సి కేటగిరి పలు యూనిట్లకు రూ. 2,35,99,841 ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఐడిపి 2020-23 పాలసీ ప్రకారం ఓబీసీ కేటగిరి క్రింద రూ. 85,844 లు, మేర నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రొత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లతో సమన్వయం చేయడం జరుగుతుందన్నారు. పరిశ్రమల ప్రమోషన్ కు సంబంధించి ఇంకా ఏవైనా అప్లికేషన్లు పెండింగ్ లో ఉంటే.. వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయి నుండి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై అవగాహన పెంపొందించాలన్నారు.

అంతకుముందు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జిఎం చాంద్ బాషా సంబందిత వివరాలను సమావేశంలో కలెక్టర్ కు వివరించగా ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో జేసీ సమీక్షించారు.

ఈ సమావేశంలో సిక్కి డిసి డి. జ్ఞాన ప్రకాష్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ చిన్నారావు, ఎల్డిఎం జనార్దనం, సోషల్ వెల్ఫేర్, డిఆర్డీఏ, మెప్మా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అగ్నిమాపక డిడిఆర్ఎఫ్ అధికారులు, డిటిఓ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ, ఏపీఎస్ పిడిసీఎల్ శాఖల అధికారులు, ఏపీఐఐసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా

## ప్రధాని మోదీ నుంచి ఆశీస్సులు తీసుకున్న 'విరోష్'



రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో టాలీవుడ్ యాక్టర్లు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహం అంగరంగ వైభవంగా జరిగిన విషయం తెలిసిందే. వివాహ బంధంలోకి అడుగుపెట్టడానికి ముందే ఈ జంట ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లూ గోప్యంగా ఉన్న ఈ భేటీకి సంబంధించిన ఫోటోలను తాజాగా విజయ్ టీమ్ విడుదల చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**ప్రధానికి ప్రత్యేక ఆహ్వానం**

ప్రధాని మోదీని కలిసి ఆశీస్సులు తీసుకోవడంతో పాటు మార్చి 4న హైదరాబాద్ లో జరగనున్న తమ వెడ్డింగ్ రిసెప్షన్ కు ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రధాని నూతన దంపతులకు తన శుభాకాంక్షలు తెలియజేసినట్లు సమాచారం. కాగా, ఉదయ్‌పూర్ లో కేవలం అత్యంత సన్నిహితుల మధ్యే 'విరోష్' పెళ్లి జరగగా, చిత్ర పరిశ్రమ, రాజకీయ మరియు క్రీడా రంగాలకు చెందిన ప్రముఖుల కోసం హైదరాబాద్‌లో భారీ రిసెప్షన్ ప్లాన్ చేశారు. మార్చి 4న జరగబోయే ఈ వేడుకకు దేశవ్యాప్తంగా ఉన్న సినీ దిగ్గజాలు హాజరుకాబోతున్నారు.

## 'ది కేరళ స్టోరీ 2' చిత్రం విడుదలకు మార్గం సుగమం..

## స్టే ఎత్తివేసిన హైకోర్టు డివిజన్ బెంచ్



'ది కేరళ స్టోరీ 2' సినిమా విడుదల కాకుండా కేరళ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను డివిజన్ బెంచ్ ఎత్తివేసింది. దీంతో ఈ చిత్రం విడుదలకు మార్గం సుగమమైంది. ఈ చిత్రం విడుదల కాకుండా హైకోర్టు సింగిల్ బెంచ్ ఇటీవల స్టే ఇచ్చింది. సీబీఎఫ్‌సీ తీరును తప్పుబడుతూ సినిమాను పునఃపరిశీలించాల్సిందిగా ఆదేశించింది. 15 రోజుల పాటు సినిమాపై స్టే విధించింది. సింగిల్ బెంచ్ తీర్పును చిత్ర నిర్మాత కేరళ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. ఈరోజు సాయంత్రం వరకు ఇరువర్గాల తరఫున సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ పీవీబాలకృష్ణన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసింది. 2023లో విడుదలైన 'ది కేరళ స్టోరీ' చిత్రానికి సీక్వెల్ 'ది కేరళ స్టోరీ 2' రూపొందింది. దీనికి కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా, విపుల్ అమృత్ లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్త, అదితి బాటియా, ఐశ్వర్య ఓజా ఈ చిత్రంలో నటించారు. నిజ జీవితంలో జరిగిన అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చెబుతున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 27న విడుదల చేస్తామని చిత్ర బృందం ప్రకటించగా, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుతో వాయిదా పడింది. ఈరోజు డివిజన్ బెంచ్ తీర్పుతో ఈ సినిమా విడుదలకు అడ్డంకులు తొలగిపోయాయి.

## విజయ్-రష్మిక పెళ్లి..

## కిలోల కొద్దీ బంగారంతో కొత్త ట్రెండ్ సృష్టించిన జంట!

స్టార్ హీరో విజయ్ దేవరకొండ, ప్రముఖ నటి రష్మిక మందన్న పెట్టకేలకు ఒక్కటయ్యారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జన్న వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో అందరి దృష్టినీ ఆకర్షించింది మాత్రం వధూవరులు ధరించిన భారీ బంగారు ఆభరణాలే. సింపుల్, మినిమల్ డిజైన్ల ట్రెండ్ నడుస్తున్న ఈ రోజుల్లో, కిలోల కొద్దీ బరువైన సంప్రదాయ టెంపుల్ జ్యువెలరీ ధరించి ఈ జంట సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్‌కు తెరలేపింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆభరణాల సంస్థ 'శ్రీ జ్యువెలర్స్' ఈ నగలను ప్రత్యేకంగా డిజైన్ చేసింది. వధూవరుల అభిరుచికి, దక్షిణాది సంస్కృతికి అద్దం పట్టేలా ఈ ఆభరణాలను రూపొందించారు. విజయ్ దేవరకొండను ఒక పౌరాణిక రాజుగా ఊహించుకుని, ఆయన ఆభరణాలను డిజైన్ చేశారు. ఏనుగు (వివేకానికి చిహ్నం), పులి (వేగానికి ప్రతీక) వంటి మూలాంశాలతో పాటు పూల డిజైన్లతో నక్షి చెక్కడాలు జోడించి ఈ నగలను తయారు చేశారు. పెద్ద సైజు చెవి దిద్దులు, చేతి కడియాలు, మెడలో రెండు భారీ హారాలు, భుజకీర్తులు, చివరికి కాలికి కూడా కడియాలు ధరించి విజయ్ అందరినీ ఆశ్చర్యపరిచారు. మరోవైపు రష్మిక మందన్నను ఒక దేవతలా భావించి ఆమె ఆభరణాలను తీర్చిదిద్దారు. దక్షిణాది ఆలయాల వాస్తు శిల్పం స్ఫూర్తితో రూపొందించిన ఈ నగలలో నక్షి, రవ్వ పనితనం ఉట్టిపడింది.

## అందుకు పెండ్లి అక్కర్లేదు



సల్మాన్ ఖాన్ నటించిన జై హో సినిమాతో బాలీవుడ్‌లో హీరోయిన్ గా అరంగేట్రం చేసిన భామ డైజీ షా. హేట్ స్టోరీ 3, రేస్ 3 వంటి చిత్రాలలో నటించింది. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలో పెండ్లికి చోటు లేదని స్పష్టం చేసింది. 41 ఏండ్ల వయసులో నూ ఒంటరిగా ఉండటమే ఇష్టమని కుండబద్దలు కొట్టింది. తన చుట్టూ ఉన్న జంటలు విడిపోతున్న వార్తలు వింటుంటే భయమేస్తుందట. ప్రేమ అనేది మొదట్లో బాగుంటుందని, ఆ తర్వాత వచ్చే ఆర్థిక ఇబ్బందులు, మనస్పర్థలు భరించడం చాలా కష్టమని పేర్కొంది. అందుకే కేవలం తియ్యటి మాటలు చెప్పే వారిని నమ్మి పెళ్లి చేసుకునే స్థితిలో తాను లేదట. తన ఎగ్స్‌ని ఫ్రీజ్ చేయించిందట. భవిష్యత్తులో ఎప్పుడు కావాలంటే అప్పుడు తాను తల్లిని కాగలనని చెప్పింది. ఒక కుటుంబాన్ని ఏర్పర చుకోవడానికి కేవలం పెళ్లి మాత్రమే దారి కాదన్న ఆమె మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారాయి.

## రూ.25 కోట్ల ఆఫర్


సినిమా ఇండస్ట్రీలోకి ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చి తమ సామర్థ్యాన్ని నిరూపించుకుంటున్న వారిలో కోలీవుడ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పేరు ఇప్పుడు గట్టిగా వినిపిస్తోంది.



ఇంజినీరింగ్ చదువుతున్న రోజుల్లో వాట్సాప్ కాదల్ అనే లఘు చిత్రాన్ని రూపొందించి నటన, ఎడిటింగ్, దర్శకత్వం అన్నింట్లోనూ తన సామర్థ్యాన్ని చూపించాడు. దీంతో కోమలి చిత్రంతో దర్శకుడిగా వెండితెరపై అడుగుపెట్టాడు. దర్శకుడిగా సక్సెస్ అందుకున్న తర్వాత తనలోని నటుడిని ప్రేక్షకులకు పరిచయం చేయాలనుకున్న ప్రదీప్ స్వీయ దర్శకత్వంలో లవ్ టుడే మూవీని తెరకెక్కించాడు. 70 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత వచ్చిన రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్, డ్యూడ్ సినిమాలు ఆయనను స్టార్ హీరోల సరసన నిలబెట్టాయి. తొలి సినిమా కోమలికి రూ.50 లక్షలు తీసుకున్న ప్రదీప్ కు ఇప్పుడు బడా బ్యానర్లు ఏకంగా రూ.25 కోట్ల వరకు ఇవ్వడానికి ముందుకొస్తున్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం స్టార్ దర్శకుడు విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందుతున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఆయన నటిస్తున్నాడు. ఇందులో ఆయనకు జోడిగా కృతి శెట్టి నటిస్తుండగా, ఎస్.జె. సూర్య కీలక పాత్రలో కనిపించనున్నాడు. మార్చిలో విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## ప్రేమకు సాక్ష్యంగా

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జరిగిన విజయ్ దేవరకొండ, రష్మిక మందాన్న పెండ్లికి హీరోయిన్ కల్యాణి ప్రియదర్శన్ హాజరై సందడి చేసింది. తాజాగా వీరి మ్యారేజ్ ఫొటోను షేర్ చేసిన కల్యాణి తన ఇన్‌స్టా స్టోరీలో ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. 'ఈరోజు నేను అత్యంత అందమైన ప్రదేశంలో తన బెస్ట్ ఫ్రెండ్ ను పెళ్లి చేసుకున్న అమ్మాయిని చూశా. ఆమె అతడి వైపు అడుగులు వేస్తూ మండపం వైపు వస్తున్నప్పుడు వారిరువురి కళ్లల్లో ఆనందభాష్పాలు వారి ప్రేమకు చిహ్నాలుగా నిలిచాయి. ప్రతి అడుగు ఎన్నో భావోద్వేగ క్షణాలను మోసుకొచ్చినట్లు కనిపించింది. వారి మౌనం అన్నిటికీ సమాధానంగా నిలిచింది. ఎఫర్ట్, రెస్పెక్ట్, డీప్ ఫ్రెండ్ షిప్ తో ఏర్పడిన ప్రేమకు సాక్ష్యంగా నిలవడం ఎంత అదృష్టమో. స్నేహ బంధంతో ప్రేమగా ఒక్కటైన ఈ జంటను చూడడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. నా ప్రియమైన రష్మిక మందాన్న, విజయ్ దేవరకొండకు అభినందనలు. ఇది వీరికి మరో అందమైన ప్రారంభం కావాలి' అంటూ కల్యాణి పోస్ట్‌లో రాసుకొచ్చింది. ఇక అక్కినేని అఖిల్ 'హలో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కల్యాణి ప్రియదర్శన్.. తన నటనతో, అందంతో ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ చిన్నది మలయాళంలో సినిమాలు చేస్తూ అలరిస్తుంది. తెలుగులో మంచి అవకాశం వస్తే చేయడానికి రెడీగా ఉంది ఈ ముద్దుగుమ్మ.





## 'డెకాయిట్' కోసం వరంగల్ భద్రకాళి ఆలయంలో అడివి శేష్

* 'డెకాయిట్' సినిమా ప్రమోషన్స్ మొదలుపెట్టిన అడివి శేష్
* విడుదలకు ముందు వరంగల్ భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు
* శేష్, మృణాల్‌పై చిత్రీకరించిన 'రుబరూ' అనే రొమాంటిక్ సాంగ్ విడుదల
* ప్రేమ, ప్రతీకారం నేపథ్యంలో పాన్ ఇండియా స్థాయిలో ఏప్రిల్‌లో రిలీజ్

వరుస విజయాలతో దూసుకుపోతున్న యంగ్ హీరో అడివి శేష్ తన తదుపరి చిత్రం 'డెకాయిట్' ప్రమోషన్లను వినూత్నంగా ప్రారంభించాడు. ఏప్రిల్‌లో సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, చిత్ర బృందం వరంగల్‌లోని ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ సందర్భంగా శేష్ మాట్లాడుతూ, ఈ సినిమా తనకెంతో ప్రత్యేకమని, కథ ప్రారంభ దశ నుంచే తాను భాగస్వామిని అయ్యానని తెలిపాడు. ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రంలోని తొలి పాట 'రుబరూ'ను విడుదల చేశారు. అడివి శేష్, కథానాయిక మృణాల్ ఠాకూర్‌పై ఈ పాటను చిత్రీకరించారు. ఈ రొమాంటిక్ గీతం సినిమాలోని భావోద్వేగాలను చక్కగా ప్రతిబింబిస్తుందని అడివి శేష్ అన్నాడు. "ప్రేక్షకులతో ఈ కథను



పంచుకునే ముందు, అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలనుకున్నాను. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ఏప్రిల్‌లో మీరందరూ చూస్తారని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నాడు. షనీల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తుండటం విశేషం. ప్రేమ, ద్రోహం, ప్రతీకారం వంటి అంశాలతో ఈ కథ సాగుతుంది. తనను మోసం చేసిన మాజీ ప్రియురాలిపై ఓ ఖైదీ ఎలా పగ తీర్చుకున్నాడనేదే చిత్ర కథాంశం. తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అడివి శేష్, షనీల్ డియో కలిసి కథ, స్క్రీన్‌ప్లే అందించారు. ప్రకాష్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని పాన్‌ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.






## తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..

పెళ్లిళ్లు, శుభకార్యాలు అనగానే ముందుగా గుర్తొచ్చేది బంగారమే. అంతగా మన సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడిపోయింది ఈ లోహం. అంతేకాదు.. పెట్టుబడికి పెట్టాలనుకునే వారికి పసిడి మంచి సాధనం. పసిడితో పాటు వెండికీ మంచి గిరాకీనే ఉంది. అందుకే వీటి ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మరి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖ నగరాల్లో వాటి ధరలు ఎలా ఉన్నాయో చూడండి..

**బంగారం గురించి..**

బంగారం స్వచ్ఛతను క్యారట్లల్లో కొలుస్తారు. క్యారట్ల వాల్యూ పెరిగే కొద్దీ బంగారం స్వచ్ఛత, ధర పెరుగుతాయి. మేలిమి బంగారాన్ని 24 క్యారట్లుగా చెబుతారు. అంటే ఇది 99.9 స్వచ్ఛమైన బంగారమన్నమాట. ఇది కాయిన్స్, బార్స్, బిస్కెట్ల రూపంలో మాత్రమే దొరుకుతుంది. నగల తయారీకి 22 క్యారట్ల స్వచ్ఛతతో కూడిన బంగారాన్ని వినియోగిస్తారు. ఇందులో ఇతర లోహాలు కలుపుతారు. బంగారంతో చేయించుకునే ఆభరణాలన్నీ 22 క్యారెట్లు/916 స్వచ్ఛతతో ఉంటాయి. ఈ ధర కోసం మేలిమి బంగారం ధరను 91.6 శాతంతో గుణిస్తే సరిపోతుంది. బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు అంతర్జాతీయ విపణికి అనుగుణంగానే ఉంటాయి. అక్కడ పెరిగితే ఇక్కడా పెరుగుతుంది. తగ్గినా అంతే. మన దేశం బంగారం కోసం దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడినందున డాలర్ మారకపు విలువ కూడా దేశీయంగా పుత్తడి ధరలపై ప్రభావం చూపుతుంది. కొన్ని దుకాణాలు, ప్రాంతాల్లో పన్నులు, సుంకాలు ముందుగా కలపకుండా లోహాల ధరలను ప్రకటిస్తుంటాయి. దీనివల్ల ధర తక్కువగా కనపడుతుంది. ఆభరణం నచ్చి, బిల్లు వేయమన్నప్పుడు, పన్నులు/సుంకాలు కలిపితే.. ఏ ప్రాంతంలో అయినా బంగారానికి ఒకటే ధర అవుతుంది. ఆభరణం తయారీ, తరుగు ఛార్జీల్లో మాత్రం ప్రతి దుకాణానికీ తేడా ఉంటుంది.

## సిమ్ లేకపోతే వాట్సప్ బంద్.. మార్చి 1 నుంచి కొత్త రూల్స్

వాట్సప్, టెలిగ్రామ్ వంటి కమ్యూనికేషన్ యాప్స్‌నకు సంబంధించిన సిమ్ బైండింగ్ నిబంధనలు మార్చి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అంటే సిమ్ లేకుండా ఇకపై ఆయా యాప్స్ ఫోన్‌లో పనిచేయవన్నమాట. గతేడాది నవంబర్‌లో ఈ నిబంధనలు ప్రకటించగా.. అమలు కోసం ఆయా సంస్థలకు ఇచ్చిన గడువు ఫిబ్రవరి 28తో ముగియనుంది. అంటే మరికొన్ని గంటల్లో కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. దీంతో ఎవరైనా సిమ్ లేకుండా వాట్సప్ వాడుతుంటే ఆ ఫోన్లలో యాప్ నిలిచిపోతుంది. వాట్సప్ వెబ్ కూడా ప్రతి ఆరు గంటలకు ఒకసారి ఆటోమేటిక్‌గా లాగౌట్ అయిపోతుంది.

**ఏమిటీ నిబంధన?**

వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్, అరట్టై వంటి కమ్యూనికేషన్ యాప్స్ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కేంద్రం ఈ నిబంధన తీసుకొచ్చింది. ఈ యాప్స్‌నకు సిమ్ కార్డు బైండింగ్‌ను తప్పనిసరి చేస్తూ టెలికాం విభాగం (డాట్) ఆదేశాలు జారీ చేసింది. ఫోన్‌లో సిమ్‌కార్డు లేకపోయినా లేదా సిమ్ తొలగించినా యాప్ సేవలు



ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి. ఆయా యాప్‌లను వెబ్‌బ్రౌజర్‌లో ఉపయోగిస్తే ప్రతి 6 గంటలకు ఒకసారి లాగౌట్ అవుతుంది. మళ్లీ సేవలు పొందాలంటే క్యూఆర్ కోడ్ ద్వారా మొబైల్ సిమ్‌తో లాగిన్ అవ్వాలి. ప్రస్తుతం యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే సిమ్‌కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఆ తర్వాత డివైజ్ నుంచి సిమ్‌కార్డును తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్స్‌ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది. సిమ్ బైండింగ్ నిబంధన వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**వాట్సప్ టెస్టింగ్**

కేంద్రం తీసుకొచ్చిన సిమ్ బైండింగ్ రూల్స్ అమలుకు వాట్సప్ సిద్ధమవుతోంది. సిమ్ కార్డు లేని సందర్భాల్లో యాప్ పనిచేయకుండా నిరోధించేందుకు బీటా టెస్టింగ్ నిర్వహిస్తోంది. దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను వాబీటా ఇన్ఫో పంచుకుంది. మరోవైపు సిమ్ బైండింగ్ రూల్స్ అమలు సంబంధించిన గడువును పొడిగించేది లేదని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఇప్పటికే స్పష్టంచేశారు. దీంతో మార్చి 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి.

## స్మార్ట్‌ఫోన్ కాలుతోంది: ధరలు పెంచేస్తున్న కంపెనీలు!

స్మార్ట్‌ఫోన్ ధరల పెంపు.. గత కొన్ని నెలలుగా వినిపిస్తున్న మాటే. మెమొరీ చిప్‌ల కొరత వల్ల స్మార్ట్‌ఫోన్ ధరలు పెరగనున్నాయన్న అంచనాలు వెలువడ్డాయి. కంపెనీలూ సంకేతాలు ఇచ్చాయి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలు ఒక్కొక్కటిగా ఆచరణలోకి తెస్తున్నాయి. కొత్తగా లాంచ్ చేస్తున్న స్మార్ట్‌ఫోన్లతో పాటు ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న మోడళ్ల ధరలూ పెంచేస్తున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన స్మార్ట్‌ఫోన్ దిగ్గజం శాంసంగ్.. ఇటీవల ధరల పెంపు చేపట్టగా.. చైనాకు చెందిన వివో, ఐకూ బ్రాండ్లు ధరల పెంపునకు సిద్ధమవుతున్నాయి. చైనాకు చెందిన వివో, దాని అనుబంధ ఐకూ స్మార్ట్‌ఫోన్ ధరల పెంపును ప్రకటించాయి. వివో టీ4, ఐకూ జడ్10 సిరీస్ ఫోన్లపై గరిష్ఠంగా రూ.2,500 వరకు పెంచుతున్నాయి. మార్చి 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. వివో టీ4X, వివో టీ4R, వివో టీ4 మోడళ్లపై కనిష్ఠంగా రూ.1,500, గరిష్ఠంగా రూ.2,500 పెంచుతున్నట్లు వివో పేర్కొంది. ఇక ఐకూ జడ్10X, ఐకూ జడ్10R, ఐకూ జడ్10 మోడళ్ల ధరలూ అదే స్థాయిలో పెంచుతున్నట్లు ఐకూ పేర్కొంది. శాంసంగ్ పెంచేసింది: శాంసంగ్ తన ఏ, ఎఫ్ సిరీస్ మోడళ్ల ధరలను తాజాగా సవరించింది. బడ్జెట్, మిడ్ రేంజ్ సెగ్మెంట్‌కు చెందిన ఎఫ్ 17, ఏ36, ఏ56 ఈ జాబితాలో ఉన్నాయి. ఈ ఫోన్ల ధరలను కనిష్ఠంగా రూ.1,000 నుంచి గరిష్ఠంగా రూ.2,000 వరకు పెంచింది. పెరిగిన ధరలు ఫిబ్రవరి 25 నుంచే అమల్లోకి వచ్చాయి. రిటైల్, ఆన్‌లైన్ స్టోర్లలో పెరిగిన ధరలే దర్శనమిస్తున్నాయి. ఎస్ 26 ధరా ఎక్కువే: శాంసంగ్ తాజాగా లాంచ్ చేసిన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ ఎస్26 సిరీస్ ధరలను కూడా భారీగా పెంచేసింది. ఎస్26 ధర రూ.87,999 నుంచి; ఎస్26+ ధర రూ.1,19,999;



అల్ట్రా ధర రూ.1,39,999 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఎస్25 లైనప్‌తో పోల్చినప్పుడు ఎస్ 26 ధర ఏకంగా రూ.13 వేలు ఎక్కువ కాగా.. ఎస్26 ప్లస్ ధర ఏకంగా రూ.20 వేలు ఎక్కువ ధరకు తీసుకొచ్చింది. ఎస్26 అల్ట్రా ధర కూడా గత స్మార్ట్‌ఫోన్‌తో పోలిస్తే రూ.10వేలు అధికం.


**ఎందుకీ పెరుగుదల?**

స్మార్ట్‌ఫోన్ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం మెమొరీ చిప్‌ల కొరత. ఏఐ డేటా సెంటర్ల నుంచి విపరీతమైన డిమాండ్ కారణంగా అంతర్జాతీయంగా మెమొరీ చిప్‌ల కొరత ఏర్పడింది. దీంతో మొబైల్ తయారీ ఖర్చు పెరుగుతోంది. దీనికితోడు స్మార్ట్‌ఫోన్లలో ఏఐ సాంకేతికతను జోడిస్తుండడంతో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ ధరలకు రెక్కలు వస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్‌లలో వినియోగించే ప్రాసెసర్‌ల ధరలను ఆయా కంపెనీలు పెంచుతుండడం వల్ల మొబైల్ తయారీ కంపెనీలు కూడా ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదలాయిస్తున్నాయి.

## సెమీస్ బెర్తు రేసు.. న్యూజిలాండ్, పాకిస్థాన్ అవకాశాలు ఇలా!

టీ20 ప్రపంచ కప్ సూపర్ 8 గ్రూప్ 2 నుంచి ఇంగ్లాండ్ అగ్రస్థానంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. ఇక రెండో బెర్తు కోసం న్యూజిలాండ్, పాకిస్థాన్ రేసులో నిలిచాయి. మరి ఈ రెండు జట్లలో సెమీస్ అవకాశాలు ఎవరికి ఎలా ఉన్నాయంటే?

* మూడు మ్యాచుల్లో విజయం సాధించిన ఇంగ్లాండ్ 6 పాయింట్లతో టాప్ ప్లేస్ సాధించింది. ఇప్పటికే సెమీస్‌కు దూసుకెళ్లింది.
* న్యూజిలాండ్ 3 మ్యాచుల్లో ఒక విజయం, ఒక ఓటమి, ఒక మ్యాచ్ రద్దుతో 3 పాయింట్లతో ప్రస్తుతం రెండో స్థానంలో ఉంది. కివీస్ నెట్ రన్‌రేట్ +1.390.
* పాకిస్థాన్ 2 మ్యాచుల్లో ఒక ఓటమి, ఒక మ్యాచ్ రద్దుతో కేవలం ఒక్క పాయింట్‌తో కొనసాగుతోంది.




ప్రస్తుతం పాక్ నెట్ రన్‌రేట్ 0.461. ఇక శ్రీలంక ఇప్పటికే ఎలిమినేట్ అయిన సంగతి తెలిసిందే.

* గ్రూప్ 2లో ఒకే ఒక్క మ్యాచ్ పెండింగ్‌లో ఉంది. శనివారం పల్లెకెలె వేదికగా శ్రీలంక పాకిస్థాన్ మ్యాచ్ జరగనుంది.
* శ్రీలంక చేతిలో పాక్ ఓడిపోతే.. పాయింట్స్ పరంగా న్యూజిలాండ్ ఎలాంటి ఇబ్బంది లేకుండా సెమీస్‌కు దూసుకుపోతుంది.
* శ్రీలంకపై పాక్ గెలిచినా.. సెమీస్‌కు చేరుకోవాలంటే మాత్రం నెట్ రన్‌రేట్ మెరుగ్గా ఉండాలి. అంటే తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు లంకపై కనీసం 64 పరుగుల తేడాతో పాక్ విజయం సాధించాలి. ఛేజింగ్‌కు దిగితే 13.1 ఓవర్లలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది.
* అప్పుడే న్యూజిలాండ్ నెట్ రన్‌రేట్‌ను అధిగమించి పాక్ ముందుకెళ్తుంది. సెమీస్‌కు చేరుకొనేందుకు అవకాశం ఉంటుంది.
* ఒకవేళ శ్రీలంక పాకిస్థాన్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దైతే మాత్రం న్యూజిలాండ్‌కే బెనిఫిట్. అప్పుడు పాక్ ఖాతాలో 2 పాయింట్లే ఉంటాయి. దీంతో 3 పాయింట్లతో ఉన్న కివీస్ సెమీస్‌కు చేరుకుంటుంది.
* సెమీస్‌కు న్యూజిలాండ్ వెళ్తే.. కోల్‌కతా వేదికగా ఫస్ట్ సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. పాక్ వెళ్తే కొలంబో వేదిక అయ్యే అవకాశం ఉంది.







## న్యూజిలాండ్‌పై విజయం.. ఇంగ్లాండ్‌దే అగ్రస్థానం

కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో కివీస్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ 19.3 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 161 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' విల్ జాక్స్ (32*), రెహాన్ అహ్మద్ (19*) ఏడో వికెట్‌కు 16 బంతుల్లోనే 44 పరుగులు జోడించి తమ జట్టును గెలిపించారు. టామ్ బాంటన్ (33), హ్యారీ బ్రూక్ (26), సామ్ కరన్ (24), జాకబ్ బెతెల్ (21) ఫర్వాలేదనిపించారు. కివీస్ బౌలర్లలో రచిన్ రవీంద్ర 3.. మాట్ హెన్రీ, ఫెర్గూసన్, గ్లెన్ ఫిలిప్స్ తలో వికెట్ పడగొట్టారు. ఇప్పుడీ విజయంతో ఇంగ్లాండ్ గ్రూప్ 2లో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. రెండో సెమీస్ బెర్తు కోసం న్యూజిలాండ్‌తో పాకిస్థాన్ రేసులో నిలిచింది. ఫిబ్రవరి 28న జరగనున్న తన చివరి మ్యాచ్‌లో శ్రీలంకపై పాక్ మంచి నెట్ రన్‌రేట్‌తో విజయం సాధించాల్సి ఉంది. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దైతే పాక్ ఇంటిముఖం పడుతుంది. అప్పుడు న్యూజిలాండ్ సెమీస్‌కు వెళ్లిపోతుంది.

## ఆలస్యంగా ఐపీఎల్ 2026 ప్రారంభం.. ఎప్పుడంటే?

ఐపీఎల్ 2026 సీజన్ షెడ్యూల్ మారుతోంది. తొలుత ప్రకటించినట్లుగా మార్చి 26న కాకుండా.. రెండు రోజుల తర్వాత 19వ సీజన్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. అంటే మార్చి 28న మొదలై ఫైనల్ మే 31న జరుగుతుంది. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్లకు, ఫ్రాంఛైజీలకు కాస్త సమయం ఇచ్చేందుకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీనిపై ఐపీఎల్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రాబోయే వారంలో బీసీసీఐ నుంచి ప్రకటన ఉండొచ్చని క్రికెట్ వర్గాలు తెలిపాయి. పూర్తిస్థాయి షెడ్యూల్, వేదికలను కూడా అప్పుడే వెల్లడించే అవకాశం ఉంది.

**ఆలస్యం అందుకేనా?**

సాధారణంగా నెల రోజుల ముందే




ఐపీఎల్ సీజన్ షెడ్యూల్‌ను కమిటీ ప్రకటిస్తూ ఉంటుంది. కానీ, ఈసారి కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దానికి కారణం ఎన్నికలు. అసోం, పశ్చిమ్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలకు సంబంధించి ఎన్నికల తేదీలపై స్పష్టత రాలేదు. దీంతో బీసీసీఐ కూడా వేచి చూస్తోంది. ఆయా వేదికల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ టీమ్‌లు ఉండగా.. రాజస్థాన్ రాయల్స్‌కు గువాహటి రెండో హోంగ్రౌండ్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఎన్నికలు, మ్యాచ్‌ల తేదీలు క్లాష్ కాకుండా.. ఉండేందుకే ఆలస్యమవుతోందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అవసరమైతే రెండు దశల్లో షెడ్యూల్‌ను రిలీజ్ చేసే అవకాశం లేకపోలేదు.

**కొత్త జెర్సీతో లఖ్‌నవూ**

గత సీజన్‌లో దారుణమైన ప్రదర్శనతో నిరాశపరిచిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తన అదృష్టాన్ని మార్చుకొనేందుకు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా కొత్త జెర్సీతో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కెప్టెన్ రిషభ్ పంత్, మార్క్రమ్ ఈ జెర్సీలను ధరించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## దూబె బౌలింగ్.. మరీ ఇంత దారుణంగానా?

చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా టీ20 వరల్డ్‌కప్ లో జింబాబ్వేతో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో టీమ్ఇండియా 72 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ 256 పరుగుల భారీ స్కోర్ చేసినా.. జింబాబ్వే గట్టిగానే పోరాడింది. ఈ మ్యాచ్‌లో రెండు ఓవర్లు బౌలింగ్ చేసిన శివమ్ దూబె 23 ఎకానమీతో ఏకంగా 46 పరుగులిచ్చాడు. తన బౌలింగ్‌లో రెండు నోబాల్స్, 4 వైడ్స్ వేశాడు. ఓ బంతినైతే మ్యాచ్ జరుగుతున్న పిచ్ మీద కాకుండా.. పక్కనున్న పిచ్ పైకి అన్నట్లు వేశాడు. దీంతో బ్యాటర్‌తోపాటు, కామెంటేటర్లు కూడా ఆశ్చర్యపోయారు.

**12 కాదు 18!**

దూబె వేసింది రెండు ఓవర్లే అయినా.. ఎక్స్‌ట్రాలు కలిపితే మొత్తం 18 బంతులేశాడు. అంటే మూడు ఓవర్లతో సమానం. మొదటి ఓవర్‌లో 10, రెండో ఓవర్లో 8 బంతులు సంధించాడు. మొదటి ఓవర్లో 26 పరుగులిచ్చిన తర్వాత కూడా కెప్టెన్ సూర్య.. దూబె మీద నమ్మకంతో రెండో ఓవర్ ఇచ్చాడు. అయినా ఆ ఓవర్‌లోనూ భారీగా పరుగులిచ్చాడు.

**వైవిధ్యమూ లేదు!**

శివమ్ దూబె మరీ వేగంగా బంతులేయలేదు! కనీసం బంతుల్లో వైవిధ్యమూ చూపలేకపోయాడు. ప్రతిసారీ ఆఫ్ వికెట్‌కు దూరంగా వేసే ప్రయత్నం చేశాడు. అవి చాలా వరకు వైడ్‌గా వెళ్లాయి. బ్యాటర్లు తనను రీడ్ చేసి ఆఫ్‌సైడ్ వైపు వచ్చి బౌండరీలు బాదుతున్నా.. లైన్ ఛేంజ్ చేయలేదు. ఆఖర్లో ఏదో ఒక వికెట్ దొరికింది కానీ.. అంతర్జాతీయ స్థాయి బౌలింగ్ అయితే వేయలేదు! అలాగే ఫీల్డింగ్‌లోనూ నిర్లిప్తంగా కనిపించాడు.

## రింకు సింగ్ రిటర్న్స్... శనివారం జట్టుతో కలుస్తాడు: బీసీసీఐ

టీమ్ఇండియా క్రికెటర్ రింకు సింగ్ తండ్రి ఖాన్‌చంద్ సింగ్ కన్నుమూసిన సంగతి తెలిసిందే. అనారోగ్యంతో ఇవాళ ఉదయం ప్రాణాలు విడిచారు. దీంతో వెంటనే స్వగ్రామానికి వెళ్లిన రింకు సింగ్ తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అయితే, శనివారమే టీమ్ఇండియా శిబిరానికి రింకు సింగ్ వస్తాడని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. మార్చి 1న వెస్టిండీస్‌తో ఈడెన్ గార్డెన్స్ వేదికగా భారత్ తన చివరి సూపర్ 8 మ్యాచ్‌లో తలపడనుంది. ఇందులో విజయం సాధించే జట్టు సెమీస్‌కు వెళ్తుంది.

**అప్పుడే విషమంగా ఉన్నా..**

ఇటీవలే ఖాన్‌చంద్ ఆరోగ్యం విషమించడంతో నొయిడాలోని ఓ ఆసుపత్రిలో చేరారు. దీంతో జింబాబ్వేతో మ్యాచ్‌కు ముందు కూడా రింకుసింగ్ జట్టును వీడాడు. తర్వాత మళ్లీ అతడు టీమ్‌తో




కలిశాడు. తుది జట్టులో అతడికి చోటు కల్పించలేదు. రింకుసింగ్ క్రికెటర్‌గా ఎదగడంలో తన తండ్రి పాత్ర చాలా కీలకమైందని పలు సందర్భాల్లో రింకు సింగ్ వెల్లడించాడు. ఉత్తరప్రదేశ్‌లోని అలీఘడ్‌లో ఎల్‌పీజీ గ్యాస్ డెలివరీ విభాగంలో పనిచేసేవారు.

# సీఎం సీటు కోల్పోయి.. పార్టీ మారినా 'పీఠం' దక్కలేదు!



ఫిబ్రవరి 27 (భారత శక్తి) : దేశంలో వివిధ రాష్ట్రాల్లో పలువురు నేతలు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించి పాలించారు. ఆ తర్వాత పలు కారణాలతో సొంత పార్టీని వీడి ఇతర పార్టీల్లో చేరారు. అయితే, పార్టీ మారిన తర్వాత అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఒక్కరే తిరిగి సీఎం పీఠాన్ని దక్కించుకోగలిగారు. అనేక మంది నేతలు కేంద్రమంత్రులు, ఎంపీల స్థాయిలోనే మిగిలారు తప్ప మళ్లీ అత్యున్నత పదవిని అందుకోలేకపోయారు. ఇలా ఇప్పటివరకు దాదాపు 20 మందికి పైగా మాజీ సీఎంలు పార్టీలు మారగా.. ఆ జాబితాలో తాజాగా తమిళనాడు మాజీ సీఎం ఓ.పన్నీర్ సెల్వం(OPS) చేరారు. మరికొంత మంది వివరాలను ఓసారి పరిశీలిస్తే..

* గోవాలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అత్యున్నత పదవి కోల్పోయిన తర్వాత పార్టీ మారారు. మాజీ సీఎం దిగంబర్ కామత్, రవి నాయక్‌లు కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరగా.. లుజినో ఫలైరో, చర్చిల్ అలెమావోలు కాంగ్రెస్ నుంచి తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు.
* కర్ణాటక మాజీ సీఎం జగదీశ్ షెట్టర్ భాజపాను వీడిన 2023లో కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల ముందు తిరిగా సొంతగూటికి వచ్చిన ఆయన ప్రస్తుతం ఎంపీగా ఉన్నారు. కెరీర్ చివరి దశలో పార్టీ మారిన వారిలో కర్ణాటక మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ ఉన్నారు. 2017లో కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరిన ఆయన 2024లో కన్నుమూశారు.
* మహారాష్ట్ర మాజీ సీఎం నారాయణ్ రాణె శివసేన నుంచి భాజపాకు వచ్చారు. ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్నారు. కాంగ్రెస్ నుంచి భాజపాలోకి వచ్చిన మాజీ సీఎం అశోక్ చవాన్.. రాజ్యసభ ఎంపీగా కొనసాగుతున్నారు.
* ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లకు సీఎంగా పనిచేసిన వ్యక్తిగా పేరు సంపాదించిన ఎన్‌డీ తివారీ.. 2018లో కాంగ్రెస్‌ను వీడారు. 93వ జన్మదినం చేసుకున్న అదే ఏడాది చనిపోయారు.
* బిహార్ ముఖ్యమంత్రిగా పది నెలలపాటు సేవలందించిన హెచ్‌ఏఎం నేత జితన్ రాం మాంఝీ.. 2015లో జేడీయూ బహిష్కరణకు గురై హిందుస్థానీ అవామ్ మోర్చా పార్టీని స్థాపించారు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా ఉన్నారు.
* జమ్మూకశ్మీర్ మాజీ సీఎం గులాం నబీ ఆజాద్.. కాంగ్రెస్ హయాంలో సుదీర్ఘకాలం పార్టీలో, కేంద్ర ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేశారు. పార్టీ అధిష్ఠానంపై గళం విప్పిన ఆయన.. చివరకు పార్టీ వీడి సొంత పార్టీ పెట్టుకున్నారు.
* పంజాబ్ మాజీ సీఎం అమరీందర్ సింగ్.. కాంగ్రెస్‌ను వీడి 2022లో భాజపాలో చేరారు. పంజాబ్ లోక్ కాంగ్రెస్ పేరుతో పార్టీ పెట్టినప్పటికీ దాన్ని భాజపాలో విలీనం చేశారు.
* ఝార్ఖండ్ మాజీ సీఎం చంపాయి సోరెన్ జేఎంఎం నుంచి భాజపాలోకి రాగా.. బాబూలాల్ మరాండీ భాజపాను వీడి 2026లో జేవీఎంను స్థాపించారు. అనంతరం కాషాయపార్టీలో విలీనం చేశారు.
* ఉత్తరాఖండ్ మాజీ సీఎం విజయ్ బహుగుణ ఓటమి తర్వాత కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరారు. ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గమాంగ్ కాంగ్రెస్ నుంచి భాజపాలోకి, ఆ తర్వాత 2023లో బీఆర్‌ఎస్‌లో చేరారు. మేఘాలయ మాజీ సీఎం ముకుల్ సంగ్మా కాంగ్రెస్‌ను వీడి టీఎంసీలో చేరారు.
* ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్‌ను వీడి రాష్ట్రవిభజన అనంతరం భాజపాలో చేరారు. ఛత్తీస్‌గఢ్ తొలి ముఖ్యమంత్రి అజిత్ జోగి.. కాంగ్రెస్‌ను వీడి కొత్త పార్టీ స్థాపించారు.
* దివంగత నేత జయలలితకు అత్యంత విశ్వాసనీయుడిగా పేరొందిన ఓ పన్నీర్‌సెల్వం తమిళనాడు సీఎంగా పనిచేశారు. అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన ఆయన తాజాగా డీఎంకేలో చేరిపోయారు.

# భాజపాకు 10 సీట్లు వస్తే రాజకీయాల నుంచి వైదొలుగుతా కేజ్రీవాల్

ఫిబ్రవరి 27 (భారత శక్తి) : మద్యం విధానంపై ఓ తప్పుడు కేసు నమోదు చేసి ఆమ్‌ఆద్మీ పార్టీని అంతం చేయాలని ప్రధాని మోదీ, అమిత్ షాలు కుట్ర పన్నారని దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. సీబీఐ నమోదు చేసిన కేసులో క్లీన్‌చిట్ ఇస్తూ న్యాయస్థానం చారిత్రక తీర్పు ఇచ్చిందన్నారు. మనీశ్ సిసోదియా, పలువురు పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ వ్యవహారంలో ఈడీ నమోదు చేసిన కేసులనూ డిశ్చార్జి చేయాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంతో దిల్లీ మొత్తం నాశనమైందని ఈ సందర్భంగా కేజ్రీవాల్ విమర్శించారు. అధికారం కోసం ప్రధాని మోదీ, అమిత్ షాలు కుట్ర పన్నారని, ఆ పర్యవసానాలను దిల్లీ ప్రజలు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ధైర్యముంటే దేశ రాజధానిలో మళ్లీ ఎన్నికలు పెట్టాలని, భాజపాకు పది స్థానాలకన్నా ఎక్కువ వస్తే తాను రాజకీయాల నుంచి




వైదొలుగుతానని ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్ విసిరారు.

**హైకోర్టులో సీబీఐ సవాల్..**

మద్యం కేసులో కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా సహా 23 మందికి క్లీన్‌చిట్ ఇస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సీబీఐ సవాల్ చేసింది. దిల్లీ హైకోర్టులో అప్పీలు చేసింది. దర్యాప్తులో సీబీఐ గుర్తించిన అనేక అంశాలను ప్రత్యేక న్యాయస్థానం విస్మరించిందని కేంద్ర దర్యాప్తు సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది.

# కేజ్రీవాల్‌కు ఇదే నా సలహా..! అన్నాహజారే

ఫిబ్రవరి 27 (భారత శక్తి) : దిల్లీ మద్యం విధానం కేసులో మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు న్యాయస్థానం క్లీన్ చిట్ ఇవ్వడాన్ని ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే స్వాగతించారు. న్యాయవ్యవస్థే అత్యున్నతమైందని, కోర్టు తీర్పును అంగీకరించాలన్నారు. సొంతగా లేదా పార్టీ గురించి ఆలోచించకుండా.. సమాజం, దేశం కోసం పనిచేయాలని ఈ సందర్భంగా కేజ్రీవాల్‌కు సలహా ఇచ్చారు. గతంలో



కేజ్రీవాల్‌పై చేసిన విమర్శల గురించి ప్రస్తావిస్తూ.. తాను వ్యాఖ్యలు చేసినప్పుడు న్యాయస్థానం ఎటువంటి తీర్పు చెప్పలేదన్నారు. ఇంత పెద్ద దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు, కులాలు, మతాలు ఉన్నప్పటికీ.. న్యాయవ్యవస్థ వల్లే దేశం సరైన మార్గంలో నడుస్తోందన్నారు. మహారాష్ట్రలోని తన స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో మాట్లాడిన ఆయన.. బలమైన న్యాయవ్యవస్థ లేకుంటే నేరస్థులదే పైచేయి అయ్యేదని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ ఎటువంటి తప్పు చేయలేదని న్యాయస్థానం పేర్కొందని, ఆ తీర్పును మనం గౌరవించాల్సిందేనని అన్నా హజారే అన్నారు. కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా తన కార్యకర్తలేనని చెప్పారు.




# జమాల్‌పుర్ రోటీ మార్కెట్.. రుమాలికి స్పెషల్

అహ్మదాబాద్, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : గుజరాత్ అహ్మదాబాద్‌లోని జమాల్‌పుర్ ప్రాంతం ఓ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. ఎన్నో ఏళ్లుగా రోటీ తయారీపై ఆధారపడిన అనేక కుటుంబాలు నిత్యం వేలాది కిలోల పిండి పదార్థాలు తయారు చేస్తున్నారు. వివిధ రకాల రుమాలి రోటీలను అందిస్తుండడంతో ఇతర జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో వీటిని ఖరీదు చేసి తీసుకెళ్తుంటారు. ఈ మార్కెట్‌లో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు రోటీలు తయారవుతూనే ఉంటాయి. ఇక్కడ దాదాపు 200 మంది పనిచేస్తున్నామని.. నిత్యం వేలాది కిలోల రోటీలను తయారు చేస్తామని దుకాణదారులు చెబుతున్నారు. వివాహాది శుభకార్యాలతోపాటు రోల్స్, నూడుల్స్, క్రిస్పీల తయారీ కోసం భారీ ఆర్డర్లు వస్తుంటాయి. కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తుంటారు. సాధారణ, స్పెషల్, కేసరియా వెరైటీలు అందుబాటులో ఉండగా.. రంజాన్ వంటి బిజీ రోజుల్లో వీటికోసం వినియోగదారులు బారులు తీరడం గమనార్హం.

# జీవిత ఖైదు విధించిన జడ్జికి బెదిరింపులు

ఫిబ్రవరి 27 (భారత శక్తి) : ఓ కేసులో జీవితఖైదు విధించినందుకు న్యాయమూర్తిపై ఇద్దరు ఖైదీలు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్ (UP)లోని బిజ్‌నోర్‌లో చోటుచేసుకుంది. 2024లో ఓ వ్యక్తిని కారుతో ఢీకొట్టి హత్య చేసిన కేసుపై బిజ్‌నోర్ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జస్టిస్ నిజేంద్రకుమార్ గురువారం విచారణ జరిపారు. ఇందులో నిందితులుగా తేలిన జైదీప్, పింటు చౌహాన్ అనే ఇద్దరు వ్యక్తులకు జీవిత ఖైదు విధిస్తున్నట్లు తీర్పు వెలువరించారు. న్యాయమూర్తి ఈ ప్రకటన చేయగానే నిందితులు ఆగ్రహంతో ఊగిపోతూ.. ఆయనపై బెదిరింపులకు దిగారు. మీ ఇల్లు ఎక్కడో తెలుసని..



విడిచిపెట్టేది లేదని అన్నారు. దీంతో జడ్జికి రక్షణ పెంచినట్లు పోలీసులు తెలిపారు.

# కోల్‌కతాలో భూకంపం.. పరుగులు తీసిన ప్రజలు

కోల్ కతా, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో భూకంపం సంభవించింది. శుక్రవారం మధ్యాహ్నం కోల్‌కతాలో ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. శుక్రవారం ఉదయం బంగ్లాదేశ్‌లో 5.4 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీని ప్రభావంతో కోల్‌కతా, పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో కార్యాలయాలు, భవనాల నుంచి ప్రజలు బయటకు పరుగులు తీశారు. ప్రాథమిక నివేదికల ప్రకారం.. కోల్‌కతాలో కొన్ని సెకన్ల పాటు ప్రకంపనలు వచ్చాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5గా నమోదయ్యింది. భూకంప కేంద్రం నగరం నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.



# కౌంటింగ్ అయిన వారం వరకు ఈవీఎంవీవీప్యాట్ వెరిఫై: సీఈసీ

ఫిబ్రవరి 27 (భారత శక్తి) : ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా అభ్యర్థులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేసేలా ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. కౌటింగ్ పూర్తయిన ఏడు రోజుల వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో వీవీప్యాట్ల స్లిప్పులను వెరిఫై చేసుకోవడానికి అభ్యర్థులకు అనుమతి ఇచ్చింది. అయితే అందుకు కొంత మొత్తం చెల్లించాలని చెన్నైలో జరిగిన కార్యక్రమంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై



ఈసీ సమీక్ష జరిపింది. "తమిళనాడులోని 75,000 పోలింగ్ స్టేషన్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ఇక్కడ నిర్వహించిన సర్ ప్రక్రియ దేశానికి ఒక మోడల్‌గా నిలిచింది. ఈవీఎం రౌండ్ల కంటే ముందు పోస్టల్ బ్యాలెట్లను రెండు రౌండ్లు కౌంట్ చేసేలా నిర్ణయం తీసుకున్నాం" అని జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. అలాగే తమిళనాడులో అన్ని పార్టీలు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని కోరాయని పేర్కొన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

# దిల్లీ మద్యం కేసు.. కేజ్రీవాల్, కవితకు భారీ ఊరట

ఫిబ్రవరి 27 (భారత శక్తి) : మద్యం కుంభకోణం కేసులో దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవితకు భారీ ఊరట లభించింది. మద్యం పాలసీ కేసుపై తాజాగా విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులందరి పైన నమోదు చేసిన కేసులు కొట్టివేసింది. వారందరి పేర్లను డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించింది. సరైన ఆధారాలు లేకుండానే వీరి పేర్లు కేసులో చేర్చారని సీబీఐపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ కేసులో పూర్తిగా లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని కోర్టు సీబీఐపై మండిపడింది. ఈ విషయంలో సీబీఐ అధికారుల పైనే దర్యాప్తు జరగాలని కోర్టు పేర్కొంది. కవిత ఆడిటర్ బుచ్చిబాబు సహా అభియోగాలు మోపిన 23 మందికి ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు తెలిపింది. వారిపై ఉన్న అభియోగాలను



నిరూపించడంలో సీబీఐ విఫలమైందని వ్యాఖ్యానించింది. ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం ఊహాగానాల ఆధారంగా ఈ కేసులో కుట్ర జరిగిందని సీబీఐ అధికారులు ఆరోపించారని న్యాయస్థానం పేర్కొంది. కానీ దానిని నిరూపించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎక్సైజ్ పాలసీపై ముగ్గురు న్యాయ నిపుణుల అభిప్రాయాలు తమ కేసుకు మద్దతు ఇస్తున్నాయని గతంలో సీబీఐ చేసిన ప్రకటనపై స్పష్టత ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఈ కోర్టు తీర్పును సవాలుచేస్తూ సీబీఐ అధికారులు దిల్లీ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది.


**కేసు ఏమిటంటే?**

దిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని వెనక్కి తీసుకుంది. ఈ మధ్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని.. ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు వీరు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి, ప్రతిఫలంగా కొంత మొత్తాన్ని పొందినట్లు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ కుంభకోణంలో భాగంగా దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, ఇతర ఆప్ నేతలు, మాజీ ఎంపీ కవితలను అధికారులు అరెస్టు చేశారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.

## అనూహ్యంగా భారత్‌కు అమెరికా మంత్రి..

# ట్రేడ్ డీల్‌లో మార్పుల కోసమేనా..?

ఫిబ్రవరి 27 (భారత శక్తి) : భారత్ అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైన సంగతి తెలిసిందే. ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు నేపథ్యంలో.. ఇరుదేశాల మధ్య జరగాల్సిన వాణిజ్య చర్చలు వాయిదా పడినట్లు ఇటీవల భారత విదేశాంగశాఖ వర్గాలు వెల్లడించాయి. కాగా గురువారం అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ భారత్‌ను సందర్శించారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య, టారిఫ్‌లపై ఆయన కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో చర్చలు జరిపారు. ఎటువంటి అధికారిక ప్రకటన లేకుండా అమెరికా మంత్రి అనూహ్యంగా భారత్‌ను సందర్శించడంతో ట్రేడ్ డీల్‌లో మార్పులు జరిగే అవకాశం ఉండొచ్చని



అధికారిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. అమెరికా భారత్ మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాన్ని మరింతగా పెంచుకునే మార్గాలపై చర్చలు జరిపినట్లు అమెరికా వాణిజ్యశాఖ వెల్లడించింది. పీయూష్ గోయల్‌తో జరిపిన ఈ సమావేశాన్ని అత్యంత ఉత్పాదకమైన చర్చలుగా అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. భారత్‌అమెరికా బంధాన్ని విస్తరించేందుకు ఫలవంతమైన చర్చలు జరిపినట్లు కేంద్ర వాణిజ్యమంత్రి పీయూష్ తెలిపారు. 'అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం' (ఐఈఈపీఏ)ను ఉపయోగించి ప్రపంచ దేశాలపై ట్రంప్ ఏకపక్షంగా టారిఫ్‌లు విధించడాన్ని అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు నేపథ్యంలో భారత్ చేసుకొన్న ట్రేడ్ డీల్‌లో మార్పులు జరగనున్నాయి. వాస్తవానికి ట్రంప్ అధికారంలోకి రాగానే అన్ని దేశాలతో పాటు భారత్ పైనా 25శాతం సుంకాలు విధించారు. ఆ తర్వాత రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో మరో 25శాతం అదనపు టారిఫ్‌లు వేశారు. దీంతో మన దేశంపై మొత్తం టారిఫ్‌లు 50శాతానికి పెరిగాయి. ఈ క్రమంలోనే ఇరుదేశాల మధ్య సుదీర్ఘంగా వాణిజ్య చర్చలు జరిగాయి. ఇటీవలే మధ్యంతర వాణిజ్య ఒప్పందాని కి ఫ్రేమ్‌వర్క్ రూపొందించేందుకు రెండు దేశాలు అంగీకారానికి వచ్చాయి. దీంతో భారత్‌పై సుంకాలు 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయి. ఇప్పుడు సుప్రీం తీర్పుతో ఆ సుంకాలు రద్దు కానున్నాయి. దాని స్థానంలో ట్రంప్ విధించిన తాజా 10శాతం టారిఫ్‌లు కొన్ని రోజుల పాటు అమల్లో ఉండనున్నాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా వాణిజ్య మంత్రి భారత్‌లో పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# డీఎంకేలో చేరిన పన్నీర్ సెల్వం..

ఫిబ్రవరి 27 (భారత శక్తి) : అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే బహిష్కృత నేత పన్నీర్ సెల్వం. అధికారిక డీఎంకే పార్టీలో చేరారు. సీఎం స్టాలిన్ సెల్వంకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శుక్రవారం చెన్నైలోని పార్టీ కార్యాలయంలో.. స్టాలిన్ సమక్షంలో సెల్వం, ఆయన కుమారుడు, మాజీ ఎంపీ రవీంద్రనాథ్‌తో పాటు ఎమ్మెల్యే అయ్యప్పన్ తదితరులు కూడా డీఎంకే కండువా కప్పుకొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓపీఎస్ తన సొంత నియోజకవర్గమైన తేనిలోని బోడి మెట్టు నుంచి డీఎంకే తరఫున పోటీ చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సెల్వం చేరిక డీఎంకేకు ఉపయోగపడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దివంగత మాజీ సీఎం జయలలితకు విధేయుడైన పన్నీర్ సెల్వం.. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామితో రాజకీయ విరోధం నేపథ్యంలో.. సెల్వం, ఆయన అనుచరులు 2022లో పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఆ తర్వాత ఎన్డీయేతో కూడా సంబంధాలు తెంచుకున్న ఆయన.. తాజాగా డీఎంకేతో చేతులు కలిపారు.

# ఈ ఏడాది చివరికి 10 లక్షల పైగా గృహ ప్రవేశాలు జరిపిస్తాం

రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నేడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గృహ నిర్మాణం, వ్యవసాయ శాఖల పద్దులపై జరిగిన చర్చలో సీఎం ప్రసంగించారు. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 10 లక్షలకు పైగా ఇళ్లకు గృహ ప్రవేశాలు జరిపిస్తామని ఆయన సభలో ప్రకటించారు. ఇప్పటికీ ఇళ్లు లేని నిరుపేదలు ఎవరైనా ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**2029 నాటికి అందరికీ ఇళ్లు**

రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే తమ ధ్యేయమని సీఎం తెలిపారు. రాయచోటి నుంచి ఇప్పటికే 3 లక్షల ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించామని, ఈ ఏడాది ఉగాది నాటికి దాదాపు 3 లక్షల ఇళ్లలో లబ్ధిదారులు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జూన్ నాటికి మరో 2.26 లక్షలు, సెప్టెంబర్ నాటికి ఇంకో 2.10 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు పూర్తి చేస్తామని స్పష్టమైన ప్రణాళికను వివరించారు. 2029 నాటికి రాష్ట్రంలోని పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించడంతో పాటు, అర్హులైన వారికి ఉచితంగా ఇంటి స్థలాలు కూడా పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల చొప్పున స్థలాన్ని కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2.20 లక్షల కుటుంబాలకు సొంత జాగా లేదని గుర్తించామన్నారు.

**అక్రమార్కులపై ఉక్కుపాదం**

గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ రంగం, ఇసుక విధానాల్లో జరిగిన అవినీతిపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేదల ఇళ్ల పేరుతో గత పాలకులు భారీగా అక్రమాలకు పాల్పడ్డారని, ఇసుక విధానాన్ని అస్తవ్యస్తం చేసి దోచుకున్నారని ఆరోపించారు. ఈ కుంభకోణాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తాయని తెలిపారు.

**వ్యవసాయానికి 'పంచ సూత్రాల' ఊతం**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం 'పంచ సూత్రాల' విధానాన్ని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. అగ్రిటెక్, నీటి భద్రత, డిమాండ్ ఉన్న పంటల సాగు, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా రైతులను ఆదుకుంటామని చెప్పారు. వ్యవసాయంలో యాంత్రీకరణతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సేవలను కూడా రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.20,000 ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని సీఎం గుర్తుచేశారు. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.14,000, కేంద్రం వాటాగా రూ.6,000 కలుపుకుని పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 47 లక్షల మంది రైతులకు రెండు విడతల్లో రూ.6,309 కోట్లు జమ చేశామని, గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,670 కోట్లు కూడా తామే చెల్లించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని, ఇప్పటివరకు రూ.10,816 కోట్లు చెల్లించామని వివరించారు. ఉచిత విద్యుత్ కోసం 2025-26 బడ్జెట్‌లో రూ.13,722 కోట్లు కేటాయించామని, ఈ ఏడాది కొత్తగా 69 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామని చెప్పారు.

**రాయలసీమ ఇక ఉద్యాన హబ్**

రాష్ట్రంలో ఉద్యానవన, ఆక్వా రంగాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు రూపొందించామని చంద్రబాబు తెలిపారు. రాయలసీమను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రూ.30 వేల కోట్లతో క్లస్టర్ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రైవేటు పెట్టుబడులతో కలిపి మొత్తం రూ.1 లక్ష కోట్లతో సీమ రూపురేఖలు మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం 400 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తులను 1000 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచడమే లక్ష్యమన్నారు. అలాగే, ఏలూరులో ప్రపంచంలోనే అతిపెద్ద 'కోకో సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం సంచలన ప్రకటన చేశారు. నీటి భద్రతపై తీసుకున్న చర్యల వల్ల అన్నమయ్య జిల్లాలో భూగర్భ జలాలు 6.67 మీటర్ల మేర పెరిగాయని, రాష్ట్ర సగటున 7.31 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. దీనివల్ల రూ.95 కోట్ల విలువైన విద్యుత్ ఆదా అయ్యిందని చెప్పారు. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని, సాగునీటి సంఘాలను బలోపేతం చేసి రైతన్నకు భరోసా కల్పిస్తామని సీఎం చంద్రబాబు తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

# సత్యమే గెలిచింది

హైదరాబాద్ : సత్యమేవ జయతే.... అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం ట్వీట్ చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉన్న ఆమెపై మోపిన అభియోగాలను నిరాధారమైనవిగా పేర్కొంటూ న్యూఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కేసును కొట్టివేసిన నేపథ్యంలో శుక్రవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. మద్యం కేసులో తనపై అనవసరంగా నిందలేశారనీ, అలా నిందలేసిన వారు ఇప్పుడేమంటారు? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్ పట్ల ఆమె అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఓటమికి లిక్కర్ పాలసీ కేసు కారణమన్నట్టుగా ఆ ట్వీట్ ఉందని ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. తన అరెస్ట్ ఎన్నికల అనంతరం జరిగిందనీ, బీఆర్ఎస్ ఓటమికి ఉద్యోగాలు, ఇండ్లు ఇవ్వకపోవడం, ఉద్యమ ద్రోహులకు టికెట్లు ఇవ్వడం, అహంకారమే కారణమని అన్నారు. కడిగిన ముత్యంలా వస్తాననీ తాను చెప్పినట్టుగానే తీర్పు వచ్చిందని ఆమె గుర్తుచేశారు. కేసును ఎదుర్కొంటున్న సమయంలో తనకు అండగా నిలిచిన తన అత్తమామలకు, భర్తకు, ఆ కుటుంబంలోని సభ్యులందరికీ కవిత ధన్యవాదాలు తెలిపారు. కష్టసమయంలో అండగా నిలిచిన తన తల్లిదండ్రులకూ ధన్యవాదాలు తెలిపారు. కోర్టు తీర్పు సంతోషం కలిగించినా, ఐదున్నర నెలలు తనను కుటుంబానికి దూరం చేశారనీ, అవమానాలు, బాధ, వ్యక్తిత్వ హననం చేశారనీ, ఆ నష్టం ఎవరు భర్తీ చేస్తారని ఆమె ప్రశ్నించారు. ఎన్ని కోట్లు ఇచ్చినా ఆ అవమానం, సమయం తిరిగి రాదన్నారు. బీఆర్ఎస్ ఓటమిని తన మెడలో వేసేలా చూస్తే ప్రజలు హర్షించరనీ, వాస్తవాలు అంగీకరించి కేటీఆర్ నిజాలు మాట్లాడాలని సూచించారు. కేసును ఎదుర్కొంటున్న సమయంలో బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం తనకు సహకరించలేదనీ, బీజేపీ చేసిన తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కోవడంలో విఫలమైందని అన్నారు. పార్టీ స్థాపించబోయే రెండు నెలల ముందు తీర్పు రావటం తనకు ప్రకృతి ఆశీర్వాదంగా భావిస్తున్నట్టు తెలిపారు. మద్యం కేసులో ఉన్న వారందరికి క్లీన్ చిట్ రావటాన్ని కవిత స్వాగతించారు.

### ఏపీ సీఎం చంద్రబాబుతో
# తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి భేటీ

ఏపీ సీఎం చంద్రబాబును తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమారుడి వివాహానికి హాజరు కావాలని చంద్రబాబును భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వానించారు. భట్టి విక్రమార్క కుమారుడు సూర్యవిక్రమాదిత్య వివాహం మార్చి 5వ తేదీన హైదరాబాద్‌లో జరగనుంది. ఈ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబు కలిసి చంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల నేతలు కాసేపు ముచ్చటించుకున్నారు. ఈ సమావేశం పూర్తిగా మర్యాదపూర్వకంగానే జరిగిందని, ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టమవుతోంది. తన కుమారుడి వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని చంద్రబాబును భట్టి విక్రమార్క కోరారు.

# ఇరాన్‌తో ఉద్రిక్తతలు: ఇజ్రాయెల్ ఎంబసీ అధికారులకు అమెరికా రాయబారి కీలక ఆదేశాలు

ఇరాన్‌తో ఉద్రిక్తతల వేళ, ఇజ్రాయెల్‌ను వెంటనే వీడాలని అమెరికా రాయబారి మైక్ హకబీ అక్కడి ఎంబసీలోని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్, అమెరికా మధ్య గత కొన్నాళ్ళుగా ఉద్రిక్తతలు కొనసాగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా రాయబారి ఈ ఆదేశాలు జారీ చేశారు. వెంటనే ఇజ్రాయెల్‌ను వీడి స్వదేశానికి వెళ్లాలని సూచించారు. సిబ్బంది అమెరికా వెళ్లడానికి అయ్యే ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇప్పటికిప్పుడు భయపడాల్సిందేమీ లేదని, కానీ ఇరాన్‌పై అమెరికా భీకర దాడికి ముందే ఇజ్రాయెల్‌ను వీడితే మంచిదని సూచించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇరాన్‌పై దాడులకు దిగే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించారు. తమతో అణుఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ట్రంప్ హెచ్చరికలు చేసినప్పటికీ అణు ఒప్పంద చర్చలు అంత ఫలప్రదంగా ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో అమెరికా రాయబారి ఇజ్రాయెల్‌లోని తన ఎంబసీకి తాజాగా ఆదేశాలు జారీ చేశారు. అమెరికా తమపై దాడి చేస్తే ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ ఇప్పటికే పలుమార్లు అమెరికాకు స్పష్టం చేసింది. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలను నాశనం చేస్తామని ప్రకటించింది.

## 'జీఐ ఆన్ వీల్స్' పేరుతో తెలంగాణ ఆర్టీసీ సరికొత్త కార్యక్రమం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తన బస్సుల ద్వారా రాష్ట్రసాంస్కృతిక వైభవాన్ని చాటేందుకు ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'జీఐ ఆన్ వీల్స్' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి చెందిన ఆరు భౌగోళిక గుర్తింపు (GI) పొందిన కళారూపాలను బస్సులపై అందంగా ప్రదర్శించనుంది. దేశంలోనే ఇటువంటి ప్రయోగం చేయడం ఇదే తొలిసారి. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఈ ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోచంపల్లి ఇక్కత్, నారాయణపేట చేనేత చీరలు, నిర్మల్ పెయింటింగ్స్, చేర్యాల స్క్రోల్ పెయింటింగ్, వరంగల్ తివాచీలు, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ కళాకృతులను బస్సులపై ముద్రించారు. జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ఈ కళారూపాలకు ఆకర్షణీయమైన డిజైన్లను రూపొందించారు.

# పవన్ కల్యాణ్ నాకు జీవితాంతం పెద్దన్నే!

అభివృద్ధి చెందిన రాష్ట్రాలే దేశాన్ని బలోపేతం చేస్తాయని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ముంబైలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా 2026' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏబీపీ జర్నలిస్ట్ మేఘా ప్రసాద్‌తో జరిగిన ఫైర్ సైడ్ చాట్‌లో ఆయన ఏపీ అభివృద్ధి ప్రణాళికలు, రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక మాట ఇస్తే అది జరిగి తీరుతుందని, ఆయన నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించడమే తన ముందున్న కర్తవ్యమని లోకేశ్ అన్నారు. తమపై ఎలాంటి ఒత్తిడి లేదని, సవాళ్లను ఇష్టంగా స్వీకరిస్తామని తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన పవన్ కళ్యాణ్ తనకు బిగ్ బ్రదర్ అని, జీవితాంతం తనకు పెద్దన్నేనని ఆయన వ్యాఖ్యానించారు.

*** ఒకే రాజధాని.. క్లస్టర్లతో అభివృద్ధి వికేంద్రీకరణ**

"మేము కేవలం ఒక నగరాన్ని మాత్రమే నిర్మించడం లేదు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ అనే నినాదాన్ని బలంగా నమ్ముతాం. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను ఆర్థిక రీజియన్లుగా అభివృద్ధి చేస్తూ, వాటి పరిధిలో పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నాం," అని లోకేశ్ వివరించారు. క్లస్టర్ విధానాన్ని వివరిస్తూ, "ఉదాహరణకు ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఫాక్స్‌కాన్ లాంటి ఒక కంపెనీని తీసుకురావడమే కాకుండా, ఐఫోన్ అసెంబుల్‌కు అవసరమైన అన్ని విడిభాగాల తయారీదారులను ఒకేచోటకు తీసుకురావడమే మా వ్యూహం. దీని ద్వారా అభివృద్ధిని రాష్ట్రవ్యాప్తంగా వికేంద్రీకరించడం సుసాధ్యమవుతుంది" అని తెలిపారు.

*** 'నమో' సర్కార్‌తో పెట్టుబడుల వెల్లువ**

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని లోకేష్ పేర్కొన్నారు. "ఒకటి, అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉన్న అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు... రెండవది, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. కేవలం 17 నెలల్లోనే దేశంలోనే అతిపెద్దదైన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు అన్ని అనుమతులు ఇచ్చాం. మార్చి మూడోవారంలో దానికి శంకుస్థాపన చేయబోతున్నాం. మూడవది, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. ఢిల్లీలో ప్రధాని మోదీ, ఏపీలో సీఎం నాయుడు కలయికను నేను 'నమో' (నాయుడుమోదీ) అని పిలుస్తాను. ఈ నాయకత్వం వల్లే భారతదేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి వచ్చాయి" అని ఆయన గణాంకాలతో వివరించారు.

*** భూమి కన్నా ఎకోసిస్టమ్ విలువైంది**

ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఆకర్షించేందుకు ఎకరా భూమిని 99 పైసలకే ఇస్తున్నామని, తాము ఇచ్చే భూమి విలువ కన్నా ఆ కంపెనీల రాకతో ఏర్పడే ఆర్థిక కార్యకలాపాలు, ఉద్యోగ కల్పన ఎన్నో రెట్లు అధికమని లోకేశ్ తెలిపారు. కాగ్నిజెంట్ కంపెనీని ఉదాహరణగా చూపుతూ, "విశాఖలో ఆ కంపెనీ ఏర్పాటుతో 25,000 ఉద్యోగాలు వస్తాయి. ఏటా రూ.1500 కోట్ల ఆర్థిక కార్యకలాపాలు జరుగుతాయి. భూమి విలువ కన్నా రాష్ట్రానికి వచ్చే ఈ ప్రయోజనం ఎంతో పెద్దది" అని స్పష్టం చేశారు.

# హింసతో ఏం సాధించలేం

హింసాయుత మార్గంలో ఏమీ సాధించలేమనీ, ప్రజాస్వామ్య మార్గంలోనే శాంతియుతంగా ప్రజలకు సేవలందించడానికి వీలవుతుందనీ, ఆ మార్గాన్ని మావోయిస్టులు ఎంచుకున్నందుకు అభినందనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సచివాలయంలో ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు పిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మరో కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, మావోయిస్టు రాష్ట్ర మాజీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, రాష్ట్ర కమిటీ సభ్యులు నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న, కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాదరావు, మరో కేంద్రకమిటీ సభ్యురాలు సుజాతలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో సీఎం పలు అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి, ఇంటలిజెన్స్ చీఫ్ విజరుకుమార్, ఎస్ఐబీ ఐజీ బీ సుమతి ఈ సమావేశంలో పాల్గొన్నారు. మావోయిస్టు మాజీ అగ్రనేతలను ఆప్యాయంగా పలుకరించిన ముఖ్యమంత్రి వారు ప్రజాస్వామ్యయుతంగా తమ భవిష్యత్ జీవితాన్ని గడపడానికి అజ్ఞాతం వీడి రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇదే దారిలో మిగితా వారు కూడా వెలుపలికి రావాలని విజ్ఞప్తి చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మావోయిస్టులు తమ పంథాను మార్చుకుని ప్రజాస్వామ్య మార్గంలో ప్రజలకు సేవ చేసుకోవడానికి అనేక మార్గాలున్నాయని సూచించారు. ముఖ్యంగా మావోయిస్టుల పునరావాసం కోసం, వారు సభ్య సమాజంలో గౌరవప్రదంగా నూతన జీవితాన్ని గడపడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదని గుర్తుచేశారు. పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న మావోయిస్టు పునరావాస పథకాలను పరిశీలించి మరింతగా ఈ సహాయాన్ని పెంచడానికి కూడా తాము ఆలోచన చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్నేహపూరిత వాతావరణంలో సాగిన ఈ సమావేశంలో ఒక్కో మావోయిస్టు నాయకునితో ముఖ్యమంత్రి ముఖాముఖిగా మాట్లాడుతూ పలు అంశాలపై చర్చించారు. లొంగిపోయిన మావోయిస్టులు తమకు ఒక్కొక్కరికి ఐదెకరాల భూమిని కేటాయించాలని కోరగా... అది సాధ్యం కాదని సీఎం తోసిపుచ్చారు. అలాంటప్పుడు ఒక్కొక్కరికి కోటి రూపాయల రివార్డును ఇవ్వాలని అడగ్గా...... పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జైళ్లలో మగ్గుతున్నమావోయిస్టులను కలిసేందుకు తమకు అనుమతివ్వాలని కోరగా.... దాందేముంది, తప్పకుండా అవకాశం కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మావోయిస్టు పునరావాస పథకాలకు ఆకర్షితులై ఇప్పటి వరకు 598 మంది మావోయిస్టులు లొంగుబాటులో నడిచారని వివరించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపునకు స్పందించి ప్రస్తుతం నలుగురు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలవడానికి వెలుపలికి వచ్చారని తెలిపారు

**.రక్షణ కల్పించండి-దేవ్‌జీ**

మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ మాట్లాడుతూ తాము ఎలాంటి ప్రాణాపాయం లేకుండా లొంగిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశం పట్ల కతజ్ఞతలు తెలిపారు. అయితే పునరావాసానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రివార్డు డబ్బును మరింత పెంచాలని కోరారు. తమకు రక్షణ కల్పిస్తూ జనజీవన స్రవంతిలో ముందుకు సాగడానికి తగిన వాతావరణాన్ని కూడా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన ముఖ్యమంత్రి, లొంగిపోయిన మావోయిస్టుల రక్షణ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం ఉండదనీ, ఆ విషయంలో పోలీస్ అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

### పాకిస్థాన్‌పై దాడులకు
# ఆత్మాహుతి దళాన్ని రంగంలోకి దించిన తాలిబన్లు!

పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య పరిస్థితులు తీవ్రరూపు దాల్చాయి. ఆఫ్ఘన్‌లోని ప్రధాన నగరాలపై పాకిస్థాన్ సైన్యం వైమానిక దాడులతో విరుచుకుపడగా, తాలిబన్లు ప్రతీకారంగా ఆత్మాహుతి దాడుల దళాలను (సూసైడ్ స్క్వాడ్) సిద్ధం చేశారు. "ఇక మా ఓపిక నశించింది, ఇది బహిరంగ యుద్ధం" అని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ ప్రకటించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పాకిస్థాన్ సైన్యం కాబూల్, కంధహార్, పక్తియా వంటి ప్రాంతాల్లోని తాలిబన్ సైనిక స్థావరాలు, హెడ్‌క్వార్టర్లు, ఆయుధ డిపోలపై ఎయిర్‌స్ట్రైక్స్ నిర్వహించింది. ఈ దాడుల్లో 133 మంది తాలిబన్ ఫైటర్లు మరణించారని, 200 మందికి పైగా గాయపడ్డారని, 27 పోస్టులను ధ్వంసం చేశామని పాక్ ప్రకటించింది. అయితే, పాకిస్థాన్ వాదనను తాలిబన్లు తోసిపుచ్చారు. తమ ఫైటర్లలో 8 మందే మరణించారని, 13 మంది సామాన్య పౌరులు గాయపడ్డారని తెలిపారు. అంతేకాకుండా, తమ ప్రతిదాడుల్లో 55 మంది పాక్ సైనికులు మరణించారని, 19 పోస్టులను స్వాధీనం చేసుకున్నామని తాలిబన్లు క్లెయిమ్ చేశారు. ఈ దాడుల తర్వాత, ఆత్మాహుతి దాడులకు సిద్ధమైన తమ ప్రత్యేక బెటాలియన్ ఫోటోను ఆఫ్ఘన్ ప్రభుత్వ మీడియా విడుదల చేసింది. పేలుడు పదార్థాలు నింపిన జాకెట్లు, కార్ బాంబులతో ఈ దళాలు పాకిస్థాన్‌లోని ప్రధాన లక్ష్యాలపై దాడులకు సిద్ధంగా ఉన్నాయని తాలిబన్ వర్గాలు తెలిపాయి. 2,600 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు (దురంద్ లైన్) వెంబడి తమ దాడులు కొనసాగుతాయని తాలిబన్ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. ఇరు పక్షాలూ చెబుతున్న మృతుల సంఖ్యను స్వతంత్రంగా ధృవీకరించే అవకాశం లేదు. ఈ పరిణామాలపై అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.



# డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి

* పలు కాలనీల్లో సీసీ రోడ్ల పనుల పరిశీలన: మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

బి.ఎన్. రెడ్డి నగర్, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నట్లు తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఎస్.కే.డి నగర్, హరిహరపురం కాలనీ, మరియు సామానగర్ కాలనీల్లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన కాలనీ వాసులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

**పాల్గొన్న ముఖ్య నాయకులు:**

ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రావు, సీనియర్ నాయకులు రవి శంకర్, మహేందర్ రెడ్డిలతో పాటు వివిధ కాలనీల అధ్యక్షులు శంకరయ్య గౌడ్ (హరిహరపురం), అమరేందర్ రెడ్డి (ఎస్.కే.డి నగర్), జానయ్య గౌడ్ (సామానగర్) పాల్గొన్నారు. అలాగే ఎస్.కే.డి నగర్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు, ట్రెజరర్ కృష్ణారావు, సామానగర్ ప్రధాన కార్యదర్శి సతీష్ చారి, కాలనీ ప్రతినిధులు రమేష్ బాబు, ప్రవీణ్ గౌడ్ తదితరులు ఈ పర్యవేక్షణలో పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరైన వల్లభనేని వంశీ

* గన్నవరం నియోజకవర్గంలో నకిలీ పట్టాల కేసు
* నూజివీడులోని కోర్టుకు హాజరైన వల్లభనేని వంశీ
* కోర్టు వద్దకు వచ్చిన వైసీపీ కార్యకర్తలతో ముచ్చటించిన వంశీ



అమరావతి, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఈరోజు ఏలూరు జిల్లా నూజివీడులోని కోర్టుకు హాజరయ్యారు. వైసీపీ హయాంలో గన్నవరం నియోజకవర్గంలో నకిలీ పట్టాలకు సంబంధించి ఆయనపై కేసు నమోదయింది. ఈ కేసుకు సంబంధించి ఈనాటి వాయిదాకు ఆయన హాజరయ్యారు. కోర్టు వద్దకు వచ్చిన పలువురు వైసీపీ కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసు, ఆ కార్యాలయంలో పని చేసిన వ్యక్తి కిడ్నాప్ కేసులకు సంబంధించి జైలు నుంచి బెయిలుపై విడుదలైన తర్వాత వల్లభనేని వంశీ ఎక్కువగా బయట కనిపించడం లేదు. కోర్టులో నకిలీ పట్టాల కేసు విచారణ నేపథ్యంలోనే ఈరోజు ఆయన బయటకు వచ్చారు.




## సీఎం రేవంత్‌తో మాజీ మావోయిస్టు నేతల భేటీ

* సచివాలయంలో సీఎంను కలిసిన ఆరుగురు మాజీ మావో నేతలు
* సీఎంను కలిసిన వారిలో దేవ్‌జీ, రాజిరెడ్డి, బడే చొక్కారావు తదితరులు
* పలు అంశాలపై చర్చలు జరిగినట్టు సమాచారం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : దశాబ్దాల పాటు అడవిని నమ్ముకుని సాయుధ పోరాటం చేసిన మావోయిస్టు పార్టీ అగ్రనేతలు ఇప్పుడు ప్రజాస్వామ్య మార్గంలోకి అడుగుపెడుతున్నారు. కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' చివరి అంకానికి చేరుకోవడంతో, కీలక నేతలు వరుసగా లొంగిపోతున్నారు. ఈ క్రమంలో, హైదరాబాద్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆరుగురు మాజీ మావోయిస్టు నేతలు ఈరోజు భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవలే డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయిన సీనియర్ నేతలు తిప్పిరి తిరుపతి (దేవ్‌జీ), మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్), బడే చొక్కారావు (దామోదర్), నూనె నరసింహారెడ్డి (గంగన్న)లతో పాటు సుజాతక్క, చంద్రన్నలు ముఖ్యమంత్రిని కలిశారు. దశాబ్దాల అజ్ఞాతవాసం తర్వాత ఈ అగ్రనేతలంతా నేరుగా అధికార కేంద్రమైన సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రితో భేటీకి వెళుతున్న సమయంలో మీడియా ప్రతినిధులు "సీఎంతో ఏం చర్చిస్తారు?" అని ప్రశ్నించగా, అగ్రనేత దేవ్‌జీ స్పందిస్తూ "పొలిటికల్ ఎజెండా" అని క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. దీనితో వీరంతా భవిష్యత్తులో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. లొంగిపోయిన నేతల పునరావాసం, వారి కుటుంబాల భద్రతపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం వీరు చేపట్టబోయే తదుపరి కార్యాచరణపై సీఎంకు వివరించినట్లు సమాచారం.

## ఢిల్లీ మద్యం కేసులో కవితకు క్లీన్ చిట్..
# స్పందించిన ధర్మపురి అరవింద్

* ఈ కేసులో సాక్ష్యాలు లేవని మాత్రమే కోర్టు తెలిపిందన్న ఎంపీ
* కవితకు క్లీన్ చిట్ రాలేదని అరవింద్ వ్యాఖ్య
* రాజకీయాల్లో చాలామంది చాలా రకాలుగా మాట్లాడుతారన్న ఎంపీ



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : ఢిల్లీ మద్యం కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు క్లీన్ చిట్ రావడంపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందించారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కవిత సహా పలువురికి ఊరట కలిగిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. సీబీఐ నమోదు చేసిన కేసును కోర్టు కొట్టివేసింది. ఈ అంశంపై ఎంపీ అరవింద్ స్పందిస్తూ, ఈ కేసులో సాక్ష్యాలు లేవని మాత్రమే కోర్టు తెలిపిందని, కానీ క్లీన్ చిట్ ఇవ్వలేదని వెల్లడించారు. కవిత ఆరోపిస్తున్నట్లుగా బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ ఒక్కటి కాదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో చాలామంది చాలా రకాలుగా మాట్లాడుతుంటారని, వాటన్నింటికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. కవితకు క్లీన్ చిట్ రావడంపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూడా స్పందించారు. ఇది బీజేపీ రాజకీయ డ్రామాగా ఆయన అభివర్ణించారు. పార్టీలు, నాయకులతో అవసరం ఉంటే ఒకలా, అవసరం తీరాక మరోలా బీజేపీ వ్యవహరిస్తుందని ఆరోపించారు. శత్రువు మిత్రుడు కావొచ్చు మిత్రుడు శత్రువు కావొచ్చని విమర్శించారు.

## బస్తీల బాట పట్టిన కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్లలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈరోజు పర్యటించారు. గల్లీ గల్లీ తిరుగుతూ బస్తీ వాసుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డారు. బీజేపీని రాజకీయంగా దెబ్బతీసి, నగరాన్ని మజ్లిస్ పార్టీకి అప్పగించేందుకే ఈ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల సమస్యలను గాలికొదిలేశాయని విమర్శించారు. నగరంలో తాగునీటి ఎద్దడి ప్రారంభమైందని, వర్షపు నీటి కాలువల్లో పూడిక తీయకుండానే కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవద్దని, సీఎం రేవంత్ రెడ్డి వెంటనే ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ సమస్యలపై వెంటనే నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఏపీ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి..
## జస్టిస్ లీసా గిల్ నియామకానికి కొలీజియం గ్రీన్ సిగ్నల్!

* కేంద్రానికి జస్టిస్ లీసా గిల్ పేరును సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
* ప్రస్తుతం పంజాబ్ - హర్యానా హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ లీసా
* మద్రాస్ హైకోర్టు సీజేగా జస్టిస్ సుశ్రుత్ అరవింద్ పేరు సిఫారసు



విజయవాడ, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) సరికొత్త చరిత్రకు సిద్ధమవుతోంది. ఏపీ హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా (సీజే) జస్టిస్ లీసా గిల్‌ను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి కీలక సిఫారసు చేసింది. ప్రస్తుతం ఆమె పంజాబ్ హర్యానా హైకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కేంద్రం నుంచి అధికారిక ముద్ర పడడమే తరువాయి, ఆమె అమరావతిలో బాధ్యతలు చేపట్టనున్నారు. సాధారణంగా ఒక ప్రధాన న్యాయమూర్తి పదవీ విరమణ చేసిన తర్వాత కొత్తవారి నియామకం జరిగేది. కానీ, ఈసారి సుప్రీంకోర్టు కొలీజియం తన పనితీరులో కీలక మార్పు తెచ్చింది. ప్రస్తుత సీజేలు రిటైర్ కావడానికి రెండు నెలల ముందే వారి వారసుల పేర్లను కేంద్రానికి పంపిస్తోంది. న్యాయపాలనలో ఎక్కడా విరామం లేకుండా చూడటం, పరిపాలనాపరమైన జాప్యాన్ని నివారించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన కారణం. మరోవైపు, మద్రాస్ హైకోర్టు సీజేగా జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారిని కొలీజియం సిఫారసు చేసింది. జస్టిస్ ధర్మాధికారి ప్రస్తుతం మధ్యప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు.

## రూ. 329కే కిలో నెయ్యి ఎలా వస్తుంది?: సోము వీర్రాజు

* ఇంట్లో వాడే నాణ్యమైన నెయ్యి కిలో రూ.2 వేలు పలుకుతోందన్న వీర్రాజు
* తక్కువ ధరకు నాణ్యమైన నెయ్యి రాదని వ్యాఖ్య
* నెయ్యి విషయంలో డ్రామాలు ఆడితే దేవుడు క్షమించడని హెచ్చరిక



అమరావతి, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి ప్రసాదం తయారీలో గత ప్రభుత్వం అనుసరించిన విధానాలపై బీజేపీ శాసనమండలి పక్ష నేత సోము వీర్రాజు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడిన ఆయన, తక్కువ ధరకు నాణ్యమైన నెయ్యి రావడం అసాధ్యమని, ఇది భక్తుల మనోభావాలతో ఆడుకోవడమేనని మండిపడ్డారు. సాధారణంగా మనం ఇంట్లో వాడే నాణ్యమైన నెయ్యి కిలో రూ. 2 వేలు పలుకుతుంటే, కోట్లాది మంది ఆరాధించే వేంకటేశ్వరస్వామి ప్రసాదం కోసం రూ.329కే నెయ్యి ఎలా కొంటారని సోము వీర్రాజు నిలదీశారు. "రూ. 329కి నెయ్యి కొన్న వారు, ఇప్పుడు రూ. 658కి కొంటారా అని వితండవాదం చేస్తున్నారు. తక్కువ ధరకే ఆవు నెయ్యి వస్తుందంటూ డ్రామాలు ఆడితే దేవుడు కూడా క్షమించడు" అని హెచ్చరించారు. లడ్డూ ప్రసాదం విషయంలో రాజీ పడకూడదని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో ప్రజా సమస్యలపై చర్చ జరగడం లేదన్న ఆవేదనతోనే తాను చైర్మన్‌ను కలవడానికి వెళ్లానని, అయితే తనపై దాడికి ఉసిగొల్పడం దారుణమని వీర్రాజు ఆవేదన వ్యక్తం చేశారు. "లక్షన్నరకు పైగా జీతం తీసుకుంటూ సభలో ప్రజల పక్షాన ప్రశ్నించే అవకాశం లేకపోతే బాధగా ఉంటుంది. ప్రశ్నలు వాయిదా వేయవద్దని కోరడానికి వెళితే అడ్డుకోవడం ఎంతవరకు సబబు?" అని ప్రశ్నించారు. సభలో ప్రశ్నల సమయంలో ప్రతిపక్షానికి 20 నిమిషాల సమయం ఇచ్చి, సమాధానం చెప్పాల్సిన మంత్రికి కేవలం 7 నిమిషాలే ఇవ్వడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇది ప్రశ్నలా కాకుండా ప్రసంగంలా సాగుతోందని ఎద్దేవా చేశారు.

# కోనసీమ జిల్లాలో పరువు హత్య..
## చెల్లిని పెళ్లి చేసుకున్నాడని యువకుడిని చంపేసిన అన్నలు

* గురువారం అన్నవరంలో పెళ్లి.. మరుసటి రోజే దారుణం
* వేర్వేరు కులాలు కావడంతో యువతి కుటుంబ సభ్యుల ఆగ్రహం
* అర్ధరాత్రి దాడి చేసి బండరాయితో తలపై మోది చంపిన యువతి సోదరులు



అమరావతి, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. తమ చెల్లిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడనే కోపంతో ఇద్దరు సోదరులు ఓ యువకుడిని దారుణంగా హతమార్చారు. కులాంతర వివాహం చేసుకోవడమే ఈ దారుణానికి కారణమని తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారపూడి శివారు వేములపల్లిలో వస్త్ర వ్యాపారం చేసుకునే పీవీవీ సూర్యప్రకాశరావు (41), రాయవరంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అయినవిల్లి సంధ్య కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ హైస్కూలు స్నేహితులు కావడం విశేషం. సూర్యప్రకాశరావుది తమ కులం కాకపోవడంతో సంధ్య కుటుంబం వీరి ప్రేమను తిరస్కరించింది. అయినా సరే, ఒకటవ్వాలని నిశ్చయించుకున్న ఈ జంట గురువారం ఉదయం అన్నవరం సత్యనారాయణ స్వామి సన్నిధిలో పెళ్లి చేసుకున్నారు. వివాహం తర్వాత సంధ్యను తీసుకుని సూర్యప్రకాశరావు వేములపల్లిలోని తన నివాసానికి వెళ్లారు. తమ చెల్లెలి పెళ్లి విషయం తెలిసి సూర్యప్రకాశరావుపై సంధ్య సోదరులు చంద్రపాల్, గిరిబాబు కక్ష పెంచుకున్నారు.

**అర్ధరాత్రి కిరాతకం..**

గురువారం అర్ధరాత్రి సమయంలో సూర్యప్రకాశరావు ఇంటిపై దాడి చేసిన నిందితులు.. అతడిని బయటకు లాగి బండరాయితో ముఖంపై చితకబాదారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సూర్యప్రకాశరావు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న స్థానికులు నిందితులను పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన మండపేట రూరల్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లైన 24 గంటలు గడవకముందే భర్త కళ్లముందే విగతజీవిగా పడి ఉండటం చూసి భార్య సంధ్య శోకసముద్రంలో మునిగిపోయింది.

## లిక్కర్ స్కాం కేసులో కవితకు క్లీన్ చిట్... కేటీఆర్ స్పందన



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవితకు కోర్టులో న్యాయం జరిగిందని, ఇదే విధంగా తమ పార్టీ నేతలపై పెట్టిన ప్రతి ఒక్క అక్రమ కేసు వీగిపోతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కల్పిత ఆరోపణలతో సృష్టించిన ఈ కేసు ద్వారా బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా దెబ్బతీశారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో స్పందించారు. కేటీఆర్ తన ప్రకటనలో, "లిక్కర్ స్కాం అనే కట్టుకథతో కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కూల్చేశారు. అదే కథనాన్ని అడ్డం పెట్టుకుని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను రాజకీయంగా నష్టపరిచారు. ఈరోజు కోర్టులో కవిత గారికి న్యాయం జరిగింది. ఇదే స్ఫూర్తితో మా నేతలపై బనాయించిన ప్రతి కేసు అబద్ధమని, రాజకీయ ప్రేరేపితమని, కల్పితమని త్వరలోనే రుజువవుతుంది" అని పేర్కొన్నారు. ఆ నిజం నిలదొక్కుకునే వరకు కాంగ్రెస్, బీజేపీల నుంచి నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం కొనసాగుతూనే ఉంటాయని అన్నారు. ప్రధాన పార్టీలు చేసే ఆరోపణలకు మీడియా ట్రయల్స్ తోడై తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. "దురదృష్టవశాత్తు ఇదే 'న్యూ ఇండియా'లో కొత్త ధోరణిగా మారింది. ఇక్కడ ఆధారాలతో పనిలేదు, ఆరోపణలు చేస్తే చాలు. న్యాయ ప్రక్రియ స్థానంలో మీడియా కథనాలు ప్రచారం పొందుతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ, ఎన్ని కుట్రలు చేసినా, ఎంత దుష్ప్రచారం చేసినా చివరికి న్యాయమే గెలుస్తుందని, తమపై మోపిన కేసులన్నీ అవాస్తవాలని తేలిపోవడం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు.

## తెలంగాణ ఉద్యోగులకు 'భారీ' ఊరట.. రూ. 745 కోట్ల బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం!

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రూ. 745 కోట్ల నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం ఈ రోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకుని బకాయిల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అధికారులు చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేశారు.

**హామీ నెరవేర్చిన సర్కార్**

ఉద్యోగ సంఘాలతో గతంలో జరిపిన చర్చల సందర్భంగా.. పెండింగ్ బకాయిలను విడతల వారీగా క్లియర్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం మొదటి విడతలో భాగంగా ఈ భారీ మొత్తాన్ని కేటాయించింది. జీతాలు, పెన్షన్లు మరియు ఇతర అలవెన్సుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఈ నిర్ణయంతో పెద్ద ఉపశమనం లభించినట్లయింది.

**పంచాయతీలకూ నిధుల పంపిణీ**

స్థానిక సంస్థల బలోపేతానికి కూడా ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రూ.389 కోట్ల నిధులను విడుదల చేసింది. దీనివల్ల గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణ మరియు ఇతర అత్యవసర పనులకు మార్గం సుగమం కానుంది.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.